తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 02.09.2026 | సంపుటి :13 సంచిక : 44 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్













## ప్రజా ప్రభుత్వానికి 1000 రోజులు

### సంక్షేమం.. అభివృద్ధి.. సామాజిక న్యాయం ప్రపంచ స్థాయికి తెలంగాణ

**ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో సెప్టెంబర్ 1వ తేదీ నాటికి విజయవంతంగా 1000 రోజులు మైలురాయిని చేరుకున్న ప్రజా ప్రభుత్వం**

- 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ. 2 లక్షల వరకు రుణ విముక్తి
- రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు.. రైతు సంక్షేమానికి రూ. 1.72 లక్షల కోట్ల వ్యయం
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు దాదాపు రూ.12,167 కోట్ల బస్సు ఛార్జీల ఆదా
- గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు
- 43 లక్షల కుటుంబాలకు రూ.500 కే గ్యాస్ సిలిండర్
- 4.54 లక్షల మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు. రూ.1900 కోట్ల వడ్డీ రాయితీ
- తొలి విడత 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం. గ్రేటర్ సిటీలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్, లక్ష మందికి ఇందిరమ్మ ఇండ్లు
- 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ. మరో 7437 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్
- 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ.. 15.46 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ
- సామాజిక భద్రతను మరింత విస్తరిస్తూ కొత్తగా 2.25 లక్షల మందికి పెన్షన్లు
- 22 లక్షలకు పైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం. రూ.720 కోట్లు కేటాయింపు
- ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 5,18,186 మంది పేద రోగులకు రూ.2,527 కోట్ల సాయం
- రిటైర్డ్ ఉద్యోగులకు 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- 2025-26 లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లు.. 12.14 లక్షల ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు
- హైదరాబాద్‌లో 355 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు




జారీచేసిన వారు : సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

**ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం...**

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
02 సెప్టెంబర్ 2026

## తెలంగాణ ఉద్యోగుల ఆందోళన

సంపాదకీయం

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు నెలల తరబడి తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ ఆందోళన కేవలం ఒక వర్గం ప్రయోజనాల కోసమే కాదు, పరిపాలనా వ్యవస్థ సజావుగా నడవాలంటే ఉద్యోగుల మనోధైర్యం, ఆర్థిక భద్రత ఎంత అవసరమో గుర్తుచేసే హెచ్చరిక కూడా.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్ ఈ ఆందోళనలో కీలకమైనది. సీపీఎస్ విధానం ఉద్యోగ విరమణ తర్వాత జీవితానికి హామీ ఇవ్వకపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దేశంలో పలు రాష్ట్రాలు ఇప్పటికే ఓపీఎస్ దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విషయంలో స్పష్టమైన విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రెండవ పీఆర్సీ సిఫార్సుల అమలులో జాప్యం ఉద్యోగుల్లో మరింత అసంతృప్తికి కారణమవుతోంది. వేతన సవరణ అనేది ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉద్యోగుల జీవన ప్రమాణాలను కాపాడేందుకు ఉద్దేశించినది. దీన్ని ఖరారు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల లక్షలాది కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోంది. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, జీపీఎఫ్, టీజీఎల్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి పెండింగ్ బిల్లుల చెల్లింపులు కూడా ఉద్యోగులు, పెన్షనర్ల నిత్యావసరాలను ప్రభావితం చేస్తున్నాయి. వీటిని వెంటనే క్లియర్ చేయడం ప్రభుత్వ బాధ్యత.

ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో లోపాలు కూడా తీవ్రమైన సమస్యగా మారాయి. చాలా ఆసుపత్రులు ఈహెచ్ఎస్ కింద చికిత్స అందించడానికి నిరాకరిస్తుండటం, నగదు రహిత చికిత్స సక్రమంగా అందకపోవడం వంటి ఫిర్యాదులు తరచూ వినిపిస్తున్నాయి. ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఈ డిమాండ్లన్నీ కొత్తవి కావు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నవే. చర్చల ద్వారా పరిష్కారం లభించకపోవడంతో ఉద్యోగ సంఘాలు సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. ఇలాంటి ఆందోళనలు పరిపాలనపై ప్రతికూల ప్రభావం చూపడమే కాక, ప్రభుత్వ, ఉద్యోగుల మధ్య అపనమ్మకాన్ని కూడా పెంచుతాయి. కాబట్టి రోడ్డెక్కే పరిస్థితి రాకముందే ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చిత్తశుద్ధితో చర్చలు జరిపి, న్యాయమైన డిమాండ్లపై స్పష్టమైన కాలపరిమితితో కూడిన హామీలు ఇవ్వాలి. ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవడం అంటే పరోక్షంగా ప్రజా సేవల నాణ్యతను మెరుగుపరచడమేనన్న విషయాన్ని ప్రభుత్వం విస్మరించకూడదు.

---

### అబద్ధాలు ఇంకా సింహాసనము దిగలేదు

రాజకీయ నాయకుల
తియ్యని మాటలు
అధికార దాహంలో
వాళ్ళు తాగే అబద్ధాల
చెలిమె నీళ్ళు,
మార్పుకోసం
ఆశగా చూసే
పేదల కన్నీటి
ధారలవి,

ప్రపంచ చరిత్రలో
రాజకీయాలు,
పార్టీల సిద్ధాంతాలు,
చిత్తు కాగితాల మీద రాసిన
హామీల కుప్పలు
అన్ని నామమాత్రలు
అబద్ధాలు రాసులు...

మాటల మాంత్రికులు
చిలకరించే మాటలకు
మతిలేక
మైమరిసే మాములు ప్రజలు
ఇదేం కొత్తకాదు...!

కూలిన
రాజ్యాల సింహనాలకింది
నుండి పారుతూ
నేటి రాజకీయ పునాదుల్లోకి
ఇంకిన ప్రజల నెత్తురుకు
బలమిచ్చేదే ఆశ
అబద్ధ కిరీటాన్ని ధరించిన
అధికారానికి అదే ఆజ్యం
ఇప్పటికీ ఎప్పటికీ
సింహాసనాలను బలంగా ఉంచే
రాజ్యాధికారానికి అబద్ధమే
కవచం..

మచ్చూరి వెంకట్

---

# ప్రజాస్వామిక ప్రజా పాలనకు వెయ్యి రోజులు



తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 డిసెంబర్ 7 కీలక మలుపు. పదేళ్ల పాలన తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎ. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రజల ఆకాంక్షలు, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2026 సెప్టెంబర్ 1 నాటికి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల హామీలు ఎంతవరకు అమలయ్యాయి? ప్రజల జీవితాల్లో ఎంతమేర మార్పు వచ్చింది? ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలేమిటి? అన్నది సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

వెయ్యి రోజుల పాలనను కేవలం విజయాల జాబితాగా చూడటం ఎంతవరకు సరైనది కాదో, ప్రతిపక్ష విమర్శల ఆధారంగా పూర్తిగా వైఫల్యంగా చిత్రీకరించడం కూడా అంతే తప్పు. గణాంకాలు, విధానాలు, అమలు తీరు, ప్రజల అనుభవాలు, ఆర్థిక పరిస్థితులు, పరిష్కారం కాని సమస్యల ఆధారంగానే పాలనను అంచనా వేయాలి.

రైతు సంక్షేమంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ ద్వారా 25 లక్షలకు పైగా రైతులకు ప్రయోజనం కల్పించినట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లు చెల్లించామని, సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ కొనసాగిస్తున్నామని తెలిపింది. అయితే రైతు సంక్షేమానికి అసలు కొలమానం ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం కాదు; రైతు కుటుంబాల నికర ఆదాయం ఎంత పెరిగింది అన్నదే. రుణమాఫీ తాత్కాలిక ఊరట ఇవ్వొచ్చు. కానీ పంటకు గిట్టుబాటు ధర, సాగు వ్యయ నియంత్రణ, మార్కెట్ రక్షణ, నిల్వ సదుపాయాలు, విలువ ఆధారిత పరిశ్రమల ద్వారా రైతు ఆదాయాన్ని స్థిరీకరించాల్సిన అవసరం ఉంది.

మహిళల సంక్షేమంలో ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించాయి. ముఖ్యంగా ఉచిత బస్సు ప్రయాణం మహిళల చలనం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను పెంచే అవకాశం కల్పించింది. అయితే సంక్షేమంతో పాటు మహిళల ఆదాయం పెంచే స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ అవకాశాలు విస్తరించాలి.

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని ప్రభుత్వం తెలిపింది. అర్హులకు రూ. 5 లక్షల వరకు సాయం అందించనున్నట్లు పేర్కొంది. ఇక్కడ మంజూరైన ఇళ్ల సంఖ్య కంటే పూర్తయిన ఇళ్ల సంఖ్య, నిధుల విడుదల, నిర్మాణ నాణ్యత, అర్హుల ఎంపికే అసలు విజయానికి ప్రమాణాలు.

సామాజిక భద్రతలో 2.25 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసి, మొత్తం 43 లక్షలకు పైగా లబ్ధిదారులు పింఛన్లు పొందుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు ఇది అవసరమైన భరోసా. అదే సమయంలో అర్హులందరికీ పింఛన్లు చేరడం, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా మొత్తాన్ని సమీక్షించడం కూడా అవసరం. సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణ కోసం సమగ్ర సర్వే చేపట్టింది. ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు శాసనసభ ఆమోదం వంటి నిర్ణయాలు సామాజిక న్యాయ చర్చను ముందుకు తెచ్చాయి. అయితే వీటిని చట్టపరమైన, రాజ్యాంగపరమైన ప్రక్రియలతో స్థిరమైన విధానాలుగా మార్చాల్సి ఉంది.

ఉద్యోగాల విషయంలో యువత ఆశలు ఎక్కువ. 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించి నియామక ప్రక్రియలో పారదర్శకతకు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. అయితే ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కావు. ప్రైవేటు పరిశ్రమలు, ఐటీ, సేవారంగం, చిన్న పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లోనూ విస్తృత అవకాశాలు కల్పించాలి. పెట్టుబడులు వచ్చినప్పుడు అవి ఎన్ని ఉద్యోగాలుగా మారాయి అన్నది కూడా లెక్కించాలి.

టీజీ-ఐపాస్ ద్వారా రూ. 1.29 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. 2025--26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరిందని తెలిపింది. ఇవి రాష్ట్ర ఆర్థిక సామర్థ్యాన్ని సూచించే గణాంకాలే అయినా, ఆదాయ అసమానతలు, గ్రామీణ--పట్టణ వ్యత్యాసాలు, పెట్టుబడుల వాస్తవ అమలు, స్థానిక ఉపాధి వంటి అంశాలను కూడా పరిశీలించాలి. హైదరాబాద్ ఆధారిత వృద్ధితో పాటు జిల్లాల్లో పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయ ఆధారిత రంగాలు, సేవారంగం అభివృద్ధి చెందాలి.

ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచడం కీలక నిర్ణయం. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, మందులు, పరికరాలు, పరీక్షా సదుపాయాలు పెరిగి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలి. విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులతో పాటు బోధన నాణ్యత, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి పెరగాలి.

హైదరాబాద్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఇంజిన్‌గా ఉన్నప్పటికీ ట్రాఫిక్, కాలుష్యం, చెత్త, వరదలు, తాగునీరు, గృహ వ్యయం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. నగర అభివృద్ధి పెట్టుబడులకు మాత్రమే కాకుండా ప్రజలకు నివాసయోగ్యంగా ఉండేలా సాగాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ వంటి ద్వితీయ శ్రేణి నగరాలను అభివృద్ధి చేస్తే ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి. ప్రజాస్వామిక పాలనకు పారదర్శకత, జవాబుదారీతనం కీలకం. ప్రభుత్వ కార్యాలయాల్లో మధ్యవర్తుల అవసరం లేకుండా సేవలు అందాలి. దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారానికి గడువు, బాధ్యత వహించే అధికారి ఉండాలి. టెండర్లు, పనుల పురోగతి, నిధుల వినియోగం, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పెరగాలి. అవినీతిని తగ్గించేందుకు డిజిటలీకరణతో పాటు వ్యవస్థలోనే అవినీతి అవకాశాలను తగ్గించే సంస్కరణలు అవసరం.

వెయ్యి రోజుల పాలనపై ప్రభుత్వం విజయాలను చెబుతుండగా, ప్రతిపక్షం నెరవేరని హామీలు, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, పింఛన్‌దారుల సమస్యలను ముందుకు తెస్తోంది. ఈ భిన్న వాదనల మధ్య వాస్తవాలను నిర్ధారించేందుకు స్వతంత్ర గణాంకాలు, సామాజిక తనిఖీలు, ప్రజాభిప్రాయ సర్వేలు అవసరం. ప్రతిపక్షం కేవలం విమర్శలకు పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ విధానాలు చూపాలి. ప్రభుత్వం కూడా విమర్శలను ప్రజాస్వామ్య చర్చలో భాగంగా స్వీకరించాలి.

మీడియా పాత్ర ఇక్కడ మరింత కీలకం. ప్రభుత్వ ప్రకటనలను ప్రచురించడం మాత్రమే కాదు; రైతు రుణమాఫీ ఎంతమందికి చేరింది? ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి? ఎన్ని ఉద్యోగాలు భర్తీ అయ్యాయి? పెట్టుబడుల్లో ఎంత వాస్తవంగా కార్యరూపం దాల్చింది? వంటి ప్రశ్నలకు డేటా ఆధారంగా సమాధానాలు వెతకాలి. అదే బాధ్యతాయుత జర్నలిజం.

వెయ్యి రోజుల పాలనను ఒక వాక్యంలో చెప్పాలంటే "హామీల నుంచి అమలు దిశగా ప్రయాణం ప్రారంభమైన కాలం; అయితే పూర్తి ఫలితాల కోసం ఇంకా ముందుకు సాగాల్సిన కాలం." రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళల ఉచిత ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్, ఇళ్ల నిర్మాణం, పింఛన్లు, ఆరోగ్యశ్రీ విస్తరణ, ఉద్యోగ నియామకాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేసిన నిర్ణయాలు. కానీ వాటి దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం, అమలు నాణ్యత, అర్హులందరికీ చేరిక, రైతు ఆదాయ స్థిరీకరణ, యువత ఉపాధి, విద్యా--వైద్య రంగాల నాణ్యత వంటి అంశాలు ఇంకా పరీక్షలుగానే ఉన్నాయి.

ప్రజా ప్రభుత్వ విజయాన్ని ప్రభుత్వమే చెప్పుకునే గణాంకాలు నిర్ణయించవు. ప్రజల అనుభవమే నిర్ణయిస్తుంది. రైతు అప్పు తీర్చుకుని కుటుంబాన్ని నడపగలిగితే, యువతకు ఉద్యోగం లేదా స్వయం ఉపాధి లభిస్తే, మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం వస్తే, పేద కుటుంబానికి సొంత ఇల్లు లభిస్తే, వృద్ధుడికి సమయానికి పింఛను వస్తే, రోగికి డబ్బుల కొరతతో వైద్యం ఆగకపోతే, ప్రభుత్వ కార్యాలయంలో లంచం లేకుండా పని జరిగితేనే ప్రజా పాలన విజయవంతమైందని చెప్పాలి.

అందువల్ల వెయ్యి రోజులు సంబరాల సమయం మాత్రమే కాదు.. ఆత్మపరిశీలనకు కూడా సమయం. పూర్తయిన హామీలను గుర్తిస్తూ, అసంపూర్తి హామీలకు కాలపట్టిక ప్రకటిస్తూ, ప్రజా వనరులను సమర్థంగా వినియోగిస్తూ, తెలంగాణను సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, పారదర్శక పాలన వైపు నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

తెలంగాణ ప్రజలు రాష్ట్రం ఏర్పడినప్పుడు కేవలం కొత్త రాష్ట్రాన్ని కాదు.. తమ భవిష్యత్తును తాము నిర్ణయించుకునే హక్కు, యువతకు ఉపాధి, రైతుకు గౌరవం, మహిళలకు భద్రత, పేదలకు న్యాయం, పిల్లలకు నాణ్యమైన విద్య, అందరికీ సమాన అవకాశాలను కోరుకున్నారు. ఆ ఆకాంక్షలే ప్రజాస్వామిక ప్రజా పాలనకు అసలు పునాది. వెయ్యి రోజులు ముగింపు కాదు.. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే తదుపరి ప్రయాణానికి ఇది మరో బాధ్యతాయుతమైన ప్రారంభం. ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే ప్రజా పాలనకు అంతిమ నివేదిక.




డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

---

# ఉత్పత్తి కులాల సాహిత్యమే ఈ దేశచరిత్ర

**తమ జీవితాల్లో ఎన్ని ముళ్ళు గుచ్చుకుని, ఎన్నో గాయల పాలైనా ఈ సమాజ అభివృద్ధికి సర్వస్వం దారపోస్తున్నది, ఉత్పత్తికి ఊపిరి పోస్తున్నది శూద్ర వర్గాలనే చెప్పాలి. నిజంగా ఈ దేశ జీవనదుల్లో ప్రవహిస్తున్నదంతా వారి సెమట నెత్తుర్లే అని చెప్పాలి. దేశ సంపదకు మూల స్తంభాలుగా నిలుస్తున్నది ఉత్పత్తి కులాలైన వెనుకబడిన వర్గాల ప్రజలే. అట్లాంటి సబ్బండ వర్గాల ప్రజల సాహిత్యం గురించిన చర్చ తెలుగు సాహిత్యంలో జరగాల్సినంతగా జరగడం లేదు.**




గత వెయ్యేళ్ళ సాహిత్య చరిత్రలో చివరి అంకం కేటాయించబడ్డది బీసీలకే అని చెప్పక తప్పదు. ఈ కాలంలో సాహిత్య చరిత్రలో విస్మరించబడ్డ వర్గాల సాహిత్యాన్ని ఎత్తుకొని పతాక స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న వారిలో కవి, రచయిత, విమర్శకుడు అట్టెం దత్తయ్య చేస్తున్న కృషి గణనీయమైనది. బి.సి కులాల ప్రతిభ, సామర్థ్యాలు అగ్రహార పీఠాల ఆధిపత్యం వల్ల చిన్నచూపుకు గురైతూనే ఉన్నది. బి.సి లు అధిక సంఖ్యాకులుగా ఉండి కూడా తమ అస్తిత్వం కోసం వందల ఏళ్ల నుండి పెనుగులాడుతూనే ఉన్నారు. అగ్రకులాల కబంధ హస్తాల్లో చిక్కుకోవడం వలన తెలుగు సాహిత్యం అగ్రకుల సాహిత్యచరిత్రగా, వారి పాండిత్య సంపదగా వ్యక్తమవుతూ వచ్చింది. అక్షరాస్యతలో, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, వెనకబడిన కులాల అస్థిత్వమే ఆ సాహిత్యంలో ప్రస్తావన లేకుండా పోయింది. స్వాతంత్ర్యం వచ్చిన నలభై సంవత్సరాలు గడిచాకే తమ సొంత వాణిని విన్పించుకునే ప్రయత్నాలు ప్రారంభించే స్థితికి శూద్రకులాలు నెట్టబడ్డాయి.

'వెంటాడే కలాలు- వెనకబడిన కులాలు' అనే టైటిల్ తో జూలూరి గౌరీ శంకర్ నేతృత్వంలో రాసిన మొట్ట మొదటి బి.సి కులాల కవిత్వ సంకలనం వెలువడింది. ఆ తర్వాత ప్రారంభమైన బి.సి వాద సాహిత్యపు ధార 'ఎలగటి వ్యవసాయం' వలెనే సాగుతుంది. ఆ అస్థిత్వ రచనల ప్రవహ ఉధృతి పెరగాల్సిన అవసరంను "తెలంగాణ బి.సి వాద సాహిత్యం" పుస్తకం ద్వారా ప్రేరేపంచాడు దత్తయ్య. "సమానమైన మనుగడకోసం, మానవత్వం కోసం, సమ సమాజం కోసం వాదం ప్రశ్నిస్తుంది, పనిచేస్తుంది" అంటాడు అట్టెం దత్తయ్య. సమానత్వ లోకమే బిసివాద దృక్పథమని స్పష్టపరచడమనేది మొత్తం బిసి వాదానికే ఒక దిక్సూచి లాంటిది. ఇది ఆయన భావ విస్తృతికి, వాద అవగాహనకు ఒక తార్కాణంగా చెప్పవచ్చు. అందుకే ఉత్పత్తి కులాల సాహిత్యాన్ని దేశ యవనిక మీద చరిత్రగా నిలబెట్టాలంటే బలమైన బి.సి వాద సాహిత్యం - విమర్శను తేవాల్సిన దానిని గుర్తించి, ఆ పనిని తనే తలకెత్తుకొని "తెలంగాణ బి.సి వాద సాహిత్యం" అనే విమర్శనా గ్రంథ రచనతో సబ్బండ కులాల గొంతును ఎలుగెత్తి చాటుతున్నాడు అట్టెం దత్తయ్య.

డా. అట్టెం దత్తయ్య రాసిన ఈ "తెలంగాణ బి.సి వాద సాహిత్యం" అనే పుస్తకం 'బహుజనుల వీలునామా' అంటాడు డా. ఎస్. రఘు. నిజమే కాలం ఆరు ఋతువులుగా నడిచినట్లు ఈ పుస్తకంలో దత్తయ్య చేసిన విమర్శ కూడా పద్య కవిత్వం, పాట కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, విమర్శ అనే ఆరు ప్రక్రియలుగా సాగి దారిదీపం అవుతుంది. ఈ గ్రంథం చారిత్రక దృక్పథంతో అనేక ఉదాహరణలతో పరామర్శించి మన ముందు పెట్టాడు. విడిగా ఈ ప్రక్రియలపై విస్తారమైన విమర్శ జరిగి ఉండొచ్చు. కానీ బి.సి వాదంలో ఈ సాహిత్య ప్రక్రియలన్నిటిపై ఇప్పటిదాకా ఇటువంటి పుస్తకం రాలేదని చెప్పవచ్చు. తెలుగు బి.సి వాద సాహిత్యాన్ని ఆరు ప్రక్రియలుగా పరిశీలించి, పరిశోధించి, విమర్శనాస్థాపన చేసిన విమర్శకుడు నాకు తెలిసి ఒక్క అట్టెం దత్తయ్య తప్ప మరెవ్వరూ లేరు. అటువంటి కృషిని 2021నాటికే ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా, పరిశోధకుడిగా తెలంగాణ బి.సి వాద సాహిత్య విమర్శ పుస్తకం తీసుకోని రావడం గొప్ప కార్యంగా అభివర్ణించవచ్చు. పనిలో పనిగ, అనేక చర్చలు, వాదనల మధ్యన ఉన్న బహుజన పదానికి బదులుగా బి.సి సాహిత్యం అనే నామస్థాపన కూడా చేశాడు. ఇది సాహిత్య చరిత్రపై, భవిష్యత్ పై దత్తయ్యకున్న స్పష్టతను విశదపరుస్తుంది.

'తెలంగాణ బిసి వాద సాహిత్యం' గ్రంథంలో తెలంగాణ ప్రాంత సాహిత్యంలో బి.సి వాదాన్ని వెతుకులాడాడు. నివురుగప్పిన నిప్పుని ఊది మంటను రాజేసినట్టు పదకొండవ శతాబ్దం పాల్కురికి సోమనాథుడి లెగసీని తట్టి లేపాడు. ఆయన రాసిన 'పండితారాధ్య చరిత్ర, బసవ పురాణం, వృషాధిప శతకం' లో ఉన్న బి.సి కులాల ప్రస్తావనల్ని, సబ్బండ వర్ణాల జాడను మన ముందు తవ్వి పోశాడు అట్టెం దత్తయ్య. పద్యం సదా పండితుల పక్కలోనే కులికింది తప్పితే పామరులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ విషయం ఈ పుస్తకం చదివితే తేటతెల్లం అవుతుంది. అట్లా పురాణ సాహిత్యాన్ని వెలికి తీసే ఆధార పూర్వక ప్రస్తావన అట్టెం దత్తయ్య పరిశోధనా శ్రమకు నిదర్శనం. అదే విధంగా 1934 లో 354 మంది తెలంగాణ కవుల కవిత్వంతో వచ్చిన గోలకొండ కవుల సంచికలో పది మందికి పైగా బి.సి లు ఆనాడే కవిత్వం రాసిన విషయాన్ని తెలియపరిచాడు. గొల్ల కురుమల గురించి, అట్లనే ఉప్పరులు, మున్నూరు కాపులు, దర్జీలు, విశ్వబ్రాహ్మణులు, పద్మ శాలీలు, కుమ్మరులు, గౌండ్లు, పిచ్చుకగుంట్లవారు, మంగలి, మేదరులు, గంగిరెద్దులు, చాకలి, బెస్తలు ఇలాంటి వృత్తి, సేవా కులాల జీవన గమనంలో వేదనా భరితమైన సంక్షోభాల గురించి అనేక మంది కవులు రాసిన విషయాన్ని తెలుపుతూ రచయిత వేదన చెందుతాడు. అక్షరం ముక్క రాని పిచ్చుకగుంట్లవారు, ఆరు ఉప జాతులుగా ఉంటూ కామమ్మ, బాల నాగమ్మ, లక్ష్మమ్మ, సరోజమ్మ, సూర్య చంద్ర రాజుల చరిత్రను, కథా గేయాలను చదువొచ్చిన వారి కంటే అలవోకగా పాడి తిండి కోసం అడుక్కొని జీవిస్తారు. కానీ వారిని ఇటు సమాజంలో గానీ అటు సాహిత్యంలో గానీ ఎందుకు పట్టించుకోవడంలేదనే ప్రశ్న మన ముందు ఈ పుస్తకంలో ఉంచాడు అట్టెం దత్తయ్య. అట్లాగే వడ్డెర, కుమ్మరి, ఆరెకటికలు, గాండ్ల, జంగాల కులాల పై వచ్చిన వచన కవిత్వాన్ని వెలికితీసి చర్చించాడు రచయిత.

ఇంకా వృత్తులపై వచ్చిన సాహిత్యం కట్టలు తెంచుకొని ప్రవహించింది. ఇలా వృత్తులపై వచ్చిన పద్య కవిత్వంపై, వచన కవిత్వంపై, పాటలపై, నవలలో జీవితాల ఇతివృత్తాలపై, కథలలో బిసి కులాల జీవన గతిపై వచ్చిన సాహిత్యాన్ని వెలికి తీసి సమాజం ముందు ఉంచారు. అలాగే సాహిత్య విమర్శలో బిసి వాద విమర్శ స్థానంపై ప్రత్యేక చర్చను లేవనెత్తారు. విమర్శకులు బీసీ వాద సాహిత్య విమర్శను చేపట్టి చర్చిస్తే మరింత బిసి వాద సాహిత్యం మరింత ముందుకు పోయే అవకాశం ఉందని అట్టెం దత్తయ్య తన గ్రంథంలో ప్రస్తావించాడు. అందులో బి.సి కులాల సామాజిక, సాంస్కృతిక మూలాలను తడిమి, బి.సి వాద దృక్పథాన్ని విమర్శనాత్మకంగా చర్చకుపెట్టాడు అట్టెం దత్తయ్య. ఈ విమర్శనా గ్రంథం ద్వారా బి.సి వాద సాహిత్య చరిత్రను, విమర్శను, సాంస్కృతిక వైభవాన్ని, సామాజిక చలనాన్ని బి.సిల జీవన విస్తృతిని తాత్వికత స్థాయిలో నిలబెట్టాడు. అగ్రకులాల సాహిత్యంపై వచ్చిన విమర్శలు బి.సి వాద సాహిత్యంపై రాలేదు. అగ్రకులాలు కావాలనే బి.సి వాద సాహిత్యాన్ని విస్మరించారనే నిజాల్ని అట్టెం దత్తయ్య నిరూపించే యత్నం చేశాడు.

కథా సాహిత్యంపై బి ఎస్ రాములు విమర్శ గ్రంథంపై, జూలూరి గౌరీ శంకర్ సంపాదకత్వంలోనే మరో వ్యాస సంకలనం, బిసి వాద యువ కవిత్వంపై చింతం ప్రవీణ్ సంపాదకత్వంలో విమర్శనా గ్రంథాలు వచ్చాయి. అలాగే ఒక్కో ప్రక్రియను సమీక్షిస్తూ వ్యాసాలు కొంత మంది కవులు రాసారు. అలా విమర్శలో కొంత కృషి జరిగింది. కానీ అన్ని ప్రక్రియలు కలిపి విమర్శ రాలేదు. కానీ అట్టెం దత్తయ్య ఆరు ప్రక్రియలపై తెచ్చిన 'తెలంగాణ బి.సి. వాద సాహిత్యం' అనే సమగ్రమైన విమర్శనా గ్రంథం బి.సి సాహిత్య విమర్శలో మహత్తర కృషిగానే చెప్పాలి. రాబోయే బి.సి సాహిత్య విమర్శకు ప్రామాణికమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇట్లాంటి గ్రంథానికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీ సాహిత్య పురస్కారాన్ని ప్రకటించడం దత్తయ్య శ్రమకు, బిసి ఉత్పత్తి, సేవా కులాల సాహిత్యంపై పరిశోధనకు మంచి ప్రోత్సాహకరం. ఈ స్ఫూర్తితో బిసి సాహిత్యం వెల్లువలా రావాలని ఆశిద్దాం.



ఎ. విజయ్ కుమార్
రచయిత
9573715656

---

### వైరల్ అయిన నవ్వు..

# వెలుగులోకి రాని శ్రమ



నవ్వులు మనల్ని నవ్విస్తాయి. కొన్ని నవ్వులు మాత్రం మన సమాజం దాచిపెట్టిన జీవితాన్ని మన కళ్లముందుకు తీసుకొస్తాయి. అరుణ్ కుమార్ నవ్వు అలాంటిదే. సోషల్ మీడియాలో అతని నవ్వు మీమ్స్‌గా, కామెడీ వీడియోలుగా వైరల్ అయింది. కానీ ఆ నవ్వు వెనుక ఉన్న జీవితాన్ని ఎన్ని మంది చూశారు?

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కర్నకుంట గ్రామానికి చెందిన అరుణ్ నాలుగో తరగతి తర్వాత చదువు మానేశాడు. కటిక పేదరికం అతని చేతిలోని పుస్తకాన్ని తీసుకుని పనిముట్టు పెట్టింది. బడికి వెళ్లాల్సిన వయసులో లారీ పని, బొగ్గు దుమ్ము, చెమట అతని జీవితంలో భాగమయ్యాయి.

రహదారి పక్కన లారీ.. చేతిలో టీ కప్పు.. కొత్త చొక్కా.. ముఖమంతా అమాయకమైన నవ్వు. ఆ దృశ్యాన్ని లారీ డ్రైవర్ నెహ్రూ కెమెరాలో బంధించాడు. ప్రపంచం ఆ నవ్వును వినోదంగా చూసింది. కానీ నెహ్రూ ఆ నవ్వు వెనుక ఉన్న బాల్యాన్ని చూశాడు. ఆ వీడియోకు వచ్చిన వ్యాఖ్యలను అరుణ్ చదవలేదని తెలుసుకున్నప్పుడు అతనికి చదువు చెప్పాలనే ఆలోచన వచ్చింది. పెద్ద పాఠశాల లేదు. తరగతి గది లేదు. ఉన్నది లారీ క్యాబిన్, ప్రయాణాల మధ్య దొరికే కొద్దిపాటి సమయం, చదువుపై నమ్మకం. ఆ క్యాబిన్ తరగతి గదిగా మారింది. హైవే విద్యా మార్గమైంది. లారీ హెడ్‌లైట్ వెలుగులో అక్షరాలు నేర్చుకున్న అరుణ్ పదో తరగతి పూర్తి చేశాడు.

ఇది కేవలం పరీక్షలో సాధించిన విజయం కాదు. మూసుకుపోయిన ఒక తలుపు మళ్లీ తెరుచుకోవడం. విద్య అంటే మార్కులు మాత్రమే కాదు. తన పేరు తానే రాసుకునే స్వేచ్ఛ, తన హక్కులను తెలుసుకునే అవగాహన, తన జీవితాన్ని తానే నిర్ణయించుకునే సామర్థ్యం. పేద మనిషి జీవితంలో అక్షరం ప్రవేశించినప్పుడు అది జ్ఞానం మాత్రమే కాదు.. ఆత్మగౌరవం. అయితే అరుణ్ కథను కేవలం ఒక మంచి లారీ డ్రైవర్ ఒక బాలుడిని చదివించిన స్ఫూర్తి కథగా ముగించలేం. ఒక బాలుడి భవిష్యత్తు ఒక వ్యక్తి మంచితనంపై ఎందుకు ఆధారపడాలి? ప్రతి అరుణ్‌కు ఒక నెహ్రూ దొరుకుతాడా? ఇదే మన వ్యవస్థను ప్రశ్నించే అసలు ప్రశ్న.

బాల కార్మికత్వం వెనుక పేదరికం, కుటుంబ ఆదాయ లోపం, ఉపాధి అస్థిరత, సామాజిక భద్రత కొరత, విద్యా అవకాశాల లోపం వంటి అనేక కారణాలుంటాయి. పేదరికం మొదట డబ్బును మాత్రమే దోచుకోదు.. అవకాశాన్ని దోచుకుంటుంది. పుస్తకాన్ని తీసుకుని పనిముట్టు పెడుతుంది. ఆటస్థలానికి బదులు పని ప్రదేశాన్ని చూపిస్తుంది.

ఈ కథ డిజిటల్ ప్రపంచంలోని మరో విరుద్ధతను కూడా చూపిస్తోంది. ఒక పేద శ్రామికుడి ముఖం కోట్ల మందికి వినోదంగా మారవచ్చు. అతని నవ్వుకు లక్షల వ్యూస్ రావచ్చు. కానీ ఆ నవ్వు వెనుక ఉన్న శ్రమకు ఎంత విలువ దక్కింది? వైరల్ కావడం విజయానికి కొలమానం కాదు. వైరల్ అయిన తర్వాత ఆ మనిషి జీవితంలో ఏ మార్పు వచ్చిందనేదే అసలు ప్రశ్న.

అరుణ్ పదో తరగతి పూర్తి చేయడం సంతోషకరమే. కానీ ఆ తరువాత ఏమిటి? ఉన్నత విద్యా? నైపుణ్య శిక్షణా? గౌరవప్రదమైన ఉపాధా? పేద పిల్లలకు ఒక్క అవకాశం ఇవ్వడం సరిపోదు. పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు, విద్య నుంచి నైపుణ్యం వరకు, నైపుణ్యం నుంచి ఉపాధి వరకు అవకాశాల గొలుసు నిర్మించాలి. అప్పుడే పేదరికపు తరతరాల చక్రం విరుగుతుంది. ఇప్పటికీ మన సమాజంలో ఎంతమంది అరుణ్లు ఉన్నారు? ఎంతమంది పిల్లలు పేదరికం కారణంగా చదువు మానేస్తున్నారు? ఎంతమంది బాలురు లారీ క్లీనర్లుగా, హోటల్ కార్మికులుగా, నిర్మాణ కార్మికులుగా మారుతున్నారు? ఎంతమంది బాలికలు కుటుంబ బాధ్యతల పేరుతో విద్యను కోల్పోతున్నారు?

ఒక లారీ క్యాబిన్‌లో వెలిగిన అక్షరాల దీపం ఒక్క అరుణ్ జీవితానికే పరిమితం కాకూడదు. చదువు కోల్పోతున్న ప్రతి పేద పిల్లవాడి దారిలో అది వెలగాలి. అరుణ్ నవ్వును వైరల్ చేయడం కంటే, ఆ నవ్వుకు కారణమైన జీవితాన్ని మార్చడం గొప్ప పని. అదే అతని నవ్వుకు మనం ఇవ్వగలిగే నిజమైన గౌరవం.



మామిండ్ల రమేష్ రాజా
78932 30218

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
02.09.2026









## అడవి వారి సొంతం
# లాక్కునే హక్కు ఎవరిది..?

### పులుల పేరుతో చెంచుల మూలాలను పెకిలిస్తారా?
### అడవిని కాపాడుతున్న వారినే అడవి నుంచి తరిమేయడమేంటి?


అడవిలో విల్లంబులతో చెంచులు

అడవి చెంచులకు కేవలం భూమి కాదు.. అదే వారి తల్లి. అదే వారి ఇల్లు. అదే వారి సర్వస్వం. అదే వారి చరిత్ర, జ్ఞాపకం, సంస్కృతి, గుర్తింపు. వేల ఏళ్లుగా నల్లమలను నమ్ముకుని బతుకుతున్న చెంచులు.. పులులతో సహజీవనం చేస్తూ.. అడవిలోని ప్రతి చెట్టు, పుట్టను తమ దైవంగా భావిస్తూ.. ప్రకృతిని కంటికి రెప్పలా కాపాడుకుం టూ వచ్చారు. తేనె, చింతపండు, తునికాకు వంటి అటవీ ఉత్పత్తులే వారి ఆర్థిక జీవనానికి ఆధారం. అడవి వారి ఇల్లు మాత్రమే కాదు.. వారి జీవన విధానం. ఇప్పుడు అదే అడవిని "పులుల సంరక్షణ" పేరుతో వీడాలని వారికి చెబుతున్నారు. అడవిని కాపాడటానికి వచ్చిన వ్యవస్థ.. అడవిని కాపాడుకుంటూ వచ్చిన మనుషులనే అడవి నుంచి బయటకు పంపితే.. దాన్ని సంరక్షణ అనాలా? నిర్వాసనం అనాలా? పులులను కాపాడటం ఎంత ముఖ్యమో.. పులులతో సహజీవనం చేస్తూ తరతరాలుగా అడవిని కాపాడుతున్న చెంచుల హక్కులను పరిరక్షించ డం కూడా అంతే ముఖ్యం. స్వచ్ఛందంగా వెళ్లాలనుకునే వారికి మెరుగైన జీవితం కల్పించడాన్ని ఎవరూ వ్యతిరేకిం చడం లేదు. కానీ "మేము వెళ్లం.. ఈ అడవే మా జీవితం" అని స్పష్టంగా చెబుతున్న వారిని కూడా క్రమంగా బయటకు పంపించే పరిస్థితి వస్తే.. అది వారి జీవించే హక్కు, జీవనోపాధి హక్కు, సాంస్కృతిక హక్కు, స్వాభిమాన హక్కులపై దాడి కాదా? నీటి నుంచి చేపను వేరు చేసినట్టుగా చెంచులను అడవి నుంచి వేరు చేస్తే.. వారి జీవితం మాత్రమే కాదు.. ఒక సమాజం అస్తిత్వమే ప్రమాదంలో పడదా? అడవిని కాపాడాలంటే మనిషిని తరిమేయాలా?


సార్లపల్లి గ్రామం

• పులి కోసం చెంచు బలికావాల్సిందేనా..?
• పునరావాసం పేరుతో తరతరాల బంధానికి పరిహారం కడతారా?

### బలవంతంగా తరలింపు లేదు
**రేవంత్ చంద్ర, జిల్లా అటవీ అధికారి, నాగర్ కర్నూల్ జిల్లా**



ఎవరైతే సానుకూలంగా ఉన్నారో వారిని మాత్రమే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. బలవంతంగా ఎవరినీ తరలించడం లేదు. అందరి వినతులను పరిగణలోకి తీసుకుంటాం. రీలోకేషన్ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. వీలైనంత త్వరగా అందరి ఆమోదంతోనే ఇక్కడి నుంచి తరలింపు ప్రక్రియ కొనసాగిస్తాం. అయితే.. వద్దు అన్న తర్వాత కూడా చెంచుల రిలోకేషన్ ప్రక్రియ ఎందుకు చేపడుతున్నారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

**అచ్చంపేట/అమ్రాబాద్ విలేకరుల బృందం (జనంసాక్షి):**

తరతరాలుగా అడవినే బతుకుగా మల చుకున్న చెంచులకు ఈ అడవి కొత్తది కాదు. అధికారుల మ్యాప్‌లలో ఇది టైగ ర్ రిజర్వ్ కావచ్చు. అటవీ శాఖ రికార్డు ల్లో ఇది కోర్ ఏరియా కావచ్చు. కానీ చెంచుల జీవితంలో ఇది వారి ఇల్లు.. వారి పొలం.. వారి దేవాలయం.. వారి పూర్వీకుల జాడ. ఒక మ్యాప్‌పై గీత గీసి ఒక ప్రాంతాన్ని "కోర్ ఏరియా"గా ప్రకటించడం సులభమే. కానీ ఆ గీత కు అవతల తరతరాలుగా జీవిస్తున్న మ నుషుల జీవితాలను ఎలా చెరిపేయా లి? పులుల సంరక్షణ, వాటి ఆవాసాలు విస్తరించాలనే ఉద్దేశంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) పరిధిలోని పెం టల్లో గల చెంచులను మైదాన ప్రాంతాలకు తరలించాలని 2007 నుంచి మిగతా 4లో..

### గ్రామాన్ని వదలం
**చత్రునాయక్, మాజీ సర్పంచి, వట్వర్లపల్లి**



స్వచ్ఛంద పురావాసానికి మేం సిద్ధంగా లేము. ఇక్కడే పుట్టినం. అడవిలోనే పెరిగినం. ఇక్కడే జీవిస్తాం. వీడేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. కొందరు తమ స్వార్థం కోసం ఆశచూపినా అన్నివర్గాల ప్రజలూ వ్యతిరేకిస్తున్నారు. పులుల పేరుతో గ్రామాలను తరలించాలని కొంత మంది వ్యక్తులతో కలిసి తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తున్నారు. మా ఆవేదనను కలెక్టర్‌కు తెలి పాం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తరలింపును మానుకోవాలి. అభివృద్ధి పేరిట ఇల్లు వదిలి వెళ్లాల్సిందే అంటే ఎలా? అడవిలోనే ఉంటూ అభివృద్ధి చెందే అవకాశం ఎందుకు ఉండకూడదు?



# ఉద్యోగుల పోరుబాట

• సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్
• రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన.. తహసీల్దార్లకు వినతులు
• హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
• టీచర్ల హామీలు నెరవేర్చాలి :ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** భద్రత, భరోసా లేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధ రించాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. ఉపాధ్యాయ, ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటించారు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట, సిద్దిపేట నారాయణపేట జిల్లాలోని అన్ని మండలాల్లో ఉద్యోగులు తమ డిమాండ్లు వినిపించారు. 'పెన్షన్ భిక్ష కాదు.. పెన్షన్ హక్కు', 'పెట్టుబడుల పెన్షన్.. మాకొద్దు టెన్షన్' అంటూ నినాదాలు చేశారు. మిగతా 4లో..

## విద్యార్థులపై కేసులు కొట్టివేత
నీట్ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు కొట్టేసిన సుప్రీంకోర్టు

తీవ్ర నేర చరిత్ర కలిగిన 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, ఢిల్లీ పోలీసులకు అనుమతి

## రంగనాథ్‌కు ఊరట
హైడ్రా కమిషనర్‌ను తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసిన డివిజన్ బెంచ్

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యథాతథం
సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: హరీశ్

వివరాలు లోపలి పేజీల్లో..

## ఢిల్లీలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
# పంచాయితీ

కేసీ వేణుగోపాల్‌తో సీఎం కీలక భేటీ • నామినేటెడ్ పోస్టుల భర్తీ సమాలోచనలు
కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై చర్చ • మంత్రులంతా ఢిల్లీలోనే..



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరగనున్నట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు, వారు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.

**మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం..**
తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. నామినేటెడ్ పదవుల భర్తీపైనా నిర్ణయం ఉండే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మిగతా 4లో..


## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్
అంతర్జాతీయ వర్సిటీల రాకతో ప్రపంచస్థాయి విద్య : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
2లో..

## మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు
2లో..
ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశం కానున్న మంత్రి



## ఏయిర్‌ఫోర్స్‌లో అరుదైన గౌరవం
భారత వైమానిక దళంలో చరిత్ర సృష్టించిన శక్తి శర్మ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత వైమానిక దళంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సాయుధ దళాల్లో ఎయిర్ వైస్ మార్షల్ లేదా దానికి సమానమైన హోదాను పొందిన మొట్టమొదటి మహిళా అధికారిగా (వైద్యేతర విభాగంలో) ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ నిలిచారు. వాయుసేన ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. మంగళవారం ఆమె దిల్లీలోని ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (విద్య)గా బాధ్యతలు స్వీకరించారని తెలిపింది. గతంలో ఆమె మిగతా 4లో..



## ఉగ్రవ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి

• వారికి ఆశ్రయం కల్పించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలి
• ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదు
• ఉగ్రవాదం వ్యూహాత్మక సంపద కారాదు : మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఉగ్రవాదాన్ని ఎగదోసే దాయాది పాకిస్థాన్‌కు భారత్ ఎప్పటికప్పుడు గట్టి హెచ్చరికలు చేస్తోంది. కిర్గిస్థాన్‌లో షాంఘై సహకార సంస్థ సదస్సు వేదికగా ప్రధాని మోదీ పొరుగుదేశానికి గట్టి సందేశం పంపారు. ఉగ్రవాదం వ్యూహాత్మక సంపద కారాదన్నారు. ఉగ్రవ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని, ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదని పిలుపునిచ్చారు. మోదీ ఈ సందేశం ఇచ్చిన సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అక్కడే ఉన్నారు."తీవ్రమైన అంశాలపై అందరిదీ ఒకే మాట ఉండాలి. ఉగ్రవాదాన్ని ఒక విధానంగా మిగతా 4లో..

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి
• దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి గర్వకారణం
• బంగారాన్ని అనవసరంగా కొనకండి
• డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి: మోదీ
2లో..

## ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం?
జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ
ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

# తెలంగాణ ప్రతిపాదనలు పరిశీలించి చెబుతాం

తుమ్మిడిహట్టి ఎత్తు పెంపుపై కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల అధికారుల చర్చలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1(జనంసాక్షి):** తుమ్మిడిహట్టి బ్యారేజీపై ఢిల్లీలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారుల మధ్య సమావేశం ముగిసింది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా బ్యారేజీ ఎత్తు, సాంకేతిక అంశాలు, అంతర్రాష్ట్ర సమస్యలపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమీక్షించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తును గతంలో మహారాష్ట్ర అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్లకు పెంచేలా ఆ రాష్ట్రాలను ఒప్పించేందుకు తెలంగాణ మిగతా 4లో..







## ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక పక్రియ
1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ మెరిట్ లిస్ట్ విడుదల చేసిన అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక పక్రియ తుది దశకు చేరుకుంది. 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ మిగతా 4లో..

## ఢిల్లీలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పంచాయతీ

మంత్రివర్గ విస్తరణ, పదవుల పంపకాల ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు ఢిల్లీ బాటపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపటి క్రితమే ఢిల్లీ చేరుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే అక్కడ ఉన్నారు. అయితే పలువురు నేతలు మాత్రం బుధవారం స్వామినాథన్ ఫౌండేషన్‌కి వైఎస్ అవార్డు ప్రదాన కార్యక్రమం కోసం ఢిల్లీ వెళ్తున్నట్లు చెబుతున్నారు.

## మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి బయల్దేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు నేపథ్యంలో ఆమె వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్‌ను కూడా ఆమె కోరారు. ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను అధిష్ఠానానికి టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి వెళ్లడం.. ఆమె విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్,సెప్టెంబర్1(జనంసాక్షి):హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఎంఐటి, అమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాల తోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఉగ్రవ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి

ఉపయోగిస్తూ, ఉగ్రమూకలకు ఆశ్రయం కల్పించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలి. ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక సంపద కారాదని తేల్చిచెప్పాలి" అని మోదీ పేర్కొన్నారు. అలాగే నేటి పరస్పర అనుసంధాన ప్రపంచంలో భద్రతా పరిధి మరింత విస్తృతమైందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం అందుకు నిదర్శనమని చెప్పారు. "ఆ ప్రాంతంలో మొదలైన ఘర్షణ అక్కడికే పరిమితం కాలేదు. ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసులు ప్రభావితమయ్యాయి" అని చెప్పారు. అందుకే యుద్ధభూమిలో కాకుండా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి సూచించారు.ఇరాన్ యుద్ధం ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మాదకద్రవ్యాల అక్రమరవాణా గురించి కూడా ప్రస్తావించారు. "డ్రగ్స్ అక్రమ రవాణా నేరం మాత్రమే కాదు. యువతకు, ప్రాంతీయ భద్రతకు ఒక తీవ్రమైన ముప్పు" అని హెచ్చరించారు. ఈ సదస్సులో మోదీ, షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పాల్గొన్నారు. బెలారస్, కజకస్థాన్, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్ దేశాల అధ్యక్షులు హాజరయ్యారు.

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(జనంసాక్షి):భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోస్సారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుం ది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

## ఏయిర్‌ఫోర్స్‌లో అరుదైన గౌరవం

ఎయిర్ కమోడోర్ హోదాలో ఉండేవారని పేర్కొంది.శక్తి శర్మ 1994లో ఐఏఎఫ్ విద్యావిభాగంలో నియమితులయ్యారు. వైమానిక దళ శిక్షణ సంస్థలు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ్ హెడ్ క్వార్టర్స్, ఎయిర్ హెడ్ క్వార్టర్స్‌లలో విభిన్న బాధ్యతలు నిర్వర్తించారు. ఐఐటీ కాన్పుర్, పుణె విశ్వవిద్యాలయంలో 'ఐఏఎఫ్ చైర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'ను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. త్రివిధ దళాల నుంచి సైనిక పాఠశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేసిన మొదటి మహిళా అధికారిగానూ గతంలో చరిత్ర సృష్టించారు. మూడు దశాబ్దాల కుపైగా విశిష్ట సేవలతో ఆమె అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని వాయుసేన తెలిపింది.

# అడవి వారి సొంతం.. లాక్కునే హక్కు ఎవరిది..?

ప్రక్రియ మొదలైంది. దేశంలోనే రెండో అతిపెద్ద పెద్దపులుల అభయారణ్యంగా అమ్రాబాద్ ఉండగా.. గతంలో కేంద్ర బృందం పులుల నివాసానికి ఇది అనువైన ప్రాంతమని గుర్తించింది. నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల పరిధిలో 2,611.4 చదరపు కిలో మీటర్ల పరిధిలో అభయారణ్యం విస్తరించగా.. దీనిగుండానే హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి 765 విస్తరించింది. ఈ నేపథ్యంలో కోర్ ఏరియాలో చెంచు పెంటలను తరలించే ప్రక్రియను చెంచులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

**అడవిని నమ్ముకొని జీవనం..**

నల్లమల అభయారణ్యంలో 2001 జనాభా లెక్కల ప్రకారం 123 గూడెల్లో సుమారు 10 వేలకు పైగా జనాభా ఉండేది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో ఐటీడీఏ ద్వారా చెంచుల మనుగడ, వారి జీవనం కోసం వివిధ పథకాలు అమలు చేసేవారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మన్ననూర్‌లోని ప్రత్యేక ఐటీడీఏను ఏర్పాటు చేసినా.. పూర్తి సిబ్బంది, పథకాల అమలుకు నిధులు లేకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారింది. ఇక్కడున్న చెంచులను పర్టికులర్లీ వల్నరబుల్ ట్రైబ్స్ గ్రూపుగా పిలుస్తారు. అడవిలోని బొడ్డు గుడిసెల్లో జీవిస్తూ.. అటవీ ఉత్పత్తుల సేకరణే ప్రధాన ఆదాయ వనరు. స్థానికంగా పోడు భూముల్లో సేద్యం చేసుకుంటూ.. పశుపోషణకు ప్రాధాన్యమిస్తారు. చెంచులతో పాటు కొన్ని చోట్లా లంబాడ, గిరిజనేతరులు సైతం ఉంటున్నారు. తేనె.. చింతపండు.. తునికాకు.. ఇతర అటవీ ఉత్పత్తులు.. పశుపోషణ.. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు.. ఇవే వారి జీవనాధారాలు. కానీ భూములకు పట్టాలు లేవు. రుణాలు అందడం లేదు. అనేక ప్రభుత్వ పథకాలు అందుబాటులోకి రావడం లేదు. వ్యవస్థ భూమికి హక్కు పత్రం ఇవ్వలేదు. వ్యవసాయానికి రుణం ఇవ్వలేదు. అభివృద్ధి సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పుడు అదే పరిస్థితిని చూపించి.. "మీ దగ్గర పట్టాలు లేవు.. కాబట్టి వెళ్లిపోండి" అంటే.. అది న్యాయమా? ముందు హక్కులు నిరాకరించి.. తర్వాత హక్కులు లేవని చూపించి నేల నుంచి తరిమేయడం ఏ రాజ్యాంగ న్యాయం?

**పరిహారం అంటే జీవితానికి వెల కట్టడమేనా?**

ప్రభుత్వం ఒక కుటుంబానికి రూ.15 లక్షలు లేదా ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, ఇంటి స్థలం, ఇల్లు వంటి ప్యాకేజీలు అందిస్తోంది. ఇవి పునరావాసానికి అవసరమైనవి కావచ్చు. కానీ ఒక ప్రశ్నకు సమాధానం కావాలి. డబ్బుతో అడవిని కొనగలరా? రూ.15 లక్షలు ఇచ్చి.. పూర్వీకుల జ్ఞాపకాలను తిరిగి ఇవ్వగలరా? కొండను తిరిగి ఇవ్వగలరా?వాగును తిరిగి ఇవ్వగలరా? అడవిలోని తమ దేవుళ్లను తిరిగి ఇవ్వగలరా?తరతరాలుగా వచ్చిన జీవన జ్ఞానాన్ని తిరిగి ఇవ్వగలరా? ఒక సమాజం కోల్పోయే సంస్కృ తికి పరిహారం ఎంత? అందుకే పునరావాసాన్ని కేవలం ఇల్లు ం భూమి ం డబ్బు లెక్కల్లో చూడటం సరిపోదు. ఇళ్లకు, గుడిసెలకు, ఇతర ఆస్తులకు విలువ నిర్ధారిస్తున్నారు. కొంతమంది చెంచులు మాత్రం ఆ విలువ నిర్ధారణలోనే అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్నారు. వట్వర్లపల్లిలో 320 మందికి చెందిన ఆస్తుల విలువను రూ.15.67 కోట్లకుపైగా లెక్కించారు. కానీ ఆ లెక్కల్లో.. వారి శ్రమకు విలువ ఎంత? వారి జీవన విధానానికి విలువ ఎంత? వారి సంస్కృతికి విలువ ఎంత? వారి పూర్వీకుల జ్ఞాపకాలకు విలువ ఎంత? ఆస్తికి మార్కెట్ విలువ ఉంటుంది. అస్తిత్వానికి మార్కెట్ విలువ ఉండదు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) అనుమతితో తొలిదశలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం పరిధిలోని వట్వర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు, తాటిగుండాల, కొల్లంపెంటకు చెందిన కుటుంబాలను తరలించాలని నిర్ణయించినా అడవిని వీడేది లేదంటూ చెంచులు భీష్మిస్తున్నారు.

**గ్రామసభ లేకుండా ఖాళీ చేయించగలరా?**

ఒక గ్రామాన్ని ఖాళీ చేయించడం సాధారణ పరిపాలనా నిర్ణయం కాదు. ముఖ్యంగా తరతరాలుగా అక్కడే నివసిస్తున్న ఆదివాసీ సమాజాన్ని మరో ప్రాంతానికి తరలించే నిర్ణయం మరింత సున్నితమైనది. స్థానికుల వాదన మాత్రం తీవ్రంగా ఉంది. గ్రామసభల పూర్తి అంగీకారం లేకుండానే రీలోకేషన్ ప్రక్రియ ముందుకు సాగుతోందని చెంచులు, గిరిజనేతరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అభిప్రాయం తీసుకోకుండా వారి జీవితంపై నిర్ణయం ఎవరు తీసుకుంటారు? గ్రామసభ అంటే కేవలం ఒక సమావేశం కాదు. అది గ్రామ ప్రజల గొంతు. ఆ గొంతు వినకుండా ఒక గ్రామ భవిష్యత్తును నిర్ణయిస్తే.. అది ప్రజాస్వామ్య ప్రక్రియ ఎలా అవుతుంది? ప్యాకేజీ చూపించి ఒప్పించడం ఒకటి.. స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే పరిస్థితి కల్పించడం మరొకటి. నిజమైన స్వచ్ఛంద తరలింపు అంటే.. "వెళ్లొచ్చు.. ఉండొచ్చు" అనే రెండూ సమానంగా అందుబాటులో ఉండాలి. అటవీ ఉత్పత్తులే జీవనోపాధి అని, అడవిలోని వణ్యప్రాణులను దేవుళ్లుగా భావించే తమకు వాటితో ఎలాంటి ఘర్షణ లేదని చెంచెలు చెబుతున్నారు.

**అడవిని కాపాడేందుకు చెంచులను భాగస్వాములుగా ఎందుకు చేయకూడదు?**

ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో స్థానిక, మూలవాసీ సమాజాల సంప్రదాయ జ్ఞానాన్ని అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ఉపయోగిస్తున్నారు. చెంచులకు అడవి పుస్తకంలో చదివిన విషయం కాదు. అది వారి జీవితం. ఏ చెట్టు ఎప్పుడు పుష్పిస్తుంది? ఏ మొక్క ఔషధం? ఏ దారిలో జంతువులు సంచరిస్తాయి? ఎప్పుడు తేనె సేకరించాలి? అడవితో ఎలా మెలగాలి? ఇలాంటి తరతరాల జ్ఞానం వారి జీవనంలో భాగం. అలాంటి సమాజాన్ని అడవి నుంచి బయటకు పంపించి.. "అడవిని కాపాడుతున్నాం" అనడం కంటే.. వారినే అడవి సంరక్షణలో భాగస్వాములను చేయడం మరింత బలమైన పరిష్కారం కాదా?న్యాయం అంటే రెండు వర్గాల్లో ఒకరిని ఎంచుకోవడం కాదు. పులి ఉండాలి. అడవి ఉండాలి. చెంచు కూడా ఉండాలి. ఇదే అసలు సమతుల్యత. పులిని కాపాడటానికి చెంచును బలిచేయాల్సిన అవసరం లేదు. చెంచును కాపాడటానికి పులిని ప్రమాదంలోకి నెట్టాల్సిన అవసరం లేదు. రెండింటి మధ్య సహజీవనానికి మార్గం వెతకాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అందుకు గ్రామసభ అభిప్రాయాన్ని గౌరవించాలి. అభ్యంతరాలను స్వతంత్రంగా పరిశీలించాలి. ఒకవైపు వన్యప్రాణి సంరక్షణ.. మరోవైపు మానవ హక్కులు. ఈ రెండింటిలో ఏదో ఒకటి గెలవాల్సిన అవసరం లేదు. రెండూ గెలవాలి. పులి అడవిలో ఉండటం ప్రకృతికి అవసరం. చెంచు అడవిలో ఉండటం ఆ అడవి చరిత్రకు అవసరం..!

## మరణం వరకు అడవిలోనే..

**- మల్లికార్జున్, సార్లపల్లి, చెంచు**



మమ్మల్ని ఇక్కడ నుంచి తరలించడమంటే చెరువులోని చేపను తీసి ఒడ్డున వేయడమే. ఎన్నో యేళ్లుగా పెద్ద పులులు మొదలుకొని అనేక అటవీ జంతువులతో కలిసి బతికాం. అడవిలోని ప్రతీ చెట్టు, పుట్టా మాకు దైవంతో సమానం. వాటినే పూజిస్తూ జీవిస్తున్నాం. ఇక్కడుంటున్న మా పిల్లలను బయటనే చదివిస్తున్నాం. వేరే ప్రాంతం నుంచి వచ్చినవారే తమ స్వార్థం కోసం అడవి నుంచి వెళ్లిపోతామంటున్నారు. ని జమైన స్థానికులెవరూ వెళ్లడానికి సిద్ధంగా లేరు. బలవం తంగా తరలించాలని చూస్తే వ్యతిరేకిస్తాం. పోరాడుతాం

## విద్యార్థులపై కేసులు కొట్టివేత

న్యూఢిల్లీ(జనంసాక్షి):

నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, ఢిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది. అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది.సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 20-25 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.



## ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం?

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(జనంసాక్షి):
భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ. 850 నుంచి రూ. 1,700 కి, అల్యూమినియం ధర రూ. 350 నుంచి రూ. 650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపో తుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వని స్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

## తెలంగాణ ప్రతిపాదనలు పరిశీలించి చెబుతాం

అధికారులు తమ ప్రతిపాదనలను సమావేశంలో వివరించినట్లు తెలిసింది. బ్యారేజీ ఎత్తు పెంపుతో తెలంగాణకు కలిగే ప్రయోజనాలను అధికారులు మహారాష్ట్ర దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే, 152 మీటర్ల ఎత్తుపై మహారాష్ట్ర నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడలేదని తెలుస్తోంది. 152 మీటర్ల ప్రతిపాదనకు అంగీకారం కుదరని పరిస్థితుల్లో కనీసం 150 మీటర్ల ఎత్తుకైనా అంగీకరించాలని తెలంగాణ అధికారులు కోరినట్లు తెలిసింది. తెలంగాణ ప్రతిపాదనలను ఆ రాష్ట్ర అధికారులు స్వీకరించి, వాటిని పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. బ్యారేజీ ఎత్తుపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించేందుకు తదుపరి దశలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. తదుపరి భేటీలో బ్యారేజీ ఎత్తుపై మరింత స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఉద్యోగుల పోరుబాట..!

టీజీఈజేఏసీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఖమ్మం ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. జనగామలో నో సీపీఎస్.. ఓన్లీ ఓపీఎస్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్‌లో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యం లో నిర్వహించిన మహాధర్నాలో సుమారు 7,500 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉద్యోగులు, ఉపా ధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎస్ ను రద్దు చేయడంతో పాటు మెరుగైన పీఆర్సీ ప్రకటించాలని, 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన సుమారు రూ.16 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాకముం దు రెండు డీఏలు పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 2023 చివరినాటికి ఉద్యోగుల బకాయిలు సుమారు రూ.4 వేల కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.16 వేల కోట్ల కు చేరాయని తెలిపారు. ఉద్యోగుల నుంచి నాలుగు వాయిదాలుగా హెల్త్ స్కీమ్ కోసం డబ్బులు కట్ చేస్తున్నప్పటికీ, హెల్త్ స్కీమ్ సక్రమంగా అమలు కాకపోవడం దుర్మార్గమన్నారు. పాలిటెక్నిక్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు నిర్ణయాలను పునఃపరిశీలించాలని కోరారు. దామోదర్‌రెడ్డి మాట్లాడు తూ పీఆర్సీ, ఈహెచ్‌ఎస్, 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పెన్షన్, సీపీఎస్ అధ్యయనానికి కమిటీ ఏర్పాటు వంటి హామీల ను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. పీఆర్సీ నివేదికను ఆరు నెలల్లో ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు నివేదిక రాలేదన్నారు. వెంటనే పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన విమర్శించారు. గత నాలుగు నెలలుగా ఈహెచ్‌ఎస్ కోసం డబ్బులు కట్ చేస్తున్న ప్పటికీ, అనేక ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు చెల్లని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యథాతథం



హైదరాబాద్,సెప్టెంబర్1(జనంసాక్షి): కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: హరీశ్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దీనికి విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై విమర్శలు గుప్పించారు."ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదు? ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక పక్రియ

లిస్ట్‌ను అధికారులు విడుదల చేశారు. అభ్యర్థులను 1:1.25 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేశారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు సెప్టెంబర్ 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ వెంగల్‌రావునగర్‌లోని ఎఎఈఉచిలో ఈ ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. నిర్ణీత తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరు కాలేని అభ్యర్థులకు సెప్టెంబర్ 28వ తేదీన మరో అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాల్సి ఉంటుంది. విద్యార్హతలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. వెరిఫికేషన్ పక్రియ పూర్తయిన అనంతరం÷నైల్ మెరిట్ లిస్ట్‌తో పాటు సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయనున్నారు. గత రెండున్నరేళ్లలో తెలంగాణ ఆరోగ్యశాఖలో 15 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ పక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం మరో 2 వేల పోస్టుల భర్తీ పక్రియ కూడా కొనసాగుతోంది. 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపిక పక్రియ తుది దశకు చేరుకోవడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లో చోటు దక్కిన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు, అవసరమైన ధ్రువపత్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

## రంగనాథ్‌కు ఊరట

హైదరాబాద్(జనంసాక్షి):సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో జీఎల్ ఆర్ 243లో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల పరిరక్షణ విషయంలో హైడ్రాకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గతంలో ఈ కేసు విచారణలో భాగంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారిని తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం నిలిపివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసిన విషయం విధితమే. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. హైడ్రా కమిషనర్ తరఫున సుప్రిం కోర్టు సీనియర్ న్యాయవాది, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రాజీవ్ శక్దర్ సుదీర్ఘ వాదనలు వినిపించారు. వాదనలు విన్న తర్వాత డివిజన్ బెంచ్ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసింది. తదుపరి విచారణను నవంబరు 3కి వాయిదా వేసింది. దీంతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని జీఎల్ ఆర్ 243లో 119 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. బీ-2 భూములుగా పేర్కొన్న వీటిని ఆసుపత్రులు, పాఠశాలలు ఇలా రాష్ట్ర ప్రభుత్వ అవసరాల నిమిత్తం సికింద్రాబాద్ కంటోన్మెంట్ కేటాయించింది. వీటి హక్కుదారుగా రాష్ట్ర ప్రభుత్వం ఉండడమే కాకుండా.. వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకుంటుంది. అలా జులై 18న తిరుమలగిరి - అల్వాల్ ప్రాంతంలోని జీఎల్ ఆర్ నంబరు 243లో ఉన్న 119 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ఇది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ డిఫెన్స్ ఎస్టేట్ అధికారులు కూడా ధ్రువీకరించారు.

# మానవత్వానికి నిదర్శనం

- వాగులు వంకలు దాటుకుంటూ కిలోమీటర్ నడిచిన మంత్రి సీతక్క



**గంగారం, సెప్టెంబర్ 01 (జనం సాక్షి)** : స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కోసం గంగారం వచ్చిన మంత్రి సీతక్క తనలోని మానవత్వాన్ని, కార్యకర్తల పట్ల తనకున్న ప్రేమను మరోసారి చాటుకున్నారు. గంగారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చింత సారక్క భర్త, దివంగత కాంగ్రెస్ నాయకులు చింత బక్కన్న విగ్రహానికి నివాళులర్పించేందుకు మంత్రి ఏకంగా కిలోమీటర్ దూరం వాగులు, వంకలు దాటుకుంటూ స్వయంగా నడుచుకుంటూ వెళ్లారు. వాహనం వెళ్లదు అని అధికారులు చెప్పినా వినకుండా, బురదలో, రాళ్లలో కాలినడకన వెళ్లి చింత బక్కన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. సీతక్క ఈ గొప్ప మనసు చూసి అక్కడున్న ప్రజలు, కార్యకర్తలు కంటతడి పెట్టారు. బి"ఇది కదా నాయకత్వం అంటే... కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసుకునే నాయకురాలు సీతక్క మాత్రమే"బి అంటూ మండలం అంతా కొనియాడుతున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన చింత బక్కన్న గ సేవలను ఈ సందర్భంగా మంత్రి సీతక్క గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముడిగా వీరభద్ర పోతయ్య, మాజీ అధ్యక్షులు లిజాడి వెంకటేశ్వర్లు, పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల డిమాండ్ల సాధనకు కృషి

- ఎమ్మెల్సీ కోదండరాం హామీ



**హైదరాబాద్ (జనంసాక్షి)** : పాలిటెక్నిక్ విద్యార్థుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరాం హామీ ఇచ్చారు. ఇందుకోసం ఉన్నతస్థాయి కమిటీలో వచ్చిన అవకాశాన్ని ఎట్టిపరిస్థితుల్లో వదులుకోను అని స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ ఆధ్వర్యంలో జగన్ సభ అధ్యక్షతన జీవో 97ను రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, దీ=ూ౦ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, విద్యార్థి నేతలు తెలంగాణ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్, కన్వీనర్ గోపు జనార్ధన్, కో ఆర్డినేటర్ ఆజాద్, కో కన్వీనర్ సుధీర్, పాలిటెక్నిక్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పాలిటెక్నిక్ వ్యవస్థలోనే విద్య, నైపుణ్యం రెండు ఉన్నాయని కోదండరాం అన్నారు. జీవో 97పై విద్యార్థులు, నేతలు ఇచ్చిన సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. శక్తి స్కీంపై పట్టింపులకు పోతే కాంగ్రెస్ ప్రభుత్వానిదే పరువు పోతుందని ఎంపీ ఆర్ కృష్ణయ్య సూచించారు. స్కిల్ లేనివాళ్లకి నైపుణ్యం నేర్పించాలని, డిప్లొమా విద్యార్థులకు ముందునుంచే స్కిల్ ఉందన్నారు. ఇందుకు సాక్ష్యం వారు ఏటా పొందుతున్న క్యాంపస్ ఉద్యోగాలే అని తెలిపారు. జీవో 97పై వెనక్కి తగ్గితే ప్రభుత్వానికే మంచి పేరు వస్తుందని వెల్లడించారు. ఒకవేళ మొండిగా వ్యవహరిస్తే పూర్తి స్థాయిలో ఉద్యమం చేస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. విద్యాశాఖలో ఉన్న ఎస్‌బీటీఈటీని కార్మిక శాఖలోకి కలపడం సరికాదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. నైపుణ్య అభివృద్ధికి సాంకేతిక విద్యకి తేడా ఉంటదని గుర్తు చేశారు. ఎంత గొప్ప చరిత్ర, ట్రాక్ రికార్డు కలిగిన పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నాశనం చేసేందుకే జీవో 97ను తీసుకువచ్చారని విమర్శించారు. ఇకనైనా కళ్ళు తెరిచి శక్తి స్కీంను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే న్యాయపరంగా కొట్లాడుతామని హెచ్చరించారు. పాలిటెక్నిక్ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే జీవో 97ను తీసుకోవచ్చారని ఓయూ జేఏసీ, టిఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మందాల భాస్కర్, బీఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఆలోచించి జీవో 97ను రద్దుకు సహకరించాలని కోదండరాంకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ జేఏసీ సెక్రటరీ జనరల్ శ్రవణ్ గౌడ్, శ్రీరామ్, డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వివేక్ పటేల్, జర్జ్ రెడ్డి పీడీఎస్‌యూ కన్వీనర్ స్వాతి, రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరావు బంటఱ మధు, ఎస్ఎఫ్ఐ అశోక్ రెడ్డి, జేఎన్టీయూహెచ్ ఎస్పీఎఫ్ రాహుల్ నాయక్, ఏఐ డీఎస్‌వో వైశాలి,జేఎన్‌జీపీటీ, మసాబ్ ట్యాంక్ కాలేజ్, పఠాన్ చెరువు, సికింద్రాబాద్, దుర్గ బాయ్ దేశముఖ్ మహిళ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రణీత, విశాల్, అభిరామ్, ఇర్ఫాన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూలో 2025- 2026 బ్యాచ్ ఎంఎల్ఐసీ విద్యార్థుల ఫేర్‌వెల్



**హనుమకొండ (జనంసాక్షి)** : కాకతీయ విశ్వ విద్యాలయంలో, డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో మంగళవారం 2025- 2026 బ్యాచ్ ఎం.ఎల్.ఐ.సీ. విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్ బీ.రాధికారాణి అసోసియేటెడ్ ప్రొఫెసర్ సభకు అధ్యక్షత ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రమ మాట్లాడుతూ కేరీర్ గైడెన్స్, డిసిప్లిన్, భవిష్యత్తులో ఎదురయ్యే జీవిత సమస్యలను, ఉద్యోగ ధర్మాన్ని ఏలా నిబద్ధతతో నిర్వహించాలో పలు విలువైన సూచనలు, సలహాలు విద్యార్థులకు ఇచ్చారు. డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్ సీనియర్ పూర్వ విద్యార్థిగా ఎం.ఎల్.ఐ.సీ. కోర్సుల్లో, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న సాంకేతిక పరిణామాలు, ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం , ఏఐ టూల్స్ లో సాధించాల్సి స్కిల్స్ గురించి విద్యార్థులకు వివరంగా తెలియ చెప్పారు. ఇతర ఫ్యాకల్టీ ఉపన్యాసాకులు కిశోర్ , రవిచంద్ర, రాజు,కవిత రాబోయే యాన్యువల్ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మెలుకువలు తెలియ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు అఖిల, శ్రీకీర్తిన, జ్యోతి, అలాగే విద్యార్థులు బద్రి, అభిషేక్, వీరన్న ఇతర విద్యానీ, విద్యార్థులు, ఆఫీస్ ఇంచార్జీ రవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ 4న రెడ్‌క్రాస్ జిల్లా శాఖల ఎన్నికలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి)** : తెలంగాణలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా శాఖల నిర్వహణ కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయించారు. రాష్ట్రంలోని 30 జిల్లా శాఖలకు ఒకేసారి అక్టోబర్ 4న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శివప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని 30 జిల్లా శాఖల నిర్వహణ కమిటీల పదవీకాలం పూర్తికావడంతో ప్రస్తుతం అవి ఖాళీగా ఉన్నాయి. ఆయా శాఖల రోజువారీ కార్యకలాపాలను నిర్వహించేందుకు అదనపు కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. సంబంధిత జిల్లా శాఖ అధ్యక్షులైన కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రెడ్‌క్రాస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మే నుంచి ఆగస్టు వరకు నిర్వహించిన ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో 66 వేల మందికి పైగా కొత్త సభ్యులు చేరారు. దీంతో తెలంగాణ రాష్ట్ర శాఖ మొత్తం సభ్యత్వం 1.13 లక్షలు దాటింది.


### ఎన్నికలపై ఐఆర్ఎస్ చైర్మన్ సమావేశం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ ఎం. దానకిశోర్ అధ్యక్షతన మాజీ జిల్లా శాఖల కార్యవర్గ సభ్యులతో మంగళవారం సెక్రటేరియట్ లో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్, మార్గదర్శకాలు, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ఐఆర్ఎస్ చైర్మన్ కార్యవర్గ సభ్యులతో చర్చించారు. మాజీ కార్యవర్గ సభ్యులు చేసిన పలు సూచనలను ఐఆర్ఎస్ చైర్మన్ దానకిశోర్ పరిశీలించి, ఎన్నికల నిర్వహణలో తగిన సూచనలను అమలు చేయడానికి అంగీకరించారు. ఎన్నికల మార్గదర్శకాలు, షెడ్యూల్‌తో పాటు ఓటర్ల జాబితాలను మరో రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్లకు పంపించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ జనరల్ సెక్రటరీ, సీఈఓ ప్రొఫెసర్ ఏ. శ్రీరాములు పాల్గొన్నారు.

# పోరుబాటలో బీఆర్ఎస్

## వెయ్యి రోజుల 'హస్తం' పాలనపై చార్జిషీట్

- నేటి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలకు శ్రీకారం
- ప్రభుత్వ వైఫల్యాలే అస్త్రాలుగా ప్రజల్లోకి నాయకులు
- ఖమ్మంలో పువ్వాడ అజయ్ సారథ్యంలో జంగ్ సైరన్




**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి)** : 'ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ అగ్గి రాజుకుంటోంది.. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ.. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు పేలుతూనే ఉన్నాయి.. తమది అభివృద్ధి మంత్రం అని హస్తం నేతలు చెబుతుండగా.. అన్నిట్లో వైఫల్యం అంటూ గులాబీ నేతలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ తనదైన శైలిలో కాంగ్రెస్ ను అడుగడుగునా ఎండగడుతూ పైచేయి సాధించేందుకు శత విధాలా ప్రయత్నిస్తోంది.. దీనిలో భాగంగానే కాంగ్రెస్ వెయ్యి రోజుల అధికార కాలాన్ని టార్గెట్ చేసింది.. ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో జన చైతన్యానికి శ్రీకారం చుట్టింది.. దాదాపు పది రోజులపాటు నిర్విరామంగా కొనసాగించనున్న ఆందోళనలపై 'జనం సాక్షి' ప్రత్యేక కథనం..!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు సార్వత్రిక సంగ్రామమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి మంత్రంతో ప్రజలను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోట్ల రూపాయల నిధులను కుమ్మరించి ప్రజల మౌలిక అవసరాలతోపాటు శాశ్వత అభివృద్ధికి బాటలు వేస్తున్నామంటూ చెప్పుకొస్తున్నారు. కానీ..! ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నటువంటి బీఆర్ఎస్ కాంగ్రెస్ పాలనపై విరుచుకు పడుతోంది. హస్తం నేతలవి మాటలే తప్ప చేతలు లేవంటూ కొట్టిపారేస్తోంది. గత మూడేళ్ల కాలంలో హామీల అమలులో పూర్తిగా విఫలం అయ్యారంటూ అడగడుగునా విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. ప్రధానంగా ఆరు గ్యారంటీలు, 420 హామీల సంగతి తేల్చాలని పట్టుబడుతోంది. దీనిలో భాగంగానే నేటి నుంచి దాదాపు పది రోజులపాటు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది.

### వెయ్యి రోజుల పాలనపై చార్జిషీట్..!

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకొని దాదాపు వెయ్యి రోజులు పూర్తి కావస్తున్నది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు పూర్తిస్థాయిలో జరగలేదని ప్రజల్లో చర్చ మొదలైంది. అధికారంలోకి వచ్చిన కేవలం వంద రోజుల్లోనే చెప్పినవన్నీ నెరవేరుస్తామని హస్తం నేతలు ప్రకటించినప్పటికీ కాలయాపన జరుగుతుండడం జనలను తీవ్ర అసహనానికి గురి చేస్తోంది. ఎకరాకు రూ. 12 వేలు రైతు భరోసా, ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ, సబ్సిడీ వంట గ్యాస్, చేయూత పింఛన్ల పెంపు వంటి అంశాలు నేటికీ ప్రశ్నార్థకంగానే ఉన్నాయి. వీటితోపాటు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో భాగంగా పెళ్లిళ్లు చేసుకునే ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామన్న హామీ నీటి మీద రాతగానే మారడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే తమ అస్త్రాలుగా భావిస్తున్న బీఆర్ఎస్ 'చార్జిషీట్' పేరుతో బుధవారం ఆసక్తికరమైన ఆందోళనకు శ్రీకారం చుట్టబోతోంది.

### యువత, నిరుద్యోగుల్లో చైతన్యం..!

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొమ్మిదిన్నర ఏండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడానికి యువత, నిరుద్యోగులే కీలకమని చెప్పవచ్చు. ఉద్యోగ ప్రకటనలు ఇవ్వడం లేదని మూడేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే కేవలం ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గట్టిగా భరోసా నివ్వడంతో యావత్ నిరుద్యోగ సమాజం హస్తం పార్టీకి జై కొట్టింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్న తరుణంలో ఉద్యోగాల సంగతి తేల్చాలని బిఆర్ఎస్ పట్టుబడుతోంది. ఇప్పటివరకు ప్రకటించిన నోటిఫికేషన్లు, ఇచ్చిన ఉద్యోగాల అంశాన్ని యువత, నిరుద్యోగుల్లోకి బలంగా తీసుకు వెళ్లాలని భావిస్తోంది. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన పై ప్రకటించిన ఆందోళన రూపాల్లో ఈ అంశాన్ని గులాబీ నేతలు ప్రధానంగా ఎంచుకోవడం గమనార్హం.

### విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై..

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బి.ఆర్.ఎస్ ఆరోపిస్తోంది. అధికార పార్టీ పాలనపై పూరించిన సమర శంఖంలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే పలు వేదికలపై పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని గులాబీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో పరిస్థితులు దయనీయంగా మారాయని, ఇంటర్ వరకు విద్యార్థులకు కనీసం ఉపకార వేతనాలు కూడా విడుదల చేయడం లేదని సర్కారు పై దుమ్మెత్తి పోయనున్నారు. అదేవిధంగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని కూడా లేవనెత్తే అవకాశం ఉంది. గత ఎన్నికల సమయాన ఆడ బిడ్డ లకు స్కూటీలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీని కూడా గుర్తు చేసేందుకు గులాబీ నేతలు సన్నద్ధమవుతున్నారు.

### ఖమ్మంలో పువ్వాడ అజయ్ జంగ్ సైరన్..!

బి ఆర్ ఎస్ పార్టీ జరుప తలపెట్టిన పది రోజుల ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గులాబీ నేతలు సమయాత్తమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కనిపిస్తోంది. దీనిలో భాగంగా ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హస్తం సర్కారుపై జంగ్ సైరన్ మోగించారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా బుధవారం భారీ ధర్నా నిర్వహిస్తున్నామని ప్రకటించారు. పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగునున్న కాంగ్రెస్ వ్యతిరేక పోరాటాలకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, పాలేరులో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, మధిరలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, వైరాలో ఇంచార్జ్ గుండాల కృష్ణ, సత్తుపల్లి లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కొత్తగూడెంలో ఎంపీ వద్దిరాజు, అశ్వరావుపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు, పినపాకలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ వంటి ముఖ్య నాయకులు అందరూ వారి వారి ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రజల్లో చైతన్యాన్ని కల్పిస్తామని చెబుతున్నారు.

# దొంగల ముఠా అరెస్ట్

## కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి హత్యకు యత్నం

- ఏడు మేకలు, హోండా అమేజ్ కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం..
- నలుగురు నిందితుల అరెస్ట్



**మరిపెడ సెప్టెంబర్ 1(జనం సాక్షి)** : రాత్రి వేళల్లో కారులో తిరుగుతూ నిఘ పెట్టి ఇళ్ల వద్ద కట్టేసి ఉంచిన మేకలు, గొర్రెలను దొంగతనం చేస్తున్న ముఠాను మరిపెడ పోలీసులు అరెస్ట్ చేశారు. వాహన తనిఖీల సమయంలో పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే క్రమంలో పోలీస్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించిన నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ రవితేజ గాయపడగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మరిపెడ పోలీసులను జిల్లా ఎస్పీ డాక్టర్ శ్రీ శబరీష్ పి. ఐపీఎస్, తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ అభినందించారు. కేసు వివరాలను మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో పెట్రోలింగ్‌లో భాగంగా రాజీవ్ సెంటర్ వద్ద మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్, పీసీ జీ. రవితేజ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో కురవి రోడ్డు వైపు నుంచి మరిపెడ వైపు ఒక తెల్లరంగు హోండా అమేజ్ కారు అధిక వేగంతో వచ్చింది. కారుకు ముందు, వెనుక నంబర్ ప్లేట్లను గుడ్డతో కప్పి ఉండటాన్ని పోలీసులు గమనించారు.

పోలీసులు కారును ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ డ్రైవర్ ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు కారును వెంబడించారు. సుమారు గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు సైరన్ మోగిస్తూ, హారన్ కొడుతూ కారును ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా మరిపెడ టౌన్ నుంచి కార్గిల్ సెంటర్ మీదుగా సూర్యాపేట రోడ్డులోకి వెళ్లాడు. అనంతరం మళ్లీ మరిపెడ గ్రామం వైపు తిరిగి, అక్కడి నుంచి సూర్యాపేట హైవేపైకి వెళ్లి సూర్యాపేట వైపు దూసుకెళ్లాడు. కారు వెనుక భాగాన్ని గుడ్డతో కప్పి ఉండటంతో డిక్కీలో ఏదైనా అనుమానాస్పద వస్తువు ఉండొచ్చని పోలీసులు అనుమానించారు. అంతేకాకుండా అధిక వేగంతో వెళ్తున్న కారు ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొంటే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉండటంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో తానం చెర్ల శివారులో పోలీసులు కారును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీస్ వాహనాన్ని ముందుకు తీసుకెళ్లి కారును నిలిపేందుకు ప్రయత్నించగా నిందితులు కొద్దిసేపు కారును నెమ్మదించారు. దీంతో పోలీస్ వాహనం వెనుక సీటులో ఉన్న కానిస్టేబుల్ రవితేజ కుడివైపు డోర్ తెరిచి కిందకు దిగారు. కారులోని డ్రైవర్‌ను దిగాలని చేతితో సిగ్నల్ ఇచ్చారు. అయితే నిందితులు కారును మళ్లీ వేగంగా కానిస్టేబుల్ రవితేజ వైపు నడిపించారు. అప్రమత్తమైన కానిస్టేబుల్ పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయినప్పటికీ కారు ఆయన కుడి చేతికి తగలడంతో గాయాలయ్యాయి. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు గట్టి హెచ్చరికలు చేయడంతో కొంతదూరం వెళ్లిన నిందితులు చివరకు తానం చెర్ల గ్రామ శివారులో, మరిపెడ-సూర్యాపేట రహదారి ప్రాంతంలో కారును నిలిపారు. కారును తనిఖీ చేయగా నలుగురు వ్యక్తులు ఉండటంతో పాటు, కారులో కిక్కిరిసి ఏడు మేకలను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మేకలపై ఇద్దరు వ్యక్తులు కాళ్లతో తొక్కి కూర్చుని ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మేకలు ఎక్కడివని, పోలీసులను చూసి ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించగా నిందితులు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దీంతో పోలీసులు తమ వద్ద ఉన్న ట్యాబ్ పాపిలాన్ పరికరం ద్వారా నిందితుల వేలిముద్రలను పరిశీలించారు. వేలిముద్రల పరిశీలనలో భూక్యా జగదీష్‌పై భూర్గంపాడు, నర్సంపేట, డోర్నకల్, ములకలపల్లి, దుగ్గొండి పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో ఐదు కేసులు ఉన్నట్లు గుర్తించారు. మరో నిందితుడు భూక్యా శ్రీధర్‌పై రెండు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## వరకట్నం వేధింపులకు యువతి ఆత్మహత్య!



**ఆత్మకూర్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి)**: ప్రేమ పెళ్లి పేరుతో కులాంతర వివాహం చేసుకున్న చల్ల అఖిల భర్త చల్ల ప్రవీణ్ రెడ్డి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందా.... హత్య చేసి ఫ్యాన్ ఉరి వేశారా అనే గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మంగళవారం గ్రామస్తులు.. బంధువుల వివరాల ప్రకారం చిన్నారావు పేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన అఖిల 24 తో ఆత్మకూరు మండలం గూడెప్పాడు గ్రామానికి చెందిన చల్ల ప్రవీణ్ రెడ్డి 2022లో కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు అద్విక్ రెడ్డి జన్మించారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ నిత్యం భర్త ప్రవీణ్ రెడ్డి వేధింపులకు గురి చేసే వారిని గుడెప్పాడు గ్రామస్తులు అంటున్నారు. సోమవారం ఉదయం నుంచి భార్యాభర్తల మధ్య ఘర్షణ జరగడంతో పాటు మంగళవారం ఉదయం కూడా గొడవ జరిగిందని గ్రామస్తులు అంటున్నారు. ఆగ్రహంతో భర్త భార్యను హత్య చేసి ఫ్యానుకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రవీణ్ రెడ్డి కి అగ్రవర్ణాల అండదండలతో కేసును తలకిందులుగా చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని స్థానిక తాసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సై తిరుపతి పరిశీలించి మృతురాలు బంధువు బూరచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# వికలాంగుల సంక్షేమ శాఖలో అవినీతిపై సీబీఐతో విచారించాలి

**రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. సత్యనారాయణకు డీహెచ్‌పీఎస్ వినతి**



**హైదరాబాద్ (జనంసాక్షి)** : వికలాంగుల సంక్షేమ శాఖలో అవినీతిపై సీబీఐతో విచారించాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితీ ప్రధాన కార్యదర్శి పిల్లి అంజయ్య రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. సత్యనారాయణకు విన్నవించారు. రాష్ట్రంలో వివిధ రకాల వైకల్యాలు ఉన్న వ్యక్తుల సంక్షేమం కోసం పాటుపడాల్సిన బాధ్యత కలిగినటువంటి, నిబద్ధతతో పనిచేయాల్సినటువంటి సాక్షాత్తు వికలాంగుల సంక్షేమ శాఖ పూర్తిగా అవినీతిమయంలో కూరుకుపోయిందని, దీనికి ప్రధానంగా గత ఆరు నెలల క్రితం వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ సాక్షాత్తు ప్రెస్ మీట్ పెట్టి, ఆధారాలతో సహా వికలాంగుల సంక్షేమ శాఖలో 150 కోట్ల అవినీతి జరిగినట్టు ఆరోపించారు. వికలాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ప్రెస్ మీట్‌లో చెప్పినటువంటి అంశాల పైన ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేయకపోవడం నిజంగా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారుల వైఖరిని, వికలాంగ సంక్షేమం పట్ల వాళ్లకు ఉన్నటువంటి నిబద్ధతను స్పష్టం చేస్తుందని, తెలిపారు. 15 సంవత్సరాలుగా జరుగుతున్న అవినీతి టెండర్లు, ఆ టెండర్లలో ఇచ్చిన వస్తువులు, వాటి నాణ్యత ప్రమాణాలు, క్వాలిటీ కంట్రోల్ చెక్‌తో పాటు అకౌంటబిలిటీ, ఫండింగ్ మరియు ఎన్నికల సమయంలో కొన్ని వీల్‌చైర్ల టెండర్ల అవినీతి అక్రమాలపై, డిపార్ట్‌మెంట్‌లో పేరుకుపోయిన అవినీతి అక్రమాలు, రిటైర్డ్ ఉద్యోగుల నియామకాలు, వారికి చెల్లిస్తున్న జీతభత్యాల పైన మరియు గత 15 సంవత్సరాలుగా డిపార్ట్‌మెంట్‌లో టెండర్ల నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా జరుగుతున్న టెండర్ల ప్రక్రియ నిర్వహణ, నిధుల రిలీజ్ వంటి అనేక అంశాల పైన సీబీఐ ఎంక్వయిరీకి ఆదేశించాల్సిందిగా కోరారు. కళ్ళు లేని, కాళ్ళు లేని, నడవలేని, వినలేని, మాట్లాడలేని తదితర వైకల్యాలు ఉన్న వికలాంగుల సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం పనిచేయాల్సిన వికలాంగుల సంక్షేమ శాఖ ఉన్నత అధికార యంత్రాంగం మొత్తం వికలాంగుల అభివృద్ధిని మరిచిపోయి, సంక్షేమాన్ని పక్కనపెట్టి, ప్రభుత్వం విడుదల చేసిన నిధులన్నింటినీ దారి మళ్లించింది. వికలాంగుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన నిధులను, వికలాంగుల సంక్షేమ శాఖలో ఒకే అధికారి అయిన బి. శైలజ జేఎండీగా, ఎఫ్ఏసీగా, కమిషనర్‌గా తదితర అనేక బాధ్యతలు నిర్వహిస్తూ గత 15 సంవత్సరాలుగా దారి మళ్లిస్తూ వికలాంగుల సంక్షేమాన్ని అట్టడుగు పాతాళానికి తొక్కిపడేశారని తెలిపారు. వికలాంగుల సంక్షేమ శాఖలో ఎయిడ్స్ అండ్ అప్లయెన్సెస్ పరికరాల టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ సంస్థల ద్వారా కాకుండా ప్రైవేటు వ్యక్తులతో అర్ధరాత్రి రెండు గంటల వరకు చేయాల్సిన అవసరం ఏంటి? అందులో వారి అవినీతి ఫలితం ఏంటో అర్థం చేసుకోవాలని, అలాగే ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎయిడ్స్ అండ్ అప్లయెన్సెస్ పరికరాలపై ప్రభుత్వ ఇంజనీరింగ్, మోటార్ అండ్ వెహికల్ ఇంజనీరింగ్, టెక్నికల్ విభాగంతో క్వాలిటీ కంట్రోల్ చెక్ చేపించాలని, ఎందుకంటే సంక్షేమ శాఖ పంచిన మోటార్ వెహికల్స్, లాప్‌టాప్‌లు, బ్యాటరీ వెహికల్స్, బ్యాటరీ వీల్ చైర్లు నాసిరకంగా ఉన్నాయని రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల సమాజం ఆవేదన చెందుతోందని, సంగారెడ్డి కలెక్టర్ స్వయంగా ప్రిన్సిపాల్ సెక్రెటరీకు నాసిరకం వస్తువులు సప్లై చేశారని చర్యలు తీసుకోవాలని లేఖ రాశారంటే వికలాంగుల సంక్షేమ శాఖ యంత్రాంగం అవినీతి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

## రైతులకు పాత పద్ధతిలోనే ఎరువులు విక్రయించాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు



**కోహెడ, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** కోహెడ మండల కేంద్రం లోని పలు ఫర్టిలైజర్ షాపులు, గ్రోమోర్, ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు విక్రయిస్తున్న ఎరువులు అందించాలని, కేంద్ర ప్రభుత్వం ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ డిజిటల్ ద్వారా విక్రయాలను అమలు చేయడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ప్రభుత్వ వైఖరి పై ధ్వజమెత్తారు. ఇట్టి పద్దతిని తక్షణమే రద్దు చేసి పాత పద్దతిలో ఎరువుల విక్రయాలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యవసాయదారులకు అనుకూలమైన ఈ విధానం చిన్న సన్నకారు, కౌలు రైతులకు ఏమాత్రం పనికి రాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చొప్పరి లింగం ముదిరాజ్, బండారు శ్రీనివాస్, రమేష్, భూమయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా బీదర్‌కు 34 టన్నుల ఇసుక తరలింపు

- అర్ధరాత్రి అడ్డుకొని కేసు నమోదు చేసిన పోలీసులు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని కరీంనగర్ నుండి జహీరాబాద్ కు ఇసుక తరలిస్తున్నట్టు అనుమతులు పొంది.. అక్రమంగా కర్ణాటకలోని బీదర్ పట్టణానికి ఇసుకను తరలిస్తుండగా స్థానిక పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 34 టన్నుల సామర్థ్యం గల ఇసుక జహీరాబాద్ పట్టణానికి వెళ్లాల్సింది ఉండగా.. అందుకు విరుద్ధంగా కర్ణాటకలోని బీదర్ పట్టణానికి అక్రమంగా రవాణా చేస్తున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి మండలంలోని జహీరాబాద్ - బీదర్ రోడ్డు, మండలంలోని గంగువార్ గ్రామ శివారులో ఇసుక లారీని అడ్డుకొని స్టేషన్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తదితర చర్యల నిమిత్తం స్థానిక తహసిల్దార్ కు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

- 35 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు
- హోమ్‌గార్డ్ ఎల్లయ్యను సత్కరించిన జిల్లా ఎస్పీ



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ అనేది సహజమని, విధి నిర్వహణలో అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. 60 ఏళ్లు పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న హోమ్‌గార్డ్ ఎల్లయ్యను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎల్లయ్య గత 35 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ శాఖకు సేవలందించిన ఎల్లయ్య సేవలు ప్రశంసనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఎల్లయ్యకు, ఆయన కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హోమ్‌గార్డ్ కమాండెంట్ ఆర్. వెంకటేశ్వర్లు, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐ డానియెల్, హోమ్‌గార్డ్ ప్రెసిడెంట్ జితేందర్, యాదయ్య, పదవీ విరమణ పొందిన ఎల్లయ్య కుటుంబ సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పంటల నమోదు పక్కాగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**టేక్మాల్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** మండల రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం టేక్మాల్ మండలం ఎల్లుపేట్ గ్రామంలో జరుగుతున్న పంటల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం, సాగు విధానం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంటల నమోదును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మెదక్ జిల్లాలో 6.9 శాతం పంటల నమోదు పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. పంటల నమోదు ఆధారంగానే రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంటల కొనుగోలు తదితర ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సెప్టెంబర్ 30లోగా పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేసి సమగ్ర వివరాలను సంబంధిత శాఖకు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, తహసీల్దార్ తులసీరాం, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, సర్పంచ్ మాధవి నరసింహారెడ్డి, ఏఈఓ సుభాష్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మేఘారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలి

- అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఎస్పీకి వినతిపత్రం

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే మేఘారెడ్డి దళితుల అసైన్డ్ భూములకు సంబంధించిన వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, నాయకులు ఎం. రాజశేఖర్, దొడ్ల రాములు, జాత్రు నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేఘారెడ్డి వెలుటూరు శివారులో జాతీయ రహదారికి సమీపంలోని సర్వే నంబర్ 517/ఆ2లో 0.39 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని, రెవెన్యూ రికార్డుల్లో పట్టా మార్పిడి చేయించుకున్నారని ఆరోపించారు. ఈ భూమి దళితులకు సంబంధించిన లావణి పట్టా భూమి, నిషేధిత భూమి అని వారు పేర్కొన్నారు. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలపై నిబంధనలు ఉన్నప్పటికీ అధికారాన్ని ఉపయోగించి పట్టా మార్పిడి చేయించుకున్నారని ఆరోపించారు. అదేవిధంగా దోడగుంటపల్లి-



-అంకూరు మధ్య సోలార్ ప్లాంట్ కోసం ప్రథమేష్ సోలార్ ఫార్మ్‌కు సర్వే నంబర్లు 548/ఊ2, 548/ఊ4, 548/ఊ5, 548/ఊ3, 548/ఊ2, 548/ఊ1 పరిధిలోని సుమారు 5 ఎకరాల 10 గుంటల లావణి పట్టా భూమిని రిజిస్ట్రేషన్ చేయించడంలో ఎమ్మెల్యే పాత్ర ఉందని నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర సర్వే నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

ఎన్నికల అఫిడవిట్‌లో లావణి పట్టా భూమిని 'పట్టా భూమి'గా పేర్కొన్నారని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని వారు ఆరోపించారు. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినట్లయితే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మూడు సంవత్సరాలుగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలను ఇప్పటివరకు నిరూపించలేకపోయారని, అందుకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. నిరంజన్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డిపై భూముల వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించినట్లు నాయకులు తెలిపారు. సంబంధిత ఆరోపణలపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలకు సంబంధించిన అంశాలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకువస్తామని నాయకులు పేర్కొన్నారు. ఆరోపణలపై ఎమ్మెల్యే స్వయంగా స్పందించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్ నాయక్, ఎద్దుల సాయికుమార్, వసంత్, జూదం వెంకటేష్, పీన్యా నాయక్, నారాయణ నాయక్, కవితా నాయక్, సర్పంచులు శోభా, రాజమ్మ, గోవిందు నాయక్, శాంతయ్య, శాంతన్న, దేవకుమార్, చైతన్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రధాన కార్యదర్శి

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 4న నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ఐఏఎస్ మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి మద్దూరు పరిసర ప్రాంతాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులు, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా మద్దూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం చింతల్‌దిన్నె మార్గంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల/కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల/కళాశాల నిర్మాణ ప్రాంగణంలో భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్, పనుల టైమ్‌లైన్‌తో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని



ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ పరిశీలించారు. మద్దూరు సమీపంలోని డిగ్రీ కళాశాల భవనం వద్ద ఒక స్థలంతో పాటు చింతల్‌దిన్నె సమీపంలోని మరో స్థలాన్ని పరిశీలించి, హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన భద్రతా, సాంకేతిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

## 22ఏ భూముల డేటా ఖచ్చితంగా సిద్ధం చేయాలి

**టేక్మాల్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** సెక్షన్ 22ఏ పరిధిలోని భూములకు సంబంధించి మండల, గ్రామాల వారీగా సమగ్ర పరిశీలన జరిపి వాస్తవమైన, ఖచ్చితమైన డేటాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం టేక్మాల్ మండలం సాలోజిపల్లిలో జరుగుతున్న భూముల రీ-సర్వే పనులను ఏడి ల్యాండ్ సర్వేయర్ కిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల రీ-సర్వే, భూ భారతి, సాదా బైనామాలు, రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను సెక్టార్, గ్రామాల వారీగా ప్రొఫార్మాలో సిద్ధం చేయాలని సూచించారు. 22ఏ కింద ఉన్న వివిధ కేటగిరీల భూముల



వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, గతంలో సిద్ధం చేసిన డేటాతో సరిపోల్చాలని ఆదేశించారు. 22ఏ భూముల డేటాలో ఎలాంటి తప్పులు, వ్యత్యాసాలు లేకుండా అన్ని మండలాల అధికారులు సమన్వయంతో పూర్తి వివరాలను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తులసి రామ్, సర్పంచ్ ఇర్షత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసుల విచారణను వేగవంతం చేయాలి

- పారదర్శకంగా, ఆధారాలతో ప్రక్రియ పూర్తి చేయాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పిల్లికొట్టిల్‌లోని 12వ వార్డులో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ నోటీసుల విచారణలో భాగంగా సంబంధిత ఆధారాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, అవసరమైన వివరాలను సేకరించి యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. విచారణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పిల్లికొట్టిల్‌లో మొత్తం 124 ఎస్ఐఆర్ నోటీసులు జారీ కాగా, ఇప్పటివరకు 91 నోటీసులకు సంబంధించిన విచారణ పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన నోటీసుల విచారణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి తప్పు ఒప్పులకు తావులేకుండా, నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో ఎస్ఐఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- పెన్షన్ వ్యతిరేక దినం
- నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

**సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** కొత్త పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. సోమ శేఖర్ మంగళవారం డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 1న పెన్షన్ వ్యతిరేక దినంగా పాటించారు. ఇందులో భాగంగా చేర్యాల కంది ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం. సోమ శేఖర్ మాట్లాడుతూ.. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, అలాంటి హక్కును ఉద్యోగుల నుంచి దూరం చేయడం సరికాదన్నారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా, ఎన్నికల ప్రణాళికలోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొందన్నారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ముప్పై నెలలు గడిచినా ఇప్పటివరకు కొత్త పెన్షన్ విధానం రద్దుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడకుండా వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని




డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చ. వెంకట రాజయ్య, వెంకట లక్ష్మి సుమలత, లక్ష్మయ్య, యాదగిరి, చంద్రశేఖర్, శ్రీనివాస్, వినీల, మణెమ్మ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

- కాంగ్రెస్ దాడిని నిరసిస్తూ వనపర్తిలో బీజేపీ
- నాయకుల ఆందోళన

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడటాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలను ఎదుర్కోలేక భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని విమర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ నాయకుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులకు పాల్పడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ తీరుపై కూడా వారు ప్రశ్నలు లేవనెత్తారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష



పార్టీల కార్యాలయాలకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడితే సహించేది లేదని, దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా పోరాడతామని హెచ్చరించారు. రాజకీయ విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

### కాంగ్రెస్ కార్యాలయం ఎదుట బీజేపీ నిరసన

తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి నిరసనగా వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ దాడి రాజకీయాలను నిరసిస్తూ నినాదాలు చేశారు.

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీజేపీ నాయకులు, పార్టీ కార్యాలయాలకు భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో అలసత్వం వహిస్తే చర్యలు

- శానిటేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి : కమిషనర్



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బల్దియా కమిషనర్ టి. వెంకన్న శానిటేషన్ అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సంబంధ అంశాల పురోగతి పై శానిటరీ సూపర్ వైజర్ లు,శానిటేషన్ ఇన్స్పెక్టర్ లతో క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఇందుకోసం శానిటరీ సూపర్ వైజర్ లు,శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో నిర్విరామ గా విధులు చేపట్టాలని నగరం లోని ప్రధాన రహదారుల వెంట గల డివైడర్ ల పక్కన పేరుకు పోయిన మట్టి చెత్తా చెదారం ను ఎప్పటికప్పుడు తొలగించాలని నగర సుందరీకరణ కు పాటు పడాలని, స్వీపింగ్ యంత్రాలు వారికి కేటాయించిన ప్రాంతాల్లో క్లీనింగ్ ప్రక్రియ జరిగేలా శానిటేషన్ అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశం లో ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి,ఆరోగ్యాధికారి డా.రాజేష్, శానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్, నరేందర్, గోల్కొండ శ్రీను, శానిటరీ ఇన్స్పెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ భూములపై ఖచ్చితమైన డేటా సిద్ధం చేయాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సెక్షన్ 22ఏ పరిధిలోని భూములకు సంబంధించి మండల, గ్రామాల వారీగా సమగ్రంగా పరిశీలించి వాస్తవమైన, ఖచ్చితమైన డేటాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో భూములు రీ సర్వే, భూ భారతి, సాదా బైనామా, రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను సెక్టార్, గ్రామాల వారీగా ప్రొఫార్మాలో సిద్ధం చేయాలని సూచించారు. డిసెంబర్ 2025 నాటికి సెక్షన్ 22ఏ కింద ఉన్న 1ఏ, 1బి, 1సి, 1డి తదితర కేటగిరీల భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, 2016, 2021 సంవత్సరాల్లో సిద్ధం చేసిన డేటాతో సరిపోల్చాలని తెలిపారు. మండల, గ్రామాల వారీగా భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నట్లయితే వాటికి గల కారణాలను గుర్తించి, అవసరమైన సవరణలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న పాత డేటాను సేకరించి, ప్రస్తుత వివరాలతో పోల్చి పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు పూర్తికాని ల్యాండ్ రికార్డుల సవరణలు, ప్రతిపాదనలు, నివేదికల తయారీ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చిన అంశాలకు సంబంధించి నిబంధనల ప్రకారం ప్రొఫార్మాలు సిద్ధం చేసి, తహసీల్దార్, ఆర్డీవో, రెవెన్యూ అదనపు కలెక్టర్ సంతకాలతో సమర్పించాలని తెలిపారు. ఫారెస్ట్ భూములు, సాగునీటి ప్రాజెక్టులు, సింగరేణి భూములకు సంబంధించి భూముల వాస్తవ స్వభావాన్ని పరిశీలించాలని, ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్, అవార్డుల వివరాలను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ, వ్యవసాయేతర కేటగిరీలను నిబంధనల ప్రకారం నిర్ధారించాలని సూచించారు. రీ సర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్లు, జిపిఓలను సమన్వయం చేసుకుంటూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని తెలిపారు. భూ సర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 30వ తేదీ నాటికి భూములకు సంబంధించిన యాక్షన్ ప్లాన్పై పూర్తి వివరాలతో కూడిన నివేదికలను ప్రతి మండల తహసీల్దార్ జిల్లా కలెక్టర్కు సమర్పించాలని, 22ఏ భూముల డేటాలో ఎలాంటి తప్పులు, వ్యత్యాసాలు లేకుండా వాస్తవ వివరాలను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదం ఘర్షణ

- 12 మంది బైండోవర్



**బచ్చన్నపేట సెప్టెంబర్ 1( జనం సాక్షి) :** రెండు వర్గాల భూ వివాదంలొ 12 మందిని స్థానిక తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు బచ్చన్నపేట ఎస్సై ఏ శ్రీకాంత్ తెలిపారు. మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాతు చిన్నరాంచర్ల గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన కొమ్మరాజుల యాదగిరి కొమ్మరాజుల రవికుమార్ కుటుంబాల మధ్య పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమికి సంబంధించిన వివాదం గత కొంతకాలంగా కొనసాగుతోందని సోమవారం మధ్యాహ్నం సుమారు 3:00 గంటల సమయంలో, రవికుమార్ తన భూమిలో ఇల్లు నిర్మిస్తున్నాడని అభ్యంతరం వ్యక్తం చేస్తూ యాదగిరి తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లగా, ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల వారు పరస్పరం కర్రలతో దాడి చేసుకోవడంతో కొంతమందికి స్వల్ప గాయాలు అయినట్ల ఫిర్యాదులు అందాయని ఈ ఘటనపై ఇరువర్గాలు బచ్చన్నపేట పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో, ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని భూ వివాదం కారణంగా ఇరువర్గాల మధ్య మళ్లీ ఘర్షణలు జరిగే అవకాశం ఉండటంతో, రెండు కుటుంబాలకు చెందిన మొత్తం 12 మందిని తహసీల్దార్ సమక్షంలో బైండ్ ఓవర్ చేయడం జరిగిందన్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడయన్నారు

## ఆర్ఎంపీ ముసుగులో గ్యాస్ దందా

- అమాయక ప్రజలే టార్గెట్
- ఒక్కో గ్యాస్ కు 500 నుండి 1000 రూ ల సంపాదన

**శాయంపేట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ఆయన ఒక ఆర్.ఎం.పి డాక్టర్ , ఆ దందా సరిపోకపోవడంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ధ్యేయంతో చుట్టుప్రక్కల గ్రామాల అమాయక ప్రజలను టార్గెట్ చేసి ధనర్జన ధ్యేయంగా సంపాదిస్తున్న వైనం. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గ్యాస్ దందా విచ్చలవిడిగా నడుస్తోంది. అసలే గ్యాస్ కొరత, ఇజ్రాయిల్ అమెరికా దేశాలలో జరుగుతున్న యుద్ధ పరిణామాలతో గ్యాస్ కొరత ఏర్పడి రాష్ట్రాలకు తీవ్రప్రభావాలను నెలకొల్పింది. ఇదే అదునుగా భావించి ఆర్ఎంపీ డాక్టర్ అమాయక ప్రజల లొసుగులను గుర్తించి వారి సెల్ ఫోన్ నెంబర్లు సేకరించి దాని ఆధారంగా ఓటిపితో గ్యాస్ బుక్ చేసుకుని తన ఇంటికి తెప్పించుకొని నిలువచేసి మల్లంపల్లిలోని హోటళ్లకు 1500 నుండి 2500 రూపాయల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ తతంగం అంతా కొన్ని నెలల నుండి జరుగుతున్న సంబంధిత అధికారులు గుర్తించకపోవడం గమనార్వం.. ఈ వివరాలను తెలుసుకున్న జనం సాక్షి రిపోర్టర్ కాట్రపల్లి గ్రామంలో విచారిం చడంతో ఇటువంటి దుర్ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### నా సెల్ తో గ్యాస్ బుక్ చేసుకున్నాడు



రమేష్ అనే వ్యక్తి అమాయక ప్రజల నుండి సెల్ తీసుకుని దాని ద్వారా గ్యాస్ బుక్ చేసుకుని మల్లంపల్లిలోని ఓ హోటల్ కు 2000 రూపాయలకు అమ్ముతున్నాడు. స్వయంగా నా సెల్ ఫోన్ తీసుకొని బుక్ చేసుకున్నాడు. గ్రామంలోని కొంతమంది దగ్గర ఇదేవిధంగా సెల్ తీసుకొని దానిద్వారా గ్యాస్ ఏజెన్సీ వాళ్లకు ఓటిపి చెప్పి వారి సహకారంతో గ్యాస్ ల ను తన ఇంటి లోపల నిల్వ చేసుకొని హోటళ్లకు సరఫరా చేస్తున్నాడు. కొంతమందికి మందు ఎర చూపి గ్యాస్ ను తీసుకుంటున్నాడు. అధికారులు గ్రామంలో విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలి.

**సంఘాల మైపాల్ బాధితుడు కాట్రపల్లి గ్రామం, శాయంపేట మండలం.**

## పరకాల ఎమ్మెల్యే కోసం ఆయుష్య హోమం



- రేవూరి ప్రకాశ్రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు

**పరకాల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ భవాని కుంకుమేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఆయుష్య హోమం నిర్వహించారు. కోమల్లపల్లి సంపత్శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి ప్రజాసేవలో మరింత కాలం కొనసాగాలని, నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మా ఎమ్మెల్యేను బదనాం చేస్తే తాట తీస్తాం..

- కంతాత్మకూర్ సర్పంచ్, గ్రామస్తులు ఆగ్రహం



**నడికూడ, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** మండలంలోని కంతాత్మకూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న 717 సర్వే నెంబర్ లో సాకరి గుట్ట పై మైనింగ్ పర్మిషన్ రద్దు చేయ్యాలని గ్రామస్థులు ప్రజలు అందరు ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. గ్రామ సభ అనంతరం గ్రామస్థులు బస్టాండ్ కూడలిలో పెద్ద ఎత్తున సాకరి గుట్ట మైనింగ్ పర్మిషన్ రద్దు చేయ్యాలని ధర్నా నిర్వహించారు. సాకరి గుట్ట మైనింగ్ పర్మిషన్ ఇవ్వడానికి ఎమ్మెల్యే సహకారం ఉందని కొందరు అసత్య ప్రచారం చేస్తూ కుట్రలు చేస్తున్నారని ఈ అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రామస్తులు మండిపడ్డారు మా అభివృద్ధి ప్రదాత మా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పై అసత్య ప్రచారాలు చేస్తే తాట తీస్తాం అని గ్రామ సర్పంచ్ కొంగంటి తిరుపతి గ్రామస్తులు హెచ్చరించారుమా యొక్క పురాతన కట్టడాలు, ప్రకృతి అందాలు భావితరాలకు అందించే విధంగా గ్రామస్తులంతా పోరాడతామని సాకరిగుట్ట మైనింగ్ పర్మిషన్ రద్దు కోసం ఎంత దూరం అయినా వెళ్లడానికైన గ్రామస్తులం అందరం సిద్ధంగా ఉన్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**తాండూర్, సెప్టెంబర్ 01(జనం సాక్షి) :** ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని తాండూర్ మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని పరిశీలిం చారు. మాదారం గ్రామపంచాయతీని సందర్శించి ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ ప్రక్రియను పరిశీలించి సిబ్బందితో ప్రక్రియ నిర్వహణ వివరాలు తెలుసుకుని, నోటీసుల పంపిణీ, విచారణకు సంబంధించిన పనులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి చేయూత పింఛన్లకు సంబంధించిన పనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఆయా పథకాల కింద చేపడుతున్న పనులు, పెండింగ్ అంశాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని బోయపల్లి ప్రీ-ప్రైమరీ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల ను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలను తెలుసుకున్నారు. బేస్లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను బట్టి బోధన విధానాలను రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బోయపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించారు. విచారణకు హాజరైన వారి నుంచి వివరాలు తెలుసుకుని, ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విచారణ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ పర్యటనలో తహసిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్,డిప్యూటీ తహశీల్దార్ కల్పన, ఆర్ ఐ పద్మజా, జిపిఓ పద్మ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ సీఈఓ గా ఎన్ వసంత బాధ్యతలు స్వీకరణ



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా పరిషత్ సీఈఓ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వసంత మంగళ వారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ని మర్యాదపూర్వకంగా కలిశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు చేపట్టిన సీఈఓ తో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిపాలనలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి సూచించారు.

## నిలువ నీడ లేక అల్లాడుతున్న నిరుపేద వితంతువు

- కెరమెరి మండలం పరండోలి గ్రామానికి చెందిన దీనగాథ



**కెరమెరి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పతంగే లత.పరండోలి గ్రామానికి చెందిన ఈమె భర్త 2018వ సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అప్పటి నుండి ముగ్గురు పిల్లలతో ఒంటరి మహిళగా అష్టకష్టాలు పడుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తున్న లతకు సొంతంగా ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడం విషాదం. పూరి గుడిసెలోనే వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ దయనీయ జీవితం గడుపుతోంది. వితంతు పెన్షన్ తో, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న ఈ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు మంజూరు చేసి, నిలువ నీడ కల్పించి మానవత్వం చూపాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం కనికరించి ఈ నిరుపేద వితంతు మహిళకు ఇల్లు మంజూరు చేస్తుందా? అని ఎదురుచూస్తున్నారు.

## పిలుపుల్లోనే ఆప్యాయత.. ఆ ఊరంతా బంధుత్వమే..

- విధి రాతకు నలుగురు బలి..
- కన్నీటి సముద్రమైన పార్డి (బి) గ్రామం





**కుబీర్, సెప్టెంబర్ 1, (జనంసాక్షి):** ఆ ఊరంతా ఒకే కుటుంబం. ఒకరినొకరు పేరు పెట్టి పిలుచుకోరు.. 'అక్క, బావ, మామ, కాకా' అంటూ ఆప్యాయంగా పలకరించుకునే పల్లెటూరు అది. కానీ, విధి ఆ బంధాల ఊరిపై కక్ష గట్టింది. సోమవారం సాయంత్రం మహారాష్ట్రలో జరిగిన ఘోర జీపు ప్రమాదం ఆ పల్లెల్లో ఎప్పటికీ పూడ్చలేని శోకాన్ని నింపింది. కుబీర్ మండలంలోని పార్డి (బి) గ్రామానికి చెందిన సాయన్న, గంగాధర్, గౌరాబాయిలతో పాటు అదే గ్రామానికి చెందిన జీపు డ్రైవర్ తులసీరామ్ ఒకేసారి మృత్యు ఒడిలోకి చేరడంతో పార్డి (బి) గ్రామం రోదనలతో మునిగిపోయింది. అంత్యక్రియలకు హాజరైన ప్రతి ఒక్కరికీ మృతులు ఏదో ఒక వరుస బంధుత్వం ఉన్నవారే కావడంతో, ఆ ఊరిలో ఏ ఒక్క ఇంటా పొయ్యి వెలగలేదు.

### ఏడాది తిరక్కముందే చితికిన కాపురం

ఈ ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ తులసీరామ్ విషాదం అందరినీ కలచివేస్తోంది. పెళ్లై కనీసం సంవత్సరం కూడా పూర్తి కాకముందే తులసీరామ్ నూరేళ్ల జీవితం ముగిసిపోవడంతో అతని భార్య, కుటుంబ సభ్యులు పర్యంతమయ్యారు. పచ్చని సంసారంలో విధి వక్రీకరించి భార్య పసుపు కుంకుమలను దూరం చేసింది. దీంతో ఇరు కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. తులసీరాం మృతుదేహంపై పడి ఏడ్చిన రోదనలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి కంటతడి పెట్టించాయి.

### కన్నీరు పెట్టించిన పాడెల దృశ్యం

మంగళవారం పార్డి (బి) గ్రామంలో ఒకేసారి నలుగురి శవయాత్ర మొదలైంది. నిన్నటివరకు తమ కళ్లముందే తిరుగుతూ, ఆప్యాయంగా పలకరించిన డ్రైవర్ తులసీరామ్తో పాటు మిగిలిన ముగ్గురిని ఒకేసారి పాడెలపై స్మశానానికి మోసుకెళ్తుంటే బంధువులు, గ్రామస్థులు గుండెలు పగిలేలా ఏడ్చారు. ఆ కన్నీటి దృశ్యాలు చూసిన ప్రతి ఒక్కరి కంటతడి పెట్టించాయి. ప్రమాదంలో భర్తలను కోల్పోయిన గంగాధర్ భార్య ప్రేమల, సాయిలు భార్య ముత్తుబాయిల రోదనలు చూసి అక్కడికి వచ్చిన వారి గుండెలు తరుక్కుపోయాయి. "మమ్మల్ని ఒంటరిని చేసి ఎటు వెళ్తిరయ్యా" అంటూ వారు వేసిన కేకలు అరణ్యరోదనగా మారాయి. ఆప్యాయంగా పలకరించే నోళ్లు ఒక్కసారిగా మూతబడటంతో గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయారు.

### కాలం చెల్లిన వాహనాల నిర్లక్ష్యానికి బలికావాల్సిందేనా?

ఈ ఘోర ప్రమాదానికి కారణమైన జీప్ పూర్తిగా కాలం చెల్లిందని (కండీషన్ లేనిదని) పార్డి (బి) గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై యథేచ్ఛగా కాలం చెల్లిన వాహనాలు నడుపుతూ అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్నా రవాణా శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈరోజు తమ గ్రామానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి అన్ఫిట్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, సర్వస్వం కోల్పోయిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పార్డి (బి) గ్రామస్థులు కన్నీళ్లతో డిమాండ్ చేస్తున్నారు.

## అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి , సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** జిల్లాలో జాతీయ రహదారి 63 రహదారి నిర్మాణంలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి డి.ఎ.ఓ. రమేష్ తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సమిష్టిగా సాధించాలి

- భూపాలపల్లి ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి ఏరియాలో సంస్థ నిర్దేశించిన లక్ష్యం ప్రకారం బొగ్గు ఉత్పత్తిని పెంచవలసిన అవసరం ఉందని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2026కు సంబంధించిన వివరాలను ఆయన తెలియజేస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.73 లక్షల టన్నులు కాగా సాధించిన ఉత్పత్తి, రవాణా 1.60 లక్షల టన్నులు అని, సాధించిన శాతం 43 శాతం అని, రోజువారీ యావరేజి 5157 టన్నులు అని తెలిపారు. ఓబి రిమూవల్ విషయంలో కెటికె ఓసి-2లో టర్నోవర్ లక్ష్యం 10.03 ఎల్బిసిఎం కాగా 8.66 ఎల్బిసిఎం సాధించి 86 శాతం నమోదు కాగా, కెటికె ఓసి-3లో 10.40 ఎల్బిసిఎం లక్ష్యానికి 13.02 ఎల్బిసిఎం సాధించి 125 శాతం నమోదయిందని, మొత్తంగా 20.43 ఎల్బిసిఎం లక్ష్యానికి 21.68 ఎల్బిసిఎం సాధించి 106 శాతం నమోదయిందని వివరించారు. అదే విధంగా సెప్టెంబర్ 2026 ఏరియా లక్ష్యం 3.84 లక్షల టన్నులు ఏఓపి యాన్యువల్ ఆపరేషన్ ప్లాన్ ప్రకారం రవాణా 3.84 లక్షల టన్నులు ఉండగా ఓపెన్ కాస్ట్ కెటికె-ఓసి-2 మరియు కెటికె ఓసి-3 ఓబి రిమూవల్ 20.18 ఎల్బిసిఎం ఏఓపి గా ఉందని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు ఉత్పత్తి పెంపు లక్ష్యాలను సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచడానికి సమన్వయంతో కూడిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
02 సెప్టెంబర్ 2026

## శిరీష కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది

- మంత్రి సీతక్క
- భరోసాగా రూ.7.30 లక్షలు ఇల్లు, ఉద్యోగం, భూమి




**ములకలపల్లి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** హైదరాబాద్ లో దారుణ హత్యకు గురైన చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుదని మంత్రి సీతక్క వెల్లడించారు. మంగళవారం చౌటిగూడెం బాధిత కుటుంబం ఇంటికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రూ. లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి తాను వ్యక్తిగతంగా మరో రూ. లక్ష సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తంగా రూ.7.30 లక్షల ఆర్థిక సాయం అందనుంది. కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతోపాటు, జీవనోపాధి కోసం భూమి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కుటుంబానికి ఆసరాగా నిలిచిన శిరీషను కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. కుటుంబాన్ని పోషించే శిరీష మృతి ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, జహీర్, కారం సుదీర్,తాండ్ర ప్రభాకర్ రావు, ఈర్ల రామ్మోహన్ రావ్, పాలకుర్తి సుమిత్, సర్పంచ్ కుంజా వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన పల్లె దవాఖాన నిర్మాణం

- నెల రోజులుగా నిలిచిపోయిన రూ.20 లక్షల భవన పనులు
- ఎప్పుడు పూర్తవుతుందోనని అబ్బుగూడెం గ్రామస్తుల ఆందోళన

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** అన్నపురెడ్డిపల్లి మండలంలోని అబ్బుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లె దవాఖాన భవన నిర్మాణానికి ఈ ఏడాది జనవరి నెలలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రారంభంలో పనులు కొంత వేగంగానే సాగి, భవనానికి సంబంధించిన గదుల నిర్మాణం వరకు చేపట్టారు. అయితే సుమారు నెల రోజులుగా నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోవడంతో అసంపూర్తిగా ఉన్న భవనం దర్శనమిస్తోంది.

వారం రోజుల్లో ప్రారంభిస్తామన్నా.. నెల దాటినా కదలని పనులు

నిర్మాణ పనులు ఎందుకు నిలిచిపోయాయనే విషయంపై గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను ప్రశ్నించినట్లు తెలిపారు. మరో పని ఉండడంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశామని, వారం రోజుల్లో తిరిగి ప్రారంభిస్తామని చెప్పినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే అధికారులు ఇచ్చిన హామీకి విరుద్ధంగా నెల రోజులు దాటినా పనులు తిరిగి ప్రారంభం కాకపోవడంతో గ్రామ ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.

### కాంట్రాక్టర్ సమస్యా.. అధికారుల పర్యవేక్షణ లోపమా?

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన సమస్యల వల్ల పనులు నిలిచిపోయాయా? లేక సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించిందా? అనే ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.

### పూర్తయితే గ్రామానికే వైద్య సేవలు

పల్లె దవాఖాన భవనం పూర్తయితే అబ్బుగూడెం గ్రామంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు స్థానికంగానే మెరుగైన ప్రాథమిక వైద్య




సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. చిన్నపాటి వైద్య అవసరాల కోసం మండల కేంద్రం లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని గ్రామస్తులు ఆశిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులు సద్వినియోగం అయ్యేలా భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి పల్లె దవాఖాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాజీ కార్పొరేటర్ ఓటే గల్లంతు..!

- సూపర్వైజర్ నిర్లక్ష్యంపై ఫిర్యాదు..
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు రమాదేవి ఫిర్యాదు

**ఖమ్మం, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. ఖమ్మం నగరంలోని కవిరాజ్‌నగర్‌కు చెందిన 11వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి ఓటు ముసాయిదా జాబితా నుంచి గల్లంతైంది. ఎన్యుమరేషన్ ఫారం స్వీకరించి అధికారికంగా అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చినప్పటికీ.. ఓటు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

### ప్రత్యేక డ్రైవ్.. అయినా నమోదు కాలేదు

ఎస్ఐఆర్--2026లో భాగంగా ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, శాశ్వత నివాసుల ఓట్లను వందశాతం గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు ఉన్నాయని రమాదేవి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినప్పటికీ తన ఓటు మాత్రం జాబితాలో లేకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోందన్నారు. తన ఎన్యుమరేషన్ ఫారాన్ని సూపర్వైజర్ దివ్య స్వీకరించి అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చారని, అనంతరం ఓటు నమోదు విషయమై ఫోన్‌లో సంప్రదించినప్పటికీ సరైన స్పందన ఇవ్వలేదని రమాదేవి ఆరోపించారు.

మాజీ కార్పొరేటర్ ఓటుకే దిక్కు లేదా..?

ప్రజాప్రతినిధిగా పనిచేసిన తన ఓటునే అధికారులు సక్రమంగా నమోదు చేయలేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటని రమాదేవి ప్రశ్నించారు. ఓటు నమోదు కోసం దరఖాస్తు తీసుకుని అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చిన తర్వాత కూడా పేరు ముసాయిదా జాబితాలో లేకపోవడంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. తన ఓటు తొలగింపు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయేమోనన్న అనుమానాన్ని రమాదేవి వ్యక్తం చేశారు. అయితే ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.



సూపర్వైజర్ దివ్య, బీఎల్ఓ శోభపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు తన ఓటును పునరుద్ధరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు చేసిన ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఓటు హక్కు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. మాజీ ప్రజాప్రతినిధి ఓటు విషయంలోనే ఇలా జరిగితే సాధారణ ఓటర్ల ఓట్ల పరిస్థితిపై కూడా అనుమానాలు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## యథేచ్ఛగా అక్రమ గ్రావెల్ తోలకాలు

- పట్టించుకోని అధికారులు



**ఎర్రుపాలెం, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఎర్రుపాలెం మండలంలోని నరసింహపురం, వెంకటాపురం, రాజుపాలెం, కొత్తపాలెం, తదితర గ్రామాల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ ఫారెస్ట్ భూములలో గుట్టలను తవ్వి అక్రమ రవాణా చేస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతూ విచ్చలవిడిగా అక్రమ గ్రావెల్ తోలకాలను తోలుతున్న అక్రమార్కుల ఆగడాలను అక్రమ మట్టి రవాణాను అరికట్టాలని సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.పశువులు జీవాలు మూగ జీవాలతోపాటు తోపాటు మనుషుల ప్రాణాలను సైతం బలి తీసుకుంటున్న అక్రమ గ్రావెల్ మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని తాసిల్దారు కార్యాలయశీ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం వినతి పత్రాన్ని అందించారు.భట్టి ఇలాకాలో సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకుండా గాలికి వదిలి వేయటంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మట్టి మాఫియా అక్రమార్కులు చెడ్డపేరు తెస్తున్నారని పలువురు పార్టీ అభిమానులు విమర్శిస్తున్నారు. అలాగే అధికారులు ఈ అక్రమ గ్రావెల్ తోలకాలను పట్టించుకోకపోవడం పై ప్రజలు అక్రమార్కుల ఆగడాలపై మండిపడుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేస్తూ సదరు అక్రమార్కులు ఇష్టానుసారంగా అటవీ సంపద అయిన గ్రావెల్ మట్టిని తవ్వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ట్రావెల్ మట్టి రవాణా చేస్తుండగా గ్రావెల్ మట్టి ట్రాక్టర్ కింద ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పడి మృతి చెందిన సంఘటన సోమవారం బుచ్చిరెడ్డిపాలెం గ్రామం వద్ద జరిగింది.ఇంత జరిగిన అధికారులు పట్టించుకోకుండా ఉండడంపై పలు అనుమానాలతో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ మట్టి రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, సెప్టెంబరు 1 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల మండలం, చేవెళ్ల మున్సిపాలిటీకి చెందిన 28 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.11.48 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కాలే యాదయ్య మంగళవారం చేవెళ్లలోని తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డితో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సాయం కొంతైనా భరోసా కల్పిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సాధ్యమైనంత త్వరగా ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తున్నానని కాలే యాదయ్య తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న 28 మంది లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని చికిత్సకు వినియోగించుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా రెడ్డి, దావల్గారి గోపాల్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచ్‌లు పడాల ప్రభాకర్, పడాల రాములు, కోఆప్షన్ సభ్యులు రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మల్గారి కార్తిక్‌రెడ్డి, ఎర్ర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- దేవరకొండ ఏరియా ఆసుపత్రిని 200 పడకలకు పెంచుతాం
- ఎమ్మెల్యే బాలు నాయక్



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో కలిసి ఆసుపత్రిలో ప్రత్యేక వైకల్య నిర్ధారణ కేంద్రం, 5 నుంచి 10 పడకలకు పెంచిన డయాలసిస్ వార్డు, రాజు నాయక్, మిత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిని 200 పడకలకు పెంచేందుకు ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో రూ.2 లక్షలతో జనరేటర్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ తదితర వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దేవరకొండ చుట్టుపక్కల మారుమూల, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్నందున స్థానికంగానే మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది పేదలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ప్రత్యేక వైకల్య నిర్ధారణ కేంద్రం ద్వారా ప్రతి సోమవారం, శుక్రవారం ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించి సదరం శిబిరాలు నిర్వహించి అర్హులకు ధ్రువపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, డాక్టర్ మాతృనాయక్, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రకాష్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఆకస్మికంగా తనిఖీ

- సక్రమంగా విధుల నిర్వహించాలని సిబ్బందిని హెచ్చరించిన జిల్లా కలెక్టర్



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొంషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ - పాల్వంచ, ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు.ఈ పాఠశాల 15 ఎకరాల విస్తీర్ణంలో 2017 ఏడాదిలో నిర్మించగా గతంలో పాల్వంచ ప్రాంతంలో ఉండగా,ప్రస్తుతం కొత్తగూడెం ప్రాంతానికి తరలించిన ఈ ఏకలవ్య మోడల్ స్కూల్ లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 480 మంది విద్యార్థులకు విద్యా తరగతులు, వసతి సౌకర్యాలు అందుతుండగా, ఆ భవన సముదాయాలను, పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలు జిల్లా కలెక్టర్ పాఠశాల ఇన్చార్జి మున్సిపల్ ప్రశంజీత్ భూసాల్ ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టీచింగ్ విభాగంలో 23 రెగ్యులర్ సిబ్బంది, 12 మంది ఔట్సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, నాన్ - టీచింగ్ విభాగంలో ఐదుగురు ఔట్సోర్సింగ్ సిబ్బంది ఉన్నారని తెలిపారు.240 మంది బాలికలకు,240 మంది బాలురకు ప్రత్యేక వార్డెన్స్ వేర్వేరుగా ఉన్నారని, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. విజయ గత నెల ఆగస్టు 17వ తేదీ నుంచి సెలవుల్లో ఉన్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పాఠశాల ఆవరణలో ఉన్న డైనింగ్ హాలులో వంట వండుతున్న కుకింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన వంటకాలను అన్నం, పప్పు, సాంబార్,రసం, పెరుగు, కోడిగుడ్లను, రాత్రి భోజనం కోసం వంట చేసేందుకు సిద్ధం చేసుకున్న కాయగూరలను పరిశీలించి కుకింగ్ చేసే వంట మనిషితో, హెల్పర్లతో మాట్లాడారు. ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారని, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం విద్యార్థులకు సిద్ధం చేసి అందజేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే విద్యార్థులతో పాటు పాఠశాల ఆవరణ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అదేవిధంగా డైనింగ్ హాల్ లో ఉన్న స్టోర్ రూమ్, ఆర్.ఓ.ఆర్ ప్లాంట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో ఉన్న కాయగూరలు, ఉల్లిగడ్డ, నిల్వ ఉన్న పప్పు దినుసులు, బియ్యం,సబ్బులు, సరపు, షాంపులు, తదితర సామాగ్రిని ఎప్పుడు కొనుగోలుచేశారని, ఎంతకాలం నుంచి నిల్వ ఉంచుతారని క్యాటరింగ్ అసిస్టెంట్ మంగిలాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నిల్వ ఉన్న బెల్లం కుళ్ళి ఉండడాన్ని పరిశీలించి క్యాటరింగ్ అసిస్టెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేసి సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏకలవ్య పాఠశాలలో వాచ్మెన్ గా పనిచేస్తున్న సుజాత తన సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళింది.విధులు నిర్వహించాలంటే సెక్యూరిటీ రూమ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని సెక్యూరిటీ రూమ్ నిర్మించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.అదేవిధంగా పాఠశాలకు రావాలంటే విద్యార్థులు,ఉపాధ్యాయ సిబ్బంది సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, అంతర్గత రోడ్ల పరిస్థితి మరీ దారుణమని పలు సమస్యలు జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు పాల్గొన్నారు

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో మంత్రి తుమ్మల భేటీ

- డిల్లీలో కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి.
- సెప్టెంబర్ 7న ప్రతినిధుల బృందాన్ని కొత్తగూడెం పంపిస్తామని హామీ ఇచ్చిన రామ్మోహన్ నాయుడు
- భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఎయిర్ పోర్ట్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం నాడు డిల్లీలో రామ్మోహన్ నాయుడు ను ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల మర్యాదపూర్వకంగా కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు.కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే చేసినందుకు




రామ్మోహన్ నాయుడుకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.ఫీజుబులిటీ సర్వే లో ప్రతిపాదిత స్థలం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేశామని అక్కడ ఫీజుబులిటీ సర్వే నివేదిక సిద్ధమైందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు ఈ నెల 7 తేదీన ప్రతినిధుల బృందాన్ని కొత్తగూడెం పంపిస్తామని హామీ ఇచ్చారు రామ్మోహన్ నాయుడు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు.

### జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు

బీపీఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గా నిలిచింది.దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో ఏర్పాటు చేశాం.గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని రామ్మోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బిడ్డైన రామ్మోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**కామేపల్లి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామారావు ఆదేశించారు. మంగళవారం ఆయన ఆకస్మికంగా కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణాన్ని,రోగుల చికిత్సా విభాగాలను పరిశీలించి వైద్యులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.రోగులకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు.వారితో సంభాషించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అత్యవసర మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, పసిపిల్లలకు సకాలంలో రోగనిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు.అనంతరం కామేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్న సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత మహిళలను వేధిస్తున్న గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణకు 9 నుండి 14 ఏళ్ల వయస్సు గల బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవడం ఎంతో అవసరమని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డాక్టర్ శ్రీదేవి,సూపర్వైజర్లు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు,పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# ఐస్‌క్రీమ్ మార్కెట్‌లోకి రిలయన్స్..
# రూ.10 నుంచే లభ్యం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మరో కొత్త వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇప్పటికే శీతల పానీయాల విభాగంలో ఉనికి చాటుతున్న రిలయన్స్.. తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ ఐస్‌క్రీమ్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా 'బాంబే క్రీమరీ' బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.డెయిరీ క్రీమ్‌తో తయారుచేసిన ఐస్‌క్రీమ్‌లను ఈ బ్రాండ్ కింద విక్రయించనున్నట్లు రిలయన్స్ వెల్లడించింది. కోన్స్, కప్స్, టబ్స్, బార్స్, స్టిక్స్ రూపంలో వీటిని విక్రయిస్తామని తెలిపింది. వీటి ధరలు రూ.10 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. తొలుత పశ్చిమ రాష్ట్రాల్లో ఇవి అందుబాటులోకి వస్తాయని, క్రమంగా దేశవ్యాప్తంగా వినియోగదారులకు తేనున్నట్లు ప్రకటించింది. అందుబాటు ధరలో బాంబే క్రీమరీ ద్వారా అసలైన ఐస్‌క్రీమ్ రుచిని భారతీయులకు అందించడం తమ ముఖ్య ఉద్దేశమని రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ డైరెక్టర్ టి కృష్ణ కుమార్ తెలిపారు.

## నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్ సూచీలు..

దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి ముడిచమురు ధరల పెరుగుదల, బ్యాంక్, ఆటో షేర్లలో అమ్మకాలు వంటి కారణాలతో సూచీలు నష్టపోయాయి.క్రితం సెషన్‌లో 76,957 వద్ద సెన్సెక్స్ ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో 76,994 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,231 వరకు ఎగబాకింది. చివరకు 12 పాయింట్ల నష్టంతో 76,944.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24,055 వద్ద క్లోజ్ అయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి, 94.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సూచీలో ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ షేర్లు రాణించాయి. శ్రీరామ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, నెస్లే, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు నష్టపోయాయి.

# అయిష్టంగానే వచ్చి..అన్నీ తానై..

## 'యాపిల్'కు టాప్ గేర్.. టిమ్ కుక్ ప్రస్థానమిదీ!



**వాషింగ్టన్(జనంసాక్షి):**
హాయిగా సాగిపోతున్న ఉద్యోగం.. అప్పటికే దివాలా అంచున ఉన్న కంపెనీ నుంచి జాబ్ ఆఫర్. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాన్ని వదులుకునే సాహసం ఎవరూ చేయరు. కానీ, ఒక్క భేటీ ఆ ఉద్యోగి నిర్ణయాన్ని మార్చింది. తర్వాతి కాలంలో ఆయన్ను కంపెనీకి సీఈఓను చేసింది. కంపెనీని సైతం ప్రపంచంలోనే అత్యంత విలువైన వాటిల్లో ఒకటిగా నిలిపింది. ఆ ఉద్యోగే టిమ్ కుక్. ఆయనతో భేటీ అయిన వ్యక్తే యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్. యాపిల్‌కు సుదీర్ఘకాలం పాటు సీఈఓగా వ్యవహరిం చిన టిమ్ కుక్ ఆ బాధ్యతల నుంచి వైదొలిగిన వేళ.. ఆ సంస్థలోకి ఆయన రాక ఎలా సాగిందనేది చూద్దాం.అది 1998. టిమ్ కుక్.. కాం పాక్ అనే కంపెనీలో మంచి హోదాలో పనిచేస్తున్నారు. ఆ సమయంలో కాంపాక్ విలువ 30 బిలియన్ డాలర్లు. యాపిల్ కంపెనీ విలువ 3 బిలియన్ డాలర్లు మాత్రమే. పైగా దివాలా అంచున ఉంది. ఆ సమయంలో యాపిల్ నుంచి వచ్చిన జాబ్ ఆఫర్‌ను కుక్ తిరస్కరిం చారు. తాను పనిచేస్తున్న ఉద్యోగంలోనే తనకు ఆనం దం ఉందని తెగేసి చెప్పారు. 2014లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో టిమ్ కుక్ ఈ విషయాన్ని చెప్పుకొచ్చారు.

**ఆ ఒక్క భేటీ మార్చింది**

జాబ్ ఆఫర్‌ను తిరస్కరించినా యాపిల్ నుంచి కుక్‌కు కాల్స్ వస్తూనే ఉన్నాయి. స్టీవ్ జాబ్స్‌తో భేటీ అని చెప్పగానే టిమ్ కుక్ కూడా కాస్త మెత్తబడ్డారు. దీంతో ఆయనపై ఉన్న గౌరవంతో సమావేశానికి అంగీకరించారు. వాస్తవానికి యాపిల్‌లో చేరాలనే ఉద్దేశమేదీ అప్పటి వరకు టిమ్‌కుక్‌కు లేదు. భేటీ ప్రారంభమైన కాసేపటికే జాబ్స్ తన ఆలోచనలను కుక్‌తో పంచుకోవడం ప్రారంభించారు. కంపెనీని ఎలా ముందుకు నడిపించాలి? వినియోగదారులను ఎలా ఆకట్టుకోవాలి? అనే అంశాలపై మాట్లాడడం మొదలు పెట్టారు. జాబ్స్ విజన్ కుక్‌ను అమితంగా ఆకట్టుకుంది. దీంతో కాంపాక్‌ను వీడి యాపిల్‌లో చేరాలని కుక్ నిర్ణయించుకున్నారు. స్నేహితులు, సలహాదారులు వారించినా యాపిల్‌లో చేరేందుకే మొగ్గు చూపారు. అలా 1998లో యాపిల్‌లో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా చేరారు.

**3 దశాబ్దాల ప్రస్థానం.. 15 ఏళ్లుగా సీఈఓ**

యాపిల్‌లో టిమ్‌కుక్‌ది మూడు దశాబ్దాల ప్రస్థానం. వివిధ హోదాల్లో పనిచేశారు. 2011లో స్టీవ్ జాబ్స్ నుంచి నాయత్వ బాధ్యతలు చేపట్టారు. 15 ఏళ్లపాటు ఆ బాధ్యతల్లో కొనసాగారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. స్టీవ్ అప్పగించిన కంపెనీని అంతే బాధ్యతాయుతంగా ముందుకు నడిపించే వ్యక్తి కోసం ఏళ్ల పాటు అన్వేషించి.. టిమ్‌కుక్ తర్వాత ఆ బాధ్యతల్లో జాన్ టెర్నస్‌ను ఎంపిక చేశారు. కొత్త సీఈఓకు బాధ్యతలు అప్పగించి.. ఇకపై కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కుక్ కొనసాగనున్నారు.

**ఆవిష్కరణలు.. కొత్త పుంతలు**

టిమ్ కుక్ హయాంలో యాపిల్ కంపెనీ రికార్డు వృద్ధి సాధించింది. ఆయన బాధ్యతలు చేపట్టే నాటికి కంపెనీ విలువ దాదాపు 350 బిలియన్ డాలర్లు ఉండగా.. ఆయన నాయకత్వంలో ఏకంగా 4.5 ట్రిలియన్ డాలర్లను దాటింది. ఈ కాలంలో యాపిల్ షేర్లు 2,275 శాతం మేర పెరిగాయి. కేవలం ఉత్పత్తుల తయారీకే కాకుండా యాప్ స్టోర్, ఐక్లౌడ్, యాపిల్ మ్యూజిక్, యాపిల్ పే, యాపిల్ టీవీ+ వంటి సేవలపై టిమ్ కుక్ దృష్టిసారించారు.

2015లో ఈసీజీ, ఫాల్ డిటెక్షన్ ఫీచర్లతో విడుదలైన యాపిల్ వాచ్, 2016లో విడుదలైన ఎయిర్‌పాడ్స్ మార్కెట్లో సంచలనం సృష్టించాయి.ఇంటెల్ ప్రాసెసర్లపై ఆధారపడటం తగ్గించేసిన యాపిల్.. సొంతంగా ఓ-సిరీస్' (యాపిల్ సిలికాన్) చిప్‌లను తయారు చేయడం ప్రారంభించింది. ఇది టెక్ ప్రపంచంలో ఒక పెద్ద మైలురాయి.టిమ్ కుక్ హయాంలో వైఫల్యాలూ లేకపోలేదు. భారీగా పెట్టుబడులు పెట్టిన ఎలక్ట్రిక్ కార్ ప్రాజెక్ట్‌ను 2024లో రద్దు చేసింది. యాపిల్ నుంచి ఫోల్డబుల్ ఫోన్లు రాకపోవడం మరో వెలితి. కొత్త సీఈఓ చేతులమీదుగా ఫోల్డుబుల్ ఫోన్లు లాంచ్ అవుతాయని రూమర్లు వినిపిస్తున్నాయి.

## పదవి మారినా.. యాపిల్ సంస్థపై నాకున్న ప్రేమ ఎప్పటికీ తగ్గదు: టిమ్ కుక్

టెక్ దిగ్గజం యాపిల్‌లో కీలక నాయకత్వ మార్పు జరిగింది. 15 ఏళ్లుగా సంస్థ సీఈవోగా కొనసాగిన టిమ్ కుక్ ఆ పదవి నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో జాన్ టెర్నస్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2011 ఆగస్టులో సీఈవో బాధ్యతలు స్వీకరించిన కుక్.. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. "రేపటి నుంచి నా పదవి మారుతుంది, కానీ యాపిల్ సంస్థపై నాకున్న ప్రేమ ఎప్పటికీ మారదు. నిరంతరం నాకు స్ఫూర్తిగా నిలిచినందుకు అందరికీ ధన్యవాదాలు. తదుపరి నిర్వర్తించాల్సిన బాధ్యతలపై నేను ఎంతో ఉత్సాహంగా ఉన్నాను' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.సీఈవో పదవి నుంచి వైదొలిగినప్పటికీ.. కుక్ యాపిల్‌కు దూరం కావడం లేదు. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. సంస్థకు సంబంధించిన కీలక అంశాల్లో సహకరించనున్నారు. 2011లో సుమారు 350 బిలియన్ డాలర్లుగా ఉన్న యాపిల్ మార్కెట్ విలువ కుక్ సారథ్యంలో ప్రస్తుతం 4.5 ట్రిలియన్ డాలర్లకు చేరింది.నూతన సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన జాన్ టెర్నస్ 2001లో యాపిల్‌లో చేరారు. ఆయన ఇప్పటి వరకు హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్, ఎయిర్‌పాడ్స్ తదితర ఉత్పత్తుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. సెప్టెంబరు 9న జరగనున్న యాపిల్ కార్యక్రమంలో టెర్నస్ తొలిసారి సీఈవోగా వేదికపై కనిపించే అవకాశాలు ఉన్నాయి.

## యాపిల్ హవా.. బెస్ట్ సెల్లర్‌గా ఐఫోన్ 17

యాపిల్ ఫోన్లకు ఉన్న క్రేజే వేరు. ఇది మరోసారి రుజువైంది. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అమ్ముడైన ఫోన్‌గా ఐఫోన్ 17 నిలిచింది ఐఫోన్ 17 ప్రో మాక్స్, ఐఫోన్ 17 ప్రో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వెల్లడించింది. భారత్, జపాన్ మార్కెట్లలో యాపిల్ హవా ఎక్కువ ఉన్నట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా క్యూ2లో అత్యధికంగా విక్రయమైన స్మార్ట్‌ఫోన్లలో 6 శాతం మార్కెట్ వాటాతో ఐఫోన్ 17 అగ్రస్థానంలో నిలిచింది. ఐఫోన్ 17 ప్రో మాక్స్, ఐఫోన్17 ప్రో మోడళ్లు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రో వెర్షన్స్‌తో పోలిస్తే ఐఫోన్ 17 ధర కాస్త తక్కువగా ఉండటంతో.. యాపిల్ ప్రియులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా మారినట్లు కౌంటర్ పాయింట్ పేర్కొంది. టాప్ 10 స్మార్ట్‌ఫోన్లలో యాపిల్ ఫోన్లు ఉండగా.. శాంసంగ్ కూడా ఏమాత్రం తీసిపోకుండా టాప్-10లో మరో ఐదు స్థానాలను కైవసం చేసుకుంది. ఆండ్రాయిడ్ ఫోన్ల అమ్మకాల్లో గెలాక్సీ ఎస్ 26 అల్ట్రా అగ్రస్థానంలో నిలిచింది. టాప్-10 ఫోన్ల విక్రయాలన్నీ కలిపి ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన ఫోన్లలో 26 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

కళ్లన్నీ సెప్టెంబర్ 9 పైనే..

టెక్ ప్రియులు ఎంతగానో ఎదురు చూస్తున్న కొత్త ఐఫోన్ విడుదల తేదీని యాపిల్ ప్రకటించింది. 'సర్‌ప్రైజ్ అండ్ షైన్' అనే ట్యాగ్‌తో సెప్టెంబర్ 9న కొత్త ఐఫోన్ లాంచ్ చేయనున్నట్లు పేర్కొంది. ఇందులో ఐఫోన్ 18ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్, ఐఫోన్ ఫోల్డబుల్ ఉండనున్నట్లు సమాచారం. ఐఫోన్ 18 వచ్చే ఏడాది తీసుకొచ్చే అవకాశం ఉంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,62,946 (22 క్యారెట్లు) | ₹ 1,77,758 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,50,000

# భారత రక్షణ రంగం మరింత బలోపేతం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత రక్షణ ఉత్పత్తుల తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ టాటా గ్రూపు సంస్థ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) కీలక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ట్యాంకు నిరోధక 'జావెలిన్ ఆల్ అప్ రౌండ్' (ఏయూఆర్) క్షిపణి వ్యవస్థల ఉత్పత్తి కోసం అమెరికాకు చెందిన రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ భాగస్వామ్య సంస్థ జావెలిన్ జాయింట్ వెంచర్ (జేజేవీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా భారత్‌లోనే జావెలిన్ ఏయూఆర్ తుది అసెంబ్లీ, ఇంటిగ్రేషన్ ప్లాంట్‌తో పాటు విడిభాగాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పే ప్రణాళికలను రెండు సంస్థలూ సిద్ధం చేస్తున్నాయి.ఒప్పంద నిబంధనల ప్రకారం.. అమెరికాలోని లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన అలబామా (ట్రాయ్) ప్లాంట్‌లో సబ్-అసెంబ్లీ కిట్లు, రేథియాన్‌కు చెందిన అరిజోనా ప్లాంట్‌లో గైడెన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్లు తయారవుతాయి. అక్కడ ఉత్పత్తి చేసిన ప్రధాన విడిభాగాలను భారత్‌కు తరలించి, ఇక్కడి ప్లాంటులో తుది అసెంబ్లీ నిర్వహిస్తారు. ఈ విధానంతో అమెరికా ప్లాంట్లలో ఉద్యోగ భద్రత లభించడంతోపాటు, భారత్‌లో రక్షణ రంగానికి అవసరమైన ఉన్నతస్థాయి నైపుణ్యాభివృద్ధి, కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

## కీలక పాత్ర పోషించనున్న జావెలిన్ క్షిపణులు

భారత సైనిక దళాలకు ఆధునిక యుద్ధ పరికరాలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. భారీ పరిమాణంలో ఉమ్మడిగా ఉత్పత్తి చేపట్టడం వల్ల ఒక్కో క్షిపణి తయారీ వ్యయం గణనీయంగా తగ్గుతుంది.

**రూ.434.84 కోట్ల ఒప్పందంలో భాగంగా..**

అమెరికా విదేశాంగశాఖ గతంలోనే భారత్‌కు జావెలిన్ క్షిపణి విక్రయానికి అనుమతినిచ్చింది. ఫారిన్ మిలిటరీ సేల్స్ (ఎఫ్ఎమ్ఎస్) కింద రూ.434.84 కోట్ల (45.7 మిలియన్ డాలర్ల) అంచనా వ్యయంతో 100 ఎఫ్‌జీఎం-148 జావెలిన్ క్షిపణులు, ఒక ఫ్లై-టు-బై క్షిపణి, 25 తేలికపాటి కమాండ్ లాంచ్ యూనిట్లను కొనుగోలు చేయడానికి భారత్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ భాగస్వామ్యంపై లాక్‌హీడ్ మార్టిన్ జావెలిన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ రిచ్ లిక్కియాన్ మాట్లాడుతూ.. భారత్‌లో అసెంబ్లీ ప్లాంటు ఏర్పాటు సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. టీఏఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సుకరన్ సింగ్ మాట్లాడుతూ.. 'అమెరికా రక్షణ సంస్థలతో మా భాగస్వామ్యంలో ఇది మరో ముఖ్యమైన అడుగు.. నైపుణ్యాల మార్పిడి వల్ల భారత రక్షణ వ్యవస్థ బలోపేతం అవుతుంది' అన్నారు.

## భారత్ వృద్ధి భళా

**ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో 7.8%**

**అనిశ్చితులను తట్టుకొని అంచనాకు మించి నమోదు**

**ఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్- జూన్)లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనా వేసిన 7 శాతం కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగానూ భారత్ కొనసాగింది. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో భారత వృద్ధి 6.9 శాతంగా నమోదైంది. '2025-26 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.75.46 లక్షల కోట్లుగా ఉన్న వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (స్థిర ధరల వద్ద జీడీపీ), 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.81.36 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది 7.8 శాతం వృద్ధి రేటును సూచిస్తోంద'ని గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే అంతకుముందు త్రైమాసికమైన జనవరి- మార్చిలోని 8.6 శాతంతో పోలిస్తే ఏప్రిల్- జూన్‌లో నమోదైన వృద్ధి తక్కువే కావడం గమనార్హం. ఇక 2026-27 పూర్తి ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును 6.7 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్‌లో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీని రూ.88.27 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

## ఆగస్టులో జీఎస్టీ, యూపీఐ లావాదేవీలు భేష్




**ఢిల్లీ:** దేశంలో ఆర్థిక కార్యకలాపాలకు సూచికగా నిలిచే వస్తు, సేవల పన్ను, యూపీఐ లావాదేవీలు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఆగస్టు నెలలో ఈ రెండూ మెరుగైన వృద్ధిని సాధించాయి. గడిచిన నెలలో జీఎస్టీ వసూళ్లు మరోసారి రూ.2 లక్షల కోట్ల మార్కు దాటగా.. యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరువగా నమోదయ్యాయి.ఆగస్టు నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 14.8 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొంది. ఈ మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల నుంచి రూ.1.37 లక్షల కోట్లు రాగా.. దిగుమతుల ద్వారా రూ.62,604 కోట్లు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సెంట్రల్ జీఎస్టీ వసూళ్లు రూ.38,413 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ వసూళ్లు రూ.46,316 కోట్లుగా నిలిచాయి. సమీకృత జీఎస్టీ వసూళు రూ.1.15 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిఫండ్ల అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.1.68 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది.

**యూపీఐ లావాదేవీలు భళా**

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (ఙఖఎ) ద్వారా ఆగస్టు నెలలో రూ.29.8 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఔఖఅఎ) వెల్లడించింది. గతేడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.24.85 లక్షల కోట్లుగా ఉంది. అంటే 20 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే, జులై నెలల్లో రూ.29.9 లక్షల కోట్లు చొప్పున రికార్డు స్థాయిలో యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఆగస్టులోనూ రికార్డు స్థాయికి చేరువ కావడం గమనార్హం. సంఖ్యాపరంగా చూస్తే జులైలో 23.66 బిలియన్ లావాదేవీలు జరగ్గా.. ఆగస్టులో ఆ సంఖ్య పెరిగి 24.51 బిలియన్‌లకు చేరింది.

# రూ.1,27,500 కోట్లతో సెమీకాన్ 2.0

## నోటిఫై చేసిన కేంద్రం

ఢిల్లీ: రూ.1,27,500 కోట్లతో సెమీకాన్ 2.0 పథకాన్ని నోటిఫై చేస్తూ ప్రభుత్వం సోమవారం అమల్లోకి తెచ్చింది. చిప్ తయారీ నుంచి స్వదేశీ డిజైన్, ఐపీ పరికరాలు, మెటీరియల్స్, అధునాతన ప్యాకేజింగ్, ఆర్ అండ్ డీ, నైపుణ్యాభివృద్ధి వంటివి ఉండే ఫుల్-స్టాక్ ఎకోసిస్టమ్ వరకు మన దేశ సెమీ కండక్టర్ ఆశయాలను మరింత పెంపొందించడం దీని లక్ష్యంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్లు ఒక కీలకమైన వ్యూహాత్మక వనరుగా మారిన తరుణంలో ఈ అడుగులు పడ్డాయి.ఎందుకంటే: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో వస్తున్న విప్లవం అధునాతన చిప్‌లు, మెమొరీకి భారీ గిరాకీని సృష్టిస్తోంది. ఇదే సమయంలో సరఫరా చైన్‌లోని బలహీనతలపై పెరుగుతున్న ఆందోళనలు, మారుతున్న భౌగోళిక రాజకీయాలు, ప్రపంచ స్థాయి సంస్థలను తమ సెమీకండక్టర్ సామర్థ్యాలను విస్తరించుకోవడానికి, కేంద్రీకృత ఉత్పత్తి కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి పురికొల్పాయి. అందుకు తగ్గట్లుగా కేంద్ర మంత్రి వర్గం 2026 జులై 15న సెమీకాన్ 2.0 పథకానికి ఆమోదం తెలిపింది. రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమ మార్కెట్‌లో సుమారు 10 శాతం భారత్‌లో ఉంటుందని అంచనా వేస్తున్నట్లు కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 'సెమీకాన్ 2.0 ద్వారా సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసే తదుపరి దశకు వెళ్లడానికి సమయం ఆసన్నమైంది. స్వయం సమృద్ధి, ప్రపంచ వ్యాప్తంగా పోటీపడగల పరిశ్రమను ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమ'ని ఐటీ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వెల్లడించారు.

## ప్రతి మూడేళ్లకు రూ.లక్ష కోట్ల వ్యాపారం పెంచుతాం



హైదరాబాద్:బ్యాంక్ వ్యాపారాన్ని ప్రతి మూడేళ్లకు రూ.లక్ష కోట్ల మేర పెంచాలనే లక్ష్యంతో ఉన్నామని కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) బి.రమేశ్‌బాబు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 919 శాఖలుండగా, ఏడాది వ్యవధిలో 1,000 శాఖలు చేస్తామని.. ఇందులో తెలుగు రాష్ట్రాల్లోనే 35 వరకు కొత్తగా ప్రారంభిస్తామని 'ఈనాడు' ఇంటర్వ్యూలో చెప్పారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో శాఖను సోమవారం ప్రత్యక్షంగా ప్రారంభించిన ఆయన, దేశంలోని వివిధ ప్రాంతాల్లో మరో 15 శాఖలను దృశ్యమాధ్యమ పద్ధతిలో ఆవిష్కరించారు. అనంతరం బ్యాంక్ లక్ష్యాలను వివరించారు. ముఖ్యాంశాలివీ..సోమవారం 16 శాఖలు ప్రారంభించాం. ఇందులో తెలంగాణలో ఇంద్రేశం, గచ్చిబౌలి, కోకాపేట; ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ (రామవరప్పాడు), జగ్గయ్యపేట, సోంపేట, విశాఖ పట్నం (కం చరపాలెం), రాజమండ్రి (కొంత మూరు) ఉన్నాయి. ఇవికాక తమిళనాడులో 6, కర్ణాటకలో 1, దిల్లీలో 1 ప్రారంభిం చాం. వీటితో కలిపి మా శాఖల సంఖ్య 919కి చేరింది. ఏడాది వ్యవధిలో శాఖల సంఖ్యను 1,000కి చేరుస్తాం. వచ్చే ఏడాది కాలంలో మరో 30-35 శాఖలు తెలుగు రాష్ట్రాల్లో నెలకొల్పుతాం. తెలంగాణాలోని 33 జిల్లాల్లో 24 జిల్లాల్లోనే మా శాఖలున్నాయి. అందుకే తొలుత తెలుగు రాష్ట్రాల్లోనే విస్తరణకు చోటుంది. మా లావాదేవీల్లో 98% డిజిటల్‌గా జరుగుతున్నా, శాఖల్లో కార్యకలాపాలు సాగించడం సౌలభ్యంగా భావించే వారి కోసం, వారితో అనుబంధాన్ని బలోపేతం చేసేందుకే శాఖలు ఏర్పాటు చేస్తున్నాం. రిటెయిల్ ఖాతాదార్లతో పాటు ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ రంగాలకు సేవలు అందించడంపైనే దృష్టి సారించాం. రుణాల జారీలో అత్యంత అప్రమత్తంగా ఉండటం వల్లే ఏప్రిల్-జూన్‌లో నికర నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.19 శాతానికి పరిమితం అయ్యాయి. సిబిల్ స్కోర్‌తో పాటు40, 45 సోర్సెస్ నుంచి సమాచారం సేకరిస్తున్నాం. కృత్రిమమేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) సాంకేతికతనూ వాడుతున్నాం. ఇన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్లే ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.250 కోట్లు ఉండే నికరలాభం రూ.2,500 కోట్లు మించింది. 2026 జూన్ 30 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.2,27,267 కోట్లకు చేరింది. ఇందులో డిపాజిట్లు రూ.1,22,587 కోట్లు, రుణాలు రూ.1,04,680 కోట్లు ఉన్నాయి. 110 ఏళ్ల చరిత్రలో, కొవిడ్ సమయంలో మినహా ప్రతీ ఏటా వాటాదార్లకు డివిడెండ్ ఇచ్చాం. వ్యాపారం పెంచుకోవడం, ఆస్తుల నాణ్యత అత్యుత్తమంగా ఉండేలా చూడటం, ఖాతాదారుకు మెరుగైన అనుభవం కల్పించడమే మా ధ్యేయం. మా బ్యాంక్ పనితీరుపై విశ్వాసం పెరగడం వల్లే దేశంలోని పెద్ద మ్యూచువల్‌ఫండ్ సంస్థలైన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్‌లు 9.9% వరకు వాటాలు కొనేందుకు రిజర్వ్ బ్యాంక్ వద్ద అనుమతులు తీసుకున్నాయి. రిటర్న్ ఆన్ అసెట్స్(ఆర్ఓఏ) 2.11%, రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్ఓఈ) కనీసం 15% ఉండటం ఇందుకు నేపథ్యం. కార్పొరేట్ రుణాల వాటా 45% నుంచి 15% శాతానికి తగ్గితే, ఎంఎస్ఎంఈ - రిటెయిల్- వ్యవసాయ రుణాల వాటా 85 శాతానికి చేరింది. అంకుర సంస్థల ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా, రుణాలు మంజూరు చేసేందుకు బెంగళూరులో సంప్రదింపులు సాగిస్తున్నాం. సరికొత్త పథకాలు తెస్తాం.

**వ్యవసాయ రుణాల్లో 90% బంగారంపైనే**

వ్యవసాయ రుణాల్లో 90% బంగారు ఆభరణాల తనఖాపైనే ఉంటున్నాయి. ఒక్కోశాఖలో రోజుకు 20-25 కూడా ఇలాంటివి మంజూరు చేస్తుంటారు.

### సుభాష్‌చంద్ర వ్యవహారం..

## రూ.6.25 కోట్ల చెల్లింపు ఆదేశాలు నిలిపివేత

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్‌చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియపై వివాదం కొనసాగుతోంది. రూ.22,006 కోట్ల క్లెయిమ్‌నకు గానూ రూ.6.25 కోట్లు మాత్రమే చెల్లించేందుకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ అనుమతించడంపై రుణాలు ఇచ్చిన బ్యాంకులు ఆగ్రహంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. చెల్లింపు విషయంలో ద్విసభ్య బెంచ్ ఇచ్చిన తీర్పును ఐదుగురు సభ్యులతో కూడిన ఎన్‌సీఎల్‌టీ ధర్మాసనం నిలిపివేసింది.సుభాష్ చంద్రపై దాఖలైన వ్యక్తిగత దివాలా ప్రక్రియలో భాగంగా క్రెడిటర్లంతా కలిసి రూ.22,006.57 కోట్లు క్లెయిమ్ చేయగా.. కేవలం రూ.6.25 కోట్లు చెల్లించే పరిష్కార ప్రణాళికకు ఇటీవల ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికకు 80.81 శాతం క్రెడిటర్ల నుంచి ఆమోదం లభించడం గమనార్హం. ఈ కేసు విషయంలో డివిజన్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు భిన్నాభిప్రాయాలతో వేర్వేరు తీర్పులు ఇవ్వడంతో మూడో సభ్యుడిని నియమించగా.. కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే ప్రణాళికకే ఆయన ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే, ఇందులో సుభాష్ చంద్ర కుటుంబంతో సంబంధం ఉన్న 5 సంస్థలు రుణదాతల కమిటీలో 61.78 శాతం ఓటింగ్ వాటాను కలిగి ఉన్నాయని, ఈ ప్రణాళిక ఆమోదించడంలో కీలక పాత్ర పోషించాయని బ్యాంకులు ఆరోపిస్తున్నాయి.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 02 సెప్టెంబర్ 2026

## బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం మహిళలు బోనాలతో బారులు తీరారు. మట్టి కుండలో నైవేద్యం వండి బోనాన్ని అలంకరింప చేసి దప్పు చప్పుల మధ్య నృత్యాలు చేసుకుంటూ భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయం ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏఈఓ నాగుల మహేష్ పర్యవేక్షణలో, సూపరిండెంట్ వెంకటలక్ష్మి,ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి ఓడి బియ్యం, బెల్లపు సాక తదితర మొక్కులు చెల్లించుకున్నారు.

## ఆక్స్‌ఫర్డ్ బెస్ట్ టీచర్ అవార్డుకు పారమిత ఉపాధ్యాయుడు

- గణితశాస్త్ర విభాగంలో జాతీయ ఫైనలిస్ట్‌గా లలిత్ మోహన్ సాహు
- పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) : స్థానిక నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ స్కూల్ సీనియర్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు, ప్రాజెక్ట్ హెడ్ లలిత్ మోహన్ సాహు ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ ఇండియాస్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ 2026 కు గణితశాస్త్ర విభాగంలో జాతీయ ఫైనలిస్ట్‌గా ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా వచ్చిన వేలాది దరఖాస్తుల్లో ఆయన ప్రతిభను గుర్తించిన అవార్డు నిర్వాహకులు జాతీయ స్థాయిలో టాప్ 10 ఉపాధ్యాయుల్లో ఒకరిగా ఎంపిక చేశారు. తెలంగాణ నుంచి గణితశాస్త్ర విభాగంలో జాతీయ ఫైనల్స్‌కు ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడిగా ఆయన నిలిచారు. ఢిల్లీ - ఎన్‌సీఆర్‌లోని శివ్ నాదర్ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 4న నిర్వహించనున్న జాతీయ ఫైనల్స్‌లో సాహు పాల్గొననున్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ జ్యూరీ ముందు తన వినూత్న బోధనా విధానం 'రిథమిక్ స్టెమ్' ను ప్రదర్శించనున్నారు. ఫైనల్స్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచే విజేతలకు యూకేలోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వారం రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్ కు పూర్తి నిధులతో కూడిన స్కాలర్‌షిప్ అందించనున్నారు. గణితం, విజ్ఞానశాస్త్రం, సంగీతాన్ని సమన్వయం చేస్తూ సాహు రూపొందించిన "రిథమిక్ స్టెమ్" విధానం ద్వారా క్లిష్టమైన అంశాలను విద్యార్థులకు సులభంగా, ఆసక్తికరంగా, గుర్తుండిపోయేలా బోధిస్తున్నారు. ప్రాజెక్ట్ ఆధారిత అభ్యసనాన్ని అమలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనల్లో విద్యార్థులు తమ స్టెమ్ ప్రాజెక్టులను ప్రదర్శించేలా మార్గదర్శకత్వం అందిస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. లలిత్ మోహన్ సాహు సాధించిన ఈ ఘనతపై పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, వినోద్ రావు, వి.యు.ఎమ్. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, బాలాజీ లు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నిందితునికి పదేళ్ల జైలుశిక్ష

నిజామాబాదు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31 (జనంసాక్షి) : ఆగ్రహానికి గురైన మహిళ తన కొడుకు, తమ్ముడితో కలిసి ఒక వ్యక్తిని కొట్టి అతని మృతికి కారణమైన ఘటనలో నిందితులకు నిజామాబాద్ కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా సాప్లీ గ్రామానికి చెందిన బింగేవార్ రాజమని, తన కొడుకు బింగేవార్ రాజు, తమ్ముడు అగపతే మాధవ్‌తో కలిసి బతుకుదెరువు కోసం నిజామాబాద్ నగరం అర్సపల్లికి వలస వచ్చి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన చందే తారాబాయితో రాజమణి సన్నిహితంగా ఉండేది. అయితే, తారాబాయ్ కొడుకు చందే మాధవ్ 2022 ఏప్రిల్ 26న తన తల్లికి రాజమణిపై చెడు అభిప్రాయం కలిగేలా తప్పుడు మాటలు చెప్పాడని, దీన్ని కొంచెం దగ్గర నుండి విన్న రాజమని అతన్ని బెదిరించింది. మరుసటి రోజు (2022 ఏప్రిల్ 27న) ఉదయం 7 గంటలకు అర్సపల్లి కమాన్ దగ్గర టిఫిన్ చేయడానికి వెళ్లిన చందే మాధవ్‌పై రాజమని, ఆమె కొడుకు రాజు, తమ్ముడు మాధవ్‌లు విచక్షణారహితంగా దాడి చేశారు. చేతులతో కొడుతూ, కాళ్లతో తన్నుతూ కింద పడేసి అతని పురుషాంగంపై తన్ని తీవ్రంగా గాయపరిచారు. చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. ఈ కేసును విచారించిన నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి హరీష్ సోమవారం తీర్పు వెలువరించారు. నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు పది వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చారు.

## రూ.603 కోట్లతో మహబూబ్‌నగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి భూమిపూజ


- రాబోయే 3 ఏళ్లలో పూర్తి చేస్తాం
- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




మహబూబ్‌నగర్ బ్యూరో సెప్టెంబర్ 01( జనం సాక్షి): మహబూబ్‌నగర్ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 603 కోట్ల వ్యయంతో నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నేడు భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో నగరమంతా యూజీడీ పూర్తి చేయడమే లక్ష్యంగా విడతల వారీగా నిర్మాణ పనులు చేపడతామన్నారు. మురుగునీటిని నేరుగా బయటకు వదలకుండా శుద్ధి చేసి మాత్రమే విడుదల చేసేలా మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) ఏర్పాటు చేస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మహబూబ్‌నగర్‌కు 14 వాటర్ రిజర్వాయర్ల నిర్మాణానికి అనుమతి లభించిందని, ఇప్పటికే 11 రిజర్వాయర్లకు శంకుస్థాపన పూర్తయిందని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 20 మిలియన్ లీటర్ల సామర్థ్యానికి అదనంగా 18 మిలియన్ లీటర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు చెప్పారు. అలాగే ముడా నిధులతో రూ. 1.50 కోట్లతో ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నగర అభివృద్ధి అంటే కేవలం మౌలిక వసతులు కాదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తు కోసం ఈరోజే బలమైన పునాది వేయాల్సిన అవసరం ఉందని అన్నారు. బలహీన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తామని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచే శిక్షణా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. గత ఏడాది 35 మంది వాలంటీర్లతో 30 పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించగా, ఈ ఏడాది 100 మంది విద్యా వాలంటీర్లతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమన్వయంతో మంచి ఫలితాలు వస్తున్నాయని, విద్యా కార్యక్రమాలను మరిన్ని పాఠశాలలకు విస్తరిస్తామని చెప్పారు. ప్రజల ఆశీర్వాదం, మేధావులు, జర్నలిస్టులు, మిత్రుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని, మహబూబ్‌నగర్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని, ప్రజల సహకారం, సూచనలు, ఆశీస్సులతో అభివృద్ధి యజ్ఞాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# అర్వింద్‌కు అసమ్మతి సెగ

- అంతర్గత సమావేశాలపై జిల్లాలో జోరుగా చర్చ
- బండి సంజయ్, కిషన్ రెడ్డి పేర్లు వినిపించడంపై ఆసక్తి



జగిత్యాల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : జగిత్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీలో చోటుచేసుకుంటున్న అంతర్గత పరిణామాలు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవిందుకు వ్యతిరేకంగా బీజేపీకి చెందిన కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు ఇటీవల అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది. గత రెండు మూడు రోజులుగా జరిగిన ఈ సమావేశాలపై పార్టీ శ్రేణుల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. ఎంపీ అరవింద్‌కు వ్యతిరేకంగా కొందరు నాయకులు ఒక వర్గంగా సమీకృతమవుతున్నారనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. ఈ పరిణామాల వెనుక బీజేపీలోని కొందరు సీనియర్ నాయకుల ప్రమేయం ఉందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి పేర్లు ఈ చర్చలో వినిపిస్తున్నాయి.

అయితే ఈ ప్రచారాన్ని ధృవీకరించేలా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అలాగే సమావేశాల్లో ఏ అంశాలపై చర్చించారు? ఎంపీ అరవింద్‌పై నాయకుల అసంతృప్తికి కారణాలేమిటి? భవిష్యత్తులో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే దానిపై ఏమైనా నిర్ణయం తీసుకున్నారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ద్వితీయ శ్రేణి నాయకుల వెనుక బండి సంజయ్, కిషన్ రెడ్డి మద్దతు ఉందని వ్యతిరేక వర్గానికి చెందిన కొందరు నాయకులు చెప్పుకుంటున్నారనే ప్రచారం కూడా జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే దీనిపై సంబంధిత కేంద్ర మంత్రుల నుంచి గానీ, పార్టీ అధిష్ఠానం నుంచి గానీ ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

పార్టీలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలతో సాధారణ కార్యకర్తల్లో కొంత అయోమయ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు పార్టీపై ప్రభావం చూపకుండా అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

మరోవైపు, ఇటీవల జరిగిన సమావేశాలు కేవలం స్థానిక రాజకీయ అంశాలపై జరిగినవేనా? లేక ఎంపీ అరవింద్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న రాజకీయ సమీకరణాల్లో భాగమా? అనేది రానున్న రోజుల్లో స్పష్టత రావాల్సి ఉంది. అప్పటివరకు ఈ పరిణామాలు జగిత్యాల జిల్లా బీజేపీలో రాజకీయ చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### నేడు 500 కార్లతో రాష్ట్ర నాయకత్వం వద్దకు?

జగిత్యాల జిల్లాలో కొంతకాలంగా కొనసాగుతున్న పార్టీ అంతర్గత వ్యవహారం ఇప్పుడు బీజేపీ రాష్ట్ర నాయకత్వం వద్దకు చేరే పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ , జిల్లా నాయకుడు ముదుగంటి రవీందర్ రెడ్డి , మాజీ జిల్లా అధ్యక్షుడు మోరెపల్లి సత్యనారాయణపై ఇప్పటికే రాష్ట్ర నాయకత్వానికి పలుమార్లు అధికారికంగా ఫిర్యాదులు వెళ్లినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జగిత్యాల నియోజకవర్గ నాయకురాలు భోగ శ్రావణి ఇంటిపై దాడి ఘటన, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురికి వ్యతిరేకంగా నిర్వహించినట్లు చెబుతున్న మీడియా సమావేశాలు, అలాగే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్తో మోరెపల్లి సత్యనారాయణకు ఉన్న సన్నిహిత సంబంధాలు, కాంగ్రెస్ పార్టీకి సహకరిస్తున్నారనే ఆరోపణలు ప్రధానంగా రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లిన అంశాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇన్ని ఫిర్యాదులు వెళ్లినప్పటికీ ఇప్పటివరకు రాష్ట్ర నాయకత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన చర్యలు లేకపోవడంపై పార్టీ కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సమాచారం. మరోవైపు తమ కార్యక్రమాల వెనక కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉన్నారని సురభి నవీన్ పార్టీ శ్రేణులకు, స్థానిక మీడియాకి బహిరంగంగా వివరించడం మరింత చర్చకు దారి తీసింది. దీంతో ఇక రాష్ట్ర నాయకత్వానికి తమ అసంతృప్తిని నేరుగా తెలియజేయాలని నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ శ్రేణులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. రేపు సుమారు 500 కార్లతో రాష్ట్ర నాయకత్వాన్ని కలిసి, ఇప్పటికే చేసిన ఫిర్యాదులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అంటూ అడిగేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల కంటే పార్టీ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకే ప్రాధాన్యత ఇస్తే క్షేత్రస్థాయిలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదులపై రాష్ట్ర నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? 500 కార్లతో జరగనున్న ఈ కార్యక్రమం తర్వాత బీజేపీలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి? అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి

- సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటించిన ఉద్యోగులు




కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : భద్రత, భరోసా లేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కరీంనగర్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారని తెలిపారు. భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వానికి తమ ఆవేదనను తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెన్షన్ అనేది బిక్ష కాదు, ఎవరి దయాదాక్షిణ్యం కాదు, ఎక్స్‌గ్రేషియా కాదు అది ఉద్యోగి హక్కు అని స్పష్టం చేశారు. ఉద్యోగి పదవీ విరమణ అనంతరం సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడంలో పెన్షన్ కీలకమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. 2004కు ముందు ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి ప్రభుత్వ భరోసాతో పెన్షన్ అందుతుండగా, 2004 తర్వాత చేరిన ఉద్యోగుల భవిష్యత్తును మార్కెట్ పరిస్థితుల పై ఆధారపడే విధంగా చేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని విమర్శించారు. ఉద్యోగుల భవిష్యత్తును షేర్ మార్కెట్ హెచ్చుతగ్గులకు వదిలివేయడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం గతంలో పెన్షన్‌ను ఉద్యోగి హక్కుగా గుర్తించిందని గుర్తుచేశారు. "మా సహనాన్ని చేతగానితనంగా భావించవద్దు. ఉద్యమాలు మాకు కొత్త కాదు" అని వారు స్పష్టం చేశారు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఉద్యమాలు మరింత ఉధృతం కావచ్చని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ జనరల్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్ రెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకులు కేశవరెడ్డి, ఎలదాసరి లింగయ్య, మోసం అంజయ్య, జాలి మహేందర్ రెడ్డి, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్ రావు, రామస్వామి, శంకర్, మహిళా చైర్మన్ శారద, సునీత, సరిత, హరిప్రియ,సూర్య, సుమలత, సుస్మిత, వైద్యుల రాజి రెడ్డి, తుముల తిరుపతి, రోహిత్, నాగరాజు,జాడ కమలాకర్, నిసార్ అహ్మద్, కరుణాకర్, అజ్గార్ అలీ, లవ కుమార్, గుండ రాజేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ పైన కక్షపూరిత ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

- డీసీసీ అధ్యక్షులు నాగేష్ రెడ్డి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : రాహుల్ గాంధీ మీద కక్షపూరితంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని ఇందుకు కారణంగా ఏఐసీసీ,పీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిజామాబాద్ డీసీసీ అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి మాట్లాడుతు రాహుల్ గాంధీ మీద నిరాధార ఆరోపణలు చేస్తూ, ఒక దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే వెళ్లిన స్థలంను శుభ్రం చేసి అవమానించిన బీజేపీ,దాని అనుబంధ సంస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రాహుల్ గాంధీ పై ఇలా కేసులు పెట్టి వేదించడం అన్యాయం అని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ,రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్ ,పలు డివిజన్ల కార్పొరేటర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఎన్,యూత్ కాంగ్రెస్, సేవాదళ్, ఫిషరీస్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అర్బన్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు, మాజీ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్ గారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ ప్రయాణికులకు తప్పని తిప్పలు

- బస్ సెల్టార్ లేక అవస్థలు పడుతున్న గ్రామస్తులు



చిగురుమామిడి సెప్టెంబర్ 1 (జనంసాక్షి): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సరైన బస్సెల్టార్ లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామం మీదుగా ప్రతిరోజూ వివిధ ప్రాంతాలకు బస్సులు, వాహనాలు వెళ్తున్నప్పటికీ ప్రయాణికులు వేచి ఉండటానికి నిర్దిష్టమైన బస్ షెల్టర్ లేకపోవడమే ఈ సమస్యకు కారణం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నిలబడటానికి నీడ లేక,వర్షాకాలంలో తడిసి ముద్దవుతూ రోడ్డు పక్కనే గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కొండాపూర్ గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్ షెల్టర్ నిర్మించాలని, అలాగే గ్రామంలో స్టేజి వద్ద ఎక్స్ప్రెస్ ఆపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మానకొండూర్‌లో సమస్యలకు చరమగీతం పాడుతాం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి
- సెప్టెంబర్ 17 నుంచి తీన్మార్ మల్లన్న టీఆర్పీ పాదయాత్ర
- బీసీల రాజ్యాధికారమే టీఆర్పీ లక్ష్యమని అఖిల్ పాషా చూచన




మానకొండూర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : తెలంగాణ రాజ్యాధికార పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం మానకొండూర్ మండల కేంద్రంలోని శ్రీ పద్మావతి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా పాల్గొని నూతన సభ్యులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణ పై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, వాసాల భానుచెందర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు దశాబ్దాలుగా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తమ జనాభాకు తగిన స్థాయిలో ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారని అన్నారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాల్లో సముచిత న్యాయం జరగాలని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఆత్మగౌరవం, హక్కులు మరియు రాజకీయ అధికార సాధన తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యాల్లో భాగమని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరిగినప్పుడే వారి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని అన్నారు. ప్రజల ఆశయాల సాధన కోసం తీన్మార్ మల్లన్నగారు ఏర్పాటు చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ సెప్టెంబర్ 17 నాటికి ఏడాది పూర్తవుతుందన్న సందర్భంగా పాదయాత్ర ప్రారంభిస్తున్నామని తెలిపారు. పార్టీ ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే ప్రజలకు చేరువై, అనేక ప్రజా సమస్యలపై పోరాటాలకు బిందువుగా మారిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పార్టీ నాయకత్వంతో కలిసి, తీన్మార్ మల్లన్న చేపట్టనున్న పాదయాత్రపై మానకొండూర్ నియోజకవర్గ నాయకులతో సుదీర్ఘంగా చర్చించి పలు కీలక ఆదేశాలు జారీచేశారు. పాదయాత్రలో మల్లన్నతో కలిసి నడవడానికి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున రావాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, మండలాల అధ్యక్షులు శివరాత్రి మోహన్, అమ్మిగళ్ల కుమార్, నాయకులు వాసాల భాను చెందర్, దురుశెట్టి చెందు, గుండోజు సాధనందం, నెరేళ్ల శ్రీకాంత్, గుండోజు పద్మ, మావురపు కనకయ్య, వెంకట్ గౌడ్, కమటం రాజేష్, నూతన సభ్యులు యాసాలా శ్రీనివాస్, దాసరి రమేష్, వంశీకృష్ణ, నాగరాజు, ప్రవీణ్, సాయి కృష్ణ, పర్శారాము, రమేష్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టులో భక్తుల రద్దీ


- పారిశుధ్య నిర్వహణ లోపం



మల్యాల సెప్టెంబర్ 1 (జనం సాక్షి) : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రావణమాసం స్వామివారి పర్వదినమైన మంగళవారం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పవిత్రమైన పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ఈ అపరిశుభ్ర వాతావరణం,తడి నేలల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు,భక్తుల రద్దీకి తగ్గట్టుగా పారిశుధ్య నిర్వహణ లేకపోవడం వల్ల సమస్య తలెత్తుతోంది. భక్తులు సమర్పించిన కొబ్బరి బోండాల పెంకులు,ఖాళీ ప్లాస్టిక్ కవర్లు,ఇతర పూజా వ్యర్థాలు పేరుకుపోయాయి. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దైవ దర్శనానికి వచ్చినప్పుడు ఆలయ పరిసరాల్లో కూర్చోవడానికి భక్తులు ఇష్టపడతారు కానీ పరిసరాలంతా అపరిశుభ్రంగా తడిసిపోయి ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



## 2024లోనే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్



ఫైనాన్స్ (హెచ్ఆర్ఎం-VII) శాఖ జీవో నంబర్ 107ను 2024 సెప్టెంబర్ 25న జారీ చేసింది. ఐఎంఎస్, ఈఎస్ఐ హైదరాబాద్ పరిధిలోని ఖాళీ పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మొత్తం 600 పోస్టుల్లో 124 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 7 డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు, 99 ఫార్మసిస్టులు, 54 నర్స్ మిడ్‌వైఫ్‌లు, 5 రేడియోగ్రాఫర్లు, 3 డెంటల్ టెక్నీషియన్లు, ఒక డెంటల్ హైజీనిస్ట్, ఒక ఆడియోమెట్రిక్ టెక్నీషియన్, 272 స్టాఫ్‌నర్స్ పోస్టులు ఉన్నాయి.

### జీవో ఉంది.. అనుమతి ఉంది.. అయినా


# ఉద్యోగాలు లేవు!

### ఈఎస్ఐ-ఐఎంఎస్‌లో 600 పోస్టులు ఎక్కడ?

### రెండేళ్లుగా రిక్రూట్‌మెంట్‌పై మీనమేషాలు

- 124 మంది డాక్టర్ల పోస్టుల భర్తీపై మౌనం ఎందుకు?
- 272 స్టాఫ్‌నర్స్ పోస్టులతో చేతులు దులుపుకున్నారా?
- ఆర్టీఐకి 'అంతర్గత వ్యవహారం' అంటూ తప్పించుకున్న బోర్డు

**నాచారం సెప్టెంబరు 1 (జనం సాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత.. మరోవైపు టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బంది కొరత.. మందులు, మౌలిక వసతుల సమస్యలు.. ఇవన్నీ ప్రజారోగ్య వ్యవస్థను వెంటాడుతున్నా ఖాళీల భర్తీ మాత్రం ముందుకు సాగడం లేదు. ఈఎస్ఐ, ఐఎంఎస్ పరిధిలో సుమారు 600 పోస్టుల భర్తీకి ప్రభుత్వం రెండేళ్ల క్రితమే అనుమతించినప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయి నియామకాలు జరగకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



Annexure
[to G.O.Ms.No.107, Finance (HRM.VII) Department, dated:25.09.2024]

| S.No. | Name of the post | Number of posts |
|---|---|---|
| 1 | Civil Assistant Surgeon | 124 |
| 2 | Dental Assistant Surgeon | 7 |
| 3 | Staff Nurse | 272 |
| 4 | Pharmacist Gr-II | 99 |
| 5 | Lab Technician Gr-II | 34 |
| 6 | Auxilary Nurse Mid-wife | 54 |
| 7 | Radiographer | 5 |
| 8 | Dental Hygienist | 1 |
| 9 | Audiometric Technician | 1 |
| 10 | Dental Technician | 3 |
| | Total: | 600 |

SECTION OFFICER

#### ఆదేశాలు ఇచ్చినా అమలు ఏది?


ఖాళీల వివరాలు, స్థానిక క్యాడర్, రోస్టర్ పాయింట్లు, విద్యార్హతలు తదితర సమాచారాన్ని సంబంధిత శాఖ నుంచి తీసుకుని రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్, షెడ్యూల్‌ను సకాలంలో విడుదల చేయాలని కూడా ఆదేశించింది. అయినా 2024 నుంచి 2026 వరకు మిగిలిన పోస్టులపై ఎలాంటి స్పష్టమైన పురోగతి లేకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

#### డాక్టర్ల కొరతతో రోగుల అవస్థలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడం తో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. శస్త్రచికిత్సలు, వివిధ వైద్య పరీక్షలు, చికిత్సల విషయంలో సిబ్బంది కొరత ప్రభావం చూపుతోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 124 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదన్నది కీలక ప్రశ్నగా మారింది.

#### 272 పోస్టులకే పరిమితమైన భర్తీ

600 పోస్టుల్లో ఈ ఏడాది 272 స్టాఫ్‌నర్స్ పోస్టులను మాత్రమే భర్తీ చేసినట్లు సమాచారం. మిగిలిన 328 పోస్టులు ఇంకా భర్తీ కాకపోవడంతో ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత కొనసాగుతోంది. ఖాళీలు భర్తీ కాకపోవడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిపై అదనపు పని భారం పడుతోందని, ప్రమోషన్ల విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Public Services - Labour Employment Training & Factories Department - Recruitment - Filling up of six hundred (600) various categories of vacant posts under the administrative control of Director, Insurance Medical Services, Hyderabad by way of Direct Recruitment through Medical and Health Services Recruitment Board, Telangana, Hyderabad - Orders - Issued.

FINANCE (HRM.VII) DEPARTMENT

G.O.Ms.No.107 Dated:25th September, 2024
Read the following:-

1. G.O.Ms.No.275, Finance & Planning (FW.SMPC) Department, dated:14.12.1995.
2. Labour Employment Training & Factories (OP.IMS) Department U.O.No.LETF-OPIM/A2/109/2024 dated 13/09/2024.

&&&

ORDER:

Government have reviewed the status of direct recruitment vacancies in various categories under Labour Employment Training & Factories Department.

2. After due examination of the proposals furnished by the Labour, Employment Training & Factories Department in this regard, the actual requirement of personnel with reference to the activities and needs of the Department and the overall financial implication, Government hereby accord permission for filling-up of six hundred (600) various categories of vacant posts as shown in the Annexure, appended to this order under the administrative control of Director, Insurance Medical Services, Hyderabad by way of Direct Recruitment through Medical and Health Services Recruitment Board, Telangana, Hyderabad.

3. The Medical and Health Services Recruitment Board, Telangana, Hyderabad, , shall take the necessary steps for direct recruitment to the vacant posts permitted to be filled up in this order, by obtaining the requisite details, such as local cadre-wise vacancy position, roster points, qualifications, etc., from the concerned Principal Secretary to Government, Labour, Employment Training & Factories Department.

4. The Medical and Health Services Recruitment Board, Telangana, Hyderabad, shall issue Notification and Schedule for recruitment, expeditiously.

1

5. The Principal Secretary to Government, Labour, Employment Training & Factories Department and the Director of Insurance Medical Services, Hyderabad shall furnish the details of all vacant posts permitted to be filled up in this order, including the local cadre wise distribution, roster points, qualifications, etc., to the Medical and Health Services Recruitment Board, Telangana, Hyderabad, under intimation to the Finance Department, immediately.

6. The provisions as to the recruitment agency, if any specified in the special rules, may be suitably amended by the administrative department in accordance with this order, wherever necessary.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
SANDEEP KUMAR SULTANIA
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To,
The Member Secretary,
Medical and Health Services Recruitment Board, Telangana, Hyderabad.
The Director,
Insurance Medical Services, Hyderabad.

Copy to:
The Principal Secretary to Hon'ble Chief Minister, Telangana, Hyderabad.

#### ఆర్టీఐకి బోర్డు సమాధానం ఏమిటి?

600 పోస్టుల భర్తీపై ఓ వైద్యుడు సమాచార హక్కు చట్టం కింద ఎంహెచ్ఎస్ఆర్‌బీని వివరాలు కోరినట్లు తెలిసింది. ముఖ్యంగా 124 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ ఎందుకు జరగడం లేదని, ఇతర పోస్టులపై ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దీనికి 'అంతర్గత వ్యవహారాలు', 'పరిపాలన కు సంబంధం లేదు', 'ఇప్పటివరకు పరిశీలించ లేదు' అన్న రీతిలో సమాధానం వచ్చినట్లు సమాచారం. దీంతో బోర్డు పనితీరుపై ప్రశ్నలు మరింత తీవ్రమయ్యాయి.

#### అసలు ఆలస్యం ఎక్కడ?

ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు ఇప్పటికే గుర్తించిన ఖాళీలను భర్తీ చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. జీవో జారీ చేసింది ప్రభుత్వం.. నియామక ప్రక్రియ చేపట్టాల్సింది రిక్రూట్‌మెంట్ బోర్డు.. మరి రెండేళ్లుగా ఈ ప్రక్రియ ఎందుకు నిలిచిపోయింది? అన్నదే ఇప్పుడు వైద్యులు, సిబ్బంది, రోగుల నుంచి వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న. ఇప్పటికైనా ఆరోగ్యశాఖ, ఎంహెచ్ఎస్ ఆర్‌బీ పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించి, మిగిలిన పోస్టులకు వెంటనే నోటిఫికేషన్లు జారీ చేసి నియామక ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఖాళీలు భర్తీ అయితేనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడి, నిరుపేద రోగులకు నాణ్యమైన వైద్యం అందే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

- ఈనెల 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిరసన
- బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్



**బోధన్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతామని అందులో భాగంగా ఈ నెల 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు బోధన్ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ స్పష్టం చేశారు. మంగళవారం బోధన్ లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వేయి రోజుల ప్రజాపాలనలో అబద్ధపు హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులకే ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఈ ప్రభుత్వ హయాంలో చేసిన పనులు ఏమీ లేవన్నారు. బోధన్ పట్టణంలో 3500 ఇండ్లను 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం సిగ్గుచేటన్నారు. అయితే నిషేధిత జాబితాలో నుండి వాటిని తొలగించకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలో రెవెన్యూ, పోలీసుల బెదిరింపులు పెరిగిపోయాయని ఆరోపించారు. దేశంలో ఎక్కడాలేని అవినీతి తెలంగాణ రాష్ట్రంలో అవుతుందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను ఎండగట్టడంలో భాగంగా ఈ నెల 2వ తేదీన బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టడం జరుగుతుందన్నారు. 3వ తేదీన 22ఎ నిషేధిత భూములపై నవీపేట్‌లో, 4వ తేదీన వృద్ధులు వికలాంగులతో రెంజల్ మండలం సాటాపూర్ చౌరస్తాలో, 5వ తేదీన బోధన్ పట్టణంలో ఫీజు రీయంబర్స్మెంట్ పై నిరసన, 6వ తేదీన బోధన్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో నిరసన, 7వ తేదీన బోధన్ పట్టణంలో మహిళలకు ఇచ్చిన హామీలపై నిరసన, 8వ తేదీన అంబేద్కర్ చౌరస్తాలో వినతి పత్రం అందించి సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఇందుకు ప్రజలు పార్టీలకు పెద్ద ఎత్తున పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గిర్దవర్ గంగారెడ్డి, బోధన్ పట్టణ అధ్యక్షులు గాండ్ల రవీందర్ యాదవ్, సాలూర మండల అధ్యక్షులు గోగినేని నరసయ్య, కౌన్సిలర్లు ముషీర్ బాబా, గుమ్ముల అశోక్ రెడ్డి, మోబిన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హనుమాన్ ఆలయంలో వెండి ఆభరణాల చోరీ

### చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు.. నేరస్తుడి అరెస్టు

**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక గోదావరి భవన్ ముందు ఉన్న భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటనలో నిందితుడిని ఎన్ టి పి సి పోలీసులు అరెస్ట్ చేశారు.తేదీ 03.08.2026న ఆలయ పూజారి సురేష్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా, గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న పోయిల రాజు (34) అనే వ్యక్తి ఆలయ తలుపులకు కన్నం వేసి ఆలయంలోకి ప్రవేశించి, స్వామివారి 77 తులాల వెండి ఆభరణాలు, హనుమాన్ ఉత్సవ కాంస్య విగ్రహం, రెండు పెద్ద కాంస్య దీపాలు, కాంస్య మంగళహారతి, అలాగే రూ.1,000 నగదును చోరీ చేసుకుని వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు చాకచక్యంగా నిందితుడు పోయిల రాజును అదుపులోకి తీసుకుని, ఈ రోజు అతని వద్ద నుంచి 77 తులాల వెండి ఆభరణాలు, హనుమాన్ ఉత్సవ కాంస్య విగ్రహం తదితర చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.చాకచక్యంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీ సొత్తును రికవరీ చేసిన ఎస్ఐ ఉదయ్ కిరణ్, పోలీసు సిబ్బందిని సీఐ రామగుండము కృష్ణ కుమార్, ఏసీపీ మడత రమేష్ అభినందించారు.

## ప్రత్యామ్నాయ పంటలతో నిరంతర ఆదాయం

### ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమిస్తున్న రైతులు

- వరికి బదులు కూరగాయల సాగుతో లాభాలు
- పంటల వైవిధ్యంతో వాతావరణ సమస్యలకు చెక్
- పంటలతో పాటు పాంపాండ్‌తో అదనపు ఆదాయం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబరు 1 (జనం సాక్షి):** ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం లభిస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలో కంకణాల రమేష్, కంకణాల రాజు నాలుగు ఎకరాల్లో సాగుచేస్తున్న బీరకాయ, టమాట, మిర్చి, సొరకాయ, బంతి పంటలను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. పంటల సాగు విధానం, దిగుబడి, విక్రయాలు, ఆదాయ వివరాలను రైతులను అడిగి తెలుసుకుని అభినందించారు. ఎల్‌నినో ప్రభావంతో సంప్రదాయ పంటల సాగులో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు రైతులు కూరగాయలు, ఆరుతడి పంటల వైపు మళ్లడం అభినందనీయమన్నారు. భూమిలో వివిధ రకాల పంటలు సాగు చేయడం ద్వారా వాతావరణ, నీటి సమస్యలను కొంతమేర అధిగమించడంతో పాటు నిరంతర ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖల ద్వారా అందుతున్న ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంకణాల రాజు రెండు ఎకరాల్లో వరికి బదులుగా బీరకాయ, టమాట, మిర్చి, సొరకాయ, బంతి సాగు చేస్తున్నారు. బీరకాయను మల్చింగ్ విధానంలో సాగు చేస్తుండగా, ప్రస్తుతం పంట చేతికొచ్చింది. ఎకరానికి అన్ని ఖర్చులు పోను రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు. పంటల సాగుతోపాటు గత ఏడాది పొలంలో పాంపాండ్ నిర్మించడంతో వర్షపు నీరు నిల్వ ఉండి బోరులో భూగర్భ జలాలు సమృద్ధిగా లభిస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ద్వారా పంటలకు నీరందిస్తున్నారు. పాంపాండ్‌లో చేపల పెంపకం చేపట్టి ఆరు నెలలకు ఒకసారి విక్రయించడం ద్వారా రూ.40 వేల వరకు అదనపు ఆదాయం పొందుతున్నట్లు వివరించారు. అనంతరం పాంపాండ్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు విస్తరణకు సహకరించండి

### బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తుల డిమాండ్

- ఇళ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వాలి : ఆర్డీవో షర్మిల
- ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని కోరిన గ్రామస్థులు

**చిగురుమామిడి, (జనంసాక్షి):** రోడ్డు విస్తరణ పనులకు గ్రామస్తులు సహకరించాలని కరీంనగర్ ఆర్డీవో షర్మిల కోరారు. చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య అధ్యక్షతన రోడ్డు విస్తరణపై గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలు, ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని రహదారి అభివృద్ధి చేస్తున్నామని, పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కాగా, రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలో సుమారు 50 ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తగిన నష్టపరిహారంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే పనులకు సహకరిస్తామని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణ విషయంలో రాజకీయాలకు తావులేకుండా బాధితులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. బైపాస్ రోడ్డు నిర్మిస్తే గ్రామ అభివృద్ధి దెబ్బతింటుందని, ప్రస్తుత ప్రాంతంలోనే రహదారి విస్తరణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, అధికారులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న వారందరినీ అన్ ఫిట్ చేయాలి

- ప్రతినెల 2 మెడికల్ బోర్డులు నిర్వహించాలి
- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన



**రామగిరి సెప్టెంబరు 1 (జనంసాక్షి):** సింగరేణిలో తీవ్ర అనారోగ్యాల బారిన ఉన్న కార్మికులను సైతం మెడికల్ ఇన్వాల్యుడేషన్ చేయడం లేదని దీంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పేర్కొంటూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం శీషి 2 గనిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్మికులందరితో కలిసి ర్యాలీగా వెళ్లి యాజమాన్యానికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. భూగర్భగనుల్లో ఆరుగాలం శ్రమించి బొగ్గు ఉత్పత్తికి పనిచేస్తున్న క్రమంలో కార్మికుడు తీవ్ర అనారోగ్యాలకు మరియు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని బార్డర్లో సైనికులకు ఇస్తున్న విలువను సింగరేణి కార్మికుల సైతం అందజేయాలన్న సదుద్దేశంతో గతంలో టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు 13వేల పైచిలుకు కారుణ్య నియామకాలను మెడికల్ ఇన్వాల్యుడేషన్ ద్వారా ఇవ్వడం ద్వారా కార్మికులను ఆదుకున్న వారు అయ్యారని తెలిపారు. అప్పట్లో 70% పైచిలుకు అన్ ఫీట్లు అయినప్పటికీ ఇంకా ఎక్కువ చేయాలని అప్పటి సంఘాలు ఏఐటియుసి ఐఎన్టియుసి నిరసన కార్యక్రమాలు చేపట్టారని వారు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా గెలిచిన తర్వాత క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు కూడా నిర్వహించలేకపోయారని, ఒకటి రెండు మెడికల్ బోర్డులు పెట్టినప్పటికీ వాటిలో అతి తక్కువ మందికి అన్ని ఫీట్లు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. కార్మికుల అనారోగ్యాలను పరిగణలోకి తీసుకొని ఇప్పటినుండి అయినా క్షణం తప్పకుండా నెలకు రెండు లేదా మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి అనారోగ్య బారిన ఉన్న కార్మికుల అందరిని మెడికల్ అన్ఫిట్ చేసి ఆదుకోవాలని లేఖ ద్వారా వివరించగా టీబీజీకేస్ నాయకులు కార్మికులు కలిసి ఇచ్చిన వినతి పత్రాన్ని కంపెనీ చైర్మన్ గారికి పంపుతామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓసి టు బేస్ వర్క్ షాప్ సెక్రెటరీ చిప్ప సురేష్, సెంట్రల్ కమిటీ నాయకులు దేవ శ్రీనివాస్ ,పాశం శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ ఫీట్ సెక్రటరీ వీరగోని సంతోష గౌడ్, రిలే షిఫ్ట్ ఇంచార్జ్ బర్ల సుధాకర్, పోయిల భూమయ్య సీనియర్ నాయకులు సుగుణాకర్ రావు మోహన్, రమేష్, శ్రీనివాస్, గట్టయ్య, కిరణ్ ,రవి, వికాస్ శ్రీనివాస్ రెడ్డి పురుషోత్తం సుధాకర్, శ్రీకాంత్, సూర్య ప్రకాష్, సంజీవ్, తిరుపతి, మూగ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### సెప్టెంబర్ఎ 3న ఎన్ఆర్ఐ కోట సీట్లకు వాక్ఇన్ కౌన్సిలింగ్

**రాజేంద్రనగర్:** 2026-27 విద్యా సంవత్సరానికి ఎన్ఆర్ఐ, ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటాలో మిగిలిన యూజీ సీట్ల భర్తీకి సెప్టెంబర్ 3న వాక్ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఎగ్జామినేషన్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు సైతం కౌన్సిలింగ్ కు హాజరు కావచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ను సందర్శించి, అవసరమైన పత్రాలు, ఫీజుతో హాజరు కావాలని సూచించారు.



## నకిలీ ఫోన్‌పే, గూగుల్‌పేతో మోసాలు.. ముగ్గురి అరెస్ట్

### నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

### డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన


**అంబర్‌పేట, సెప్టెంబరు 1 (జనం సాక్షి):** ఏటీఎంల వద్ద నగదు తీసుకునే అమాయకులను నకిలీ ఫోన్‌పే, గూగుల్‌పే యాప్‌లతో మోసం చేస్తున్న ముగ్గురు నిందితులతో పాటు ఓ బాల నేరస్తుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌బీఐ పర్సనల్ బ్యాంకింగ్ బ్రాంచ్ అంబర్‌పేట చీఫ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మలక్‌పేటకు చెందిన విద్యార్థి మహమ్మద్ సల్మాన్ ఖాన్ (19), ఓల్డ్ మలక్‌పేటకు చెందిన కారు డ్రైవర్ రోషన్‌కుమార్ (23), దబీర్‌పురకు చెందిన రాపిడో, జొమాటో డెలివరీ వర్కర్ సయ్యద్ రవిష్ మెహదీ (23), మరో బాల నేరస్తుడు ఈ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం వద్ద నగదు తీసుకున్న వారిని గుర్తించి, ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా సమాన మొత్తాన్ని పంపిస్తామని నమ్మించేవారు. అనంతరం నకిలీ యాప్ ద్వారా నగదు బదిలీ అయినట్లు చూపించే స్క్రీన్‌షాట్‌ను బాధితులకు చూపించి, నగదు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యేవారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.12,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహమ్మద్ సామియాజ్ జమ దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ జి.జగన్, ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో క్రైమ్ టీమ్ దర్యాప్తులో పాల్గొంది.

## ఎంసిలపల్లి మున్సిపాలిటీకి నిధులు కేటాయించాలి

**శామీర్ పేట్, ఆగష్టు 1(జనం సాక్షి) :** మూడు చింతలపల్లి మున్సిపాలిటీకి నిధులు కేటాయించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి ఎంసిపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ వినతి పత్రం అందజేశారు. ఈ మున్సిపాలి టీలో నిధుల కొరత అధికంగా ఉ ండి వచ్చిన జనరల్ ఫండ్స్ సిబ్బంది జీతాలకే సరిపోవడం లేదని,మున్సిపాలిటీ యొక్క అభివృద్ధి దృశ్య ప్రజలకు మౌలిక సదుపాయాలు సిసి రోడ్లు డ్రైనేజీ పారిశుద్ధ్య నిర్వహణ తాగునీటి కొరకు వీధి దీపాలకు మున్సిపాలిటీలోని 24 వార్డు లకు అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని ప్రజా పాలనలో భాగంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.

## పనుల వేగం పెంచాలి.. గడువులోగా పూర్తి చేయాలి

- ఆర్అండ్‌బీ పనులు మార్చి నాటికి పూర్తి చేయాలి
- 'సర్' క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబరు 16 వరకు అవకాశం
- తెలంగాణ జలసిరి పనులు అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలి
- పనుల నాణ్యత, పురోగతిపై నిరంతర పర్యవేక్షణ



**పెద్దపల్లి, సెప్టెంబరు 1 (జనంసాక్షి):** జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆర్అండ్‌బీ, తెలంగాణ జలసిరి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మండలాల వారీగా చేపడుతున్న రహదారులు, భవనాలు, ఇతర పనులను పరిశీలించిన కలెక్టర్ ప్రారంభం కాని, వివిధ దశల్లో ఉన్న, పెండింగ్ పనుల వివరాలను తెలుసుకున్నారు. అన్ని పనులను వేగవంతం చేసి వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, రహదారులు, భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పనుల పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపులను సమర్థంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.
అనంతరం 'సర్' కార్యక్రమంపై అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబరు 16లోగా సమర్పించవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,49,194 నోటీసులు జారీ చేయగా, 58,313 నోటీసులను ఓటర్లకు అందజేసినట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న వారు నిర్దేశిత గడువులోగా విచారణకు హాజరై అవసరమైన ఆధారాలు సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితాలో పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను ఓటర్లు పరిశీలించుకుని తప్పులుంటే క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నా మని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో చేపడుతున్న తెలంగాణ జలసిరి పనులను అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ప్రతి గ్రామంలో నిర్దేశిత లక్ష్యం మేరకు పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, రైతులు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అవసరమైన ప్రాంతాలను గుర్తించి పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, రైతుల పొలాల్లో పంట కుంటలు, బోర్‌వెల్స్ వద్ద రీచార్జ్ గుంతలు ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించాలని, పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశాల్లో జడ్పీ సీఈఓ నరేందర్, డీఆర్‌డీఓ కాళిందిని, డీపీఓ శ్రీమల, ఆర్అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, ఏఈలు, డీఈలు, ఎంపీడీవోలు, ఎంఓపీఓలు, ఎన్నికల విభాగం అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, WAHEED UDDIN S/o. MAHABOOB ALI, R/o. H.No. 10-5-391/54/61 /C, Syed Nagar, First Lancer, Asif Nagar, Hyderabad, Telangana-500028, Passport No. F3597438, have corrected my name from WAHEED UDDIN to MOHAMMED WAHEED vide Affidavit dated 29-08-2026. Henceforth I shall be known as MOHAMMED WAHEED.



## మల్లిలో శ్రీశా ఫార్మాల్డి హైడ్ రసాయన పరిశ్రమ ఏర్పాటుకు బ్రేకులు

- దరఖాస్తును తిరస్కరించిన కేంద్ర పర్యావరణ శాఖ
- యువత పోరాటంతో కెమికల్ ప్లాంట్ ప్రతిపాదనకు బిగ్ షాక్

**న్యాల్ కల్, సెప్టెంబర్ 01, (జ్వరం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు పెను ప్రమాదకరంగా మారిన రసాయన పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలకు బ్రేకులు పడ్డాయి. కెమికల్ ప్లాంట్ ప్రతిపాదన కోసం దరఖాస్తు చేసుకున్న నిర్వాహకులకు.. కేంద్ర పర్యావరణ శాఖ బిగ్ షాక్ ఇచ్చింది. పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిపాదనలో.. పర్యావరణ శాఖకు విరుద్ధంగా ఉన్నాయని, ఈ మేరకు ఇచ్చిన ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖ తాజాగా తిరస్కరించింది. గత వారం రోజులుగా స్థానిక యువత చేపట్టిన పోరాటం ఫలించింది.

**మల్లిలో శ్రీశా ఫార్మాల్డి హైడ్ రసాయన పరిశ్రమకు తిరస్కరణ**

తెలంగాణ - కర్ణాటక సరిహద్దు, సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, మల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 152/ఖ/2 వ్యవసాయ భూమిలో శ్రీశా ఫార్మాల్డి హైడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు, సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ తయారీ యూనిట్ కోసం కంపెనీ యాజమాన్యం.. ప్రతిపాదనలతో కేంద్ర పర్యావరణ శాఖకు అనుమతి కోసం ఇటీవల దరఖాస్తు చేసింది. దరఖాస్తులు స్వీకరించిన కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది. అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నేపథ్యంలో దరఖాస్తు తిరస్కరించి వెనక్కి పంపించింది.

**యువత, రైతుల ఫిర్యాదులు, వినతుల నేపథ్యంలో..**


కేంద్ర పర్యావరణ శాఖకు విరుద్ధంతో పాటు స్థానిక రైతులు, యువత ఫిర్యాదులు, వినతుల నేపథ్యంలో కెమికల్ పరిశ్రమ ఏర్పాటు కోసం ఇచ్చిన దరఖాస్తును వెనక్కి పంపినట్లు కేంద్ర పర్యావరణ శాఖ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు 25న నిర్వహించిన కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల కమిటీ సమావేశంలో దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. పరిశ్రమలు ఏర్పాటుకు కావలసిన ప్రధానమైన 15 అంశాలు అస్పష్టతగా ఉన్న నేపథ్యంలో దరఖాస్తును వెనక్కి పంపినట్లు తెలిసింది.

**వారం రోజులుగా యువత పోరాటం**

గ్రామానికి చెందిన పలువురు యువకులు కెమికల్ ప్లాంటు ఏర్పాటుకు వ్యతిరేకంగా గత వారం రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన చేపట్టారు. పరిశ్రమ ఏర్పాటుతో గ్రామ ప్రజానీకానికి, పర్యావరణానికి, వ్యవసాయ రంగానికి, జల కాలుష్యం, అనారోగ్యాల బారిన పడి ప్రమాదం పొంచి ఉందని యువకులు ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారం రోజుల క్రితం సేకరించిన సంతకాల సేకరణను పర్యావరణ శాఖకు పోస్టు ద్వారా నివేదికను సమర్పించారు. ఎట్టకేలకు కేంద్ర పర్యావరణ శాఖ, నిపుణుల కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి కెమికల్ ప్లాంట్ ప్రతిపాదన ఏర్పాటుకు బ్రేకులు వేయడం పట్ల స్థానిక యువకులు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తిరిగి కెమికల్ ప్లాంట్ ప్రతిపాదనకు అనుమతులు ఇచ్చి పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తామని యువత, రైతులు స్పష్టం చేశారు.







## ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పటిష్ఠ చర్యలు

- అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- పథకాలు అర్హులకు చేరేలా చూడాలి
- బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి
- ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలి




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబరు 1 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. మానవీయ కోణంలో ప్రజలకు సేవలందించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం పర్యటించిన ఆయన, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేశ్ బి. గితే, వివిధ శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగంగా, పారదర్శకంగా పూర్తిచేసి బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి నెల చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించి, ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. అభివృద్ధి పనులకు నిధులు పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని పారిశుధ్య కార్మికులకు ఎస్‌బీఐ ఖాతాలు తెరిపించి బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందరికీ సమాన న్యాయం చేస్తూ అందిస్తున్న సేవలను చైర్మన్ అభినందించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారని వివరించారు. జిల్లాలో ఈ ఏడాది 32 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. ఎస్సీలకు ఎస్‌డీఎఫ్ కింద 169 పనులకు రూ.4.29 కోట్లు, ఎస్టీలకు 38 పనులకు రూ.89 లక్షలు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కింద 2,315 మంది ఎస్సీలకు, 436 మంది ఎస్టీలకు ఇళ్లు మంజూరయ్యాయి. టీపీఆర్ఐడీ కింద గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు 233 యూనిట్లకు రూ.6.90 కోట్లు, ఎస్టీలకు 76 యూనిట్లకు రూ.2.66 కోట్లు మంజూరయ్యాయి. ఎస్సీ కులాంతర వివాహాలకు 44 జంటలకు రూ.1.10 కోట్ల బడ్జెట్ మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్వో జయశ్రీ, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు, సంక్షేమ అధికారులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శిరీష కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది: మంత్రి సీతక్క

**భరోసాగా రూ.7.30 లక్షలు ఇల్లు, ఉద్యోగం, భూమి**




**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి ) :** హైదరాబాద్ లో దారుణ హత్యకు గురైన చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుదని మంత్రి సీతక్క వెల్లడించారు. మంగళవారం చౌటిగూడెం బాధిత కుటుంబం ఇంటికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రూ. లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి తాను వ్యక్తిగతంగా మరో రూ. లక్ష సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తంగా రూ.7.30 లక్షల ఆర్థిక సాయం అందనుంది.

కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతోపాటు, జీవనోపాధి కోసం భూమి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కుటుంబానికి ఆసరాగా నిలిచిన శిరీషను కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. కుటుంబాన్ని పోషించే శిరీష మృతి ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, జహీర్, కారం సుదీర్,తాండ్ర ప్రభాకర్ రావు, ఈర్ల రామ్మోహన్ రావ్, పాలకుర్తి సుమిత్, సర్పంచ్ కుంజా వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## 12న జాతీయ లోక్ అదాలత్

### రాజీ మార్గంలో కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం

- చెక్ బౌన్స్, రోడ్డు ప్రమాద కేసులకు పరిష్కారం
- భూ తగాదాలు, రాజీ పడదగిన కేసులపై దృష్టి
- న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలి



**కరీంనగర్ లీగల్, సెప్టెంబరు 1 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా కోర్టులో ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ తెలిపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ అదాలత్‌ను పెండింగ్ కేసులను రాజీ మార్గంలో సత్వరంగా పరిష్కరించుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ నిర్వహణపై అవగాహన కల్పించేందుకు మంగళవారం బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా చెక్ బౌన్స్, రోడ్డు ప్రమాదాలు, భూ తగాదాలు, ఇతర రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందని యశ్వంత్ సింగ్ తెలిపారు. ఏళ్ల తరబడి కోర్టుల్లో కొనసాగుతున్న కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ఇరుపక్షాల అంగీకారం, రాజీ ప్రధాన మని, ప్రజలకు సత్వర న్యాయం అందించడమే న్యాయ సేవా సంస్థల లక్ష్యమని వివరించారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని, పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయ సేవా సంస్థకు అండగా ఉంటామని తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బొజ్జ స్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉపాధ్యాయుల కరుణశ్రీతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

## మైనారిటీల ఆర్థిక సాధికారతే లక్ష్యం

- స్వయం ఉపాధి వైపు మహిళలను ప్రోత్సహిస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు
- ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద 225 మందికి రూ.50 వేల చొప్పున చెక్కులు..
- 57 మందికి జనరేటర్ టూల్‌కిట్లు పంపిణీ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి వైపు నడిపించడమే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రభుత్వం వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్ ఒబేదుల్లా, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు అందించే ప్రతి రూపాయి కుటుంబ అభ్యున్నతికే వినియోగమవుతుందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మేడ్చల్ జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తుండగా, తుర్కకాశి వర్గానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు రూ.60 వేల విలువైన జనరేటర్ టూల్‌కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. మైనారిటీల జీవనోపాధి మెరుగుదలకు 'రేవంత్ అన్నాకా సహారా-మిస్కినో కే లియే' పథకం కింద మోపెడ్లు, మహిళలకు కుట్టు యంత్రాలు అందిస్తున్నామని చెప్పారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో మైనారిటీలు, బడుగు బలహీన వర్గాలు అభివృద్ధికి దూరమయ్యాయని విమర్శించిన మంత్రి, ఇందిరమ్మ పాలనలో ప్రతి వర్గానికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, భూపతిరెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.




### రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

**హైదరాబాద్:** రూ.10 వేల లంచం తీసుకుంటూ టోలిచౌకి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్సై ఆర్.పాండు నాయక్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మంగళవారం సిటీ రేంజ్-1 ఏసీబీ అధికారులు వలపన్ని ఎస్సైను అదుపులోకి తీసుకున్నారు. తన తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా కుటుంబ సభ్యుల మధ్య సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తానని, ఫిర్యాదుదారుడి పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు రూ.10 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. లంచం స్వీకరిస్తుండగా పట్టుకుని, నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ విధులను నిజాయితీగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


## సయాజీ సీడ్ కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించాలి

- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల వినతి
- ఎకరాకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని డిమాండ్
- కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**వీణవంక, సెప్టెంబరు 1 (జనం సాక్షి):** సయాజీ సీడ్ కంపెనీ వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించి, సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన రైతులు వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని బుర్గుల రామకృష్ణ భవన్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 2024, 2025 రబీ సీజన్లలో కంపెనీ సూచనల మేరకు 'అడ, మగ' వరివంగడాల సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని రైతులు తెలిపారు. పంట దిగుబడి రాకపోతే ఎకరాకు రూ.80 వేల నుంచి రూ. లక్ష వరకు నష్టపరిహారం చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు పరిహారం అందించలేదని ఆరోపించా రు. చర్చల పేరుతో కొంతమంది రైతులను గుజరాత్‌లోని కంపెనీ కార్యాలయానికి పిలిపించినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. వీణవంక, మానకొండూర్, కేశవపట్నం, మంథని, చిట్యాల మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన సుమారు 80 మంది రైతులు కమిషన్‌ను ఆశ్రయించారు.

ఎకరాకు రూ.లక్ష పరిహారంతో పాటు సాగుకు వెచ్చించిన ఇన్‌పుట్ ఖర్చులను కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కోదండరెడ్డి కంపెనీపై చర్యలకు సిఫారసు చేస్తామని, రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370

# సౌండ్ రెగ్యులేషన్ కంట్రోల్ కమిషన్ వేయాలి

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు
- వినాయక చవితి ఉత్సవాల్లో ఫ్యాడ్బ్యాండ్ వెహికల్స్‌కు అనుమతి ఇవ్వాలి
- తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం



**ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** వినాయక చవితి ఉత్సవాలలో ఫ్యాడ్బ్యాండ్ వెహికల్స్ కు అనుమతి ఇవ్వాలని తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో అశ్వాల హనుమంత్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చెరుపల్లి సీతారాములు హాజరై మాట్లాడుతూ బ్యాండ్ కళాకారుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి మరొకసారి తీసుకెళ్లేందుకు తన వంతు ప్రయత్నం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే డిజిపి, మంత్రులు పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామణి దీని మూలంగా బోనాల పండుగ ప్రశాంతంగా జరిగిందని అన్నారు. అలాగే బ్యాండ్ కళాకారులు సౌండ్ ఎక్కువ మోతాదులో పెట్టకుండా తక్కువ మోతాదులో ఉండేలా ప్రజలకు అశాంతి కలగకుండా నియంత్రణలో ఉండాలని కోరారు. ప్రత్యేక పండుగలు ద్వారా సంవత్సరంలో 30 రోజులు అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వం చట్టం చేయాలని సౌండ్ రెగ్యులేషన్ కమిషన్ వేస్తే సౌండ్ ఎంత పెట్టాలని నిబంధనలు ఉన్నప్పుడు ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. దీనికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు తీర్మానం ప్రవేశపెట్టారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలలో బ్యాండ్ కళాకారులపై నిర్బంధం తగదన్నారు వినాయక చవితి పండుగ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తే తీసుకుంటుంది మరి బ్యాండ్ కళాకారులకు ఆదాయం రాకూడదా అని ప్రశ్నించారు. గణేష్ ఉత్సవాలలో ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక సామాజిక వర్గాలకు మండపానికి గుంత తవ్విన కూలి నుండి బ్యాండ్ శోభాయాత్ర ముగించే వరకు వేల కుటుంబాలకు ఈ పండగ ద్వారా ఉపాధి కలుగుతుంది వేలా కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తా ఉంది కానీ సౌండ్ పొల్యూషన్ పేరుతో నిరుపేదలైనటువంటి బ్యాండ్ కళాకారుల ఉపాధిని దెబ్బతీస్తే సహించేది లేదని అన్నారు. తెలంగాణ సంస్కృతిలో మత ఆచార పండగలలో తెలంగాణ ప్రజానీకం సంగీతం వాయిద్యం బ్యాండ్ వాటి ద్వారా సంతోషాన్ని వ్యక్తపరుస్తూ వినాయక చవితి ముగింపు పలుకుతారన్నారు అలాంటి ఆనందదాయకమైన ముగింపులో ప్యాడ్ బ్యాండ్ లాంటి వాటిని ఉపయోగిస్తే నష్టం లేదు డీజే మేము వ్యతిరేకం ప్రజల ఆరోగ్యం రీత్యా డీజేలో సహించేది లేదని అదే క్రమంలో పాడ్ బ్యాండ్ కళాకారులను ఇబ్బందులకు గురి చెయ్యొద్దని, వెహికల్స్ సీజ్ చేసిన కళాకారులపై కేసులు పెట్టిన భాగ్యనగర్ ఉత్సవ గణేష్ ఉత్సవ సమితి చూస్తూ ఊరుకోదని బ్యాండ్ కళాకారుల పక్షాన నిలబడుతుందని హామీ ఇచ్చారు. ప్రత్యక్ష ఆందోళన పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని చెప్పారు. వెంటనే ప్రభుత్వం సౌండ్ రెగ్యులేషన్ కంట్రోల్ కమిషన్ వేయాలనే కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదు జిల్లా సెక్రెటరీ వేముల శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచర్ల శేఖర్ హైదరాబాద్ సంఘం గౌరవ అధ్యక్షులు సురేందర్ శెట్టి నాయకులు దేవేందర్ ప్రవీణ్ హుస్సేన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు మరియు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీలో పారదర్శకత పెరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందేలా చేస్తామని అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ చెక్కులు అండగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పార్థసింహారెడ్డి, తాసిల్దార్ సురేందర్, డిప్యూటీ తాసిల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో వి.ప్రవీణ్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు చేకూర్త గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మరియు మున్సిపల్ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి,మడపతి చంద్రమౌళి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, సర్పంచులు, బల్వంత్ రెడ్డి,చిట్టెంపల్లి శేఖర్, బీరయ్య, రవీందర్ రెడ్డి,సురేందర్ గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ కాడి గారి రాజశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ లు అంతారం శ్రీనివాస్,కుమ్మరి లక్ష్మయ్య,మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్,మహబూబ్ హుస్సేన్ మరియు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

- పర్యావరణహిత జీవనశైలిపై 16 ఏళ్లుగా జాగృతి అభ్యుదయ సంఘం చైతన్యం

**హయత్ నగర్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు ఆచరణాత్మక పరిష్కారాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకునేలా ప్రజలను చైతన్యపరచడంలో జాగృతి అభ్యుదయ సంఘం గత 16 సంవత్సరాలుగా నిరంతర కృషి చేస్తోందని సంఘం ప్రతినిధులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో పర్యావరణహిత విధానాలను పాటించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం, భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణం సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, ప్రజలను పర్యావరణహిత వస్తువుల వినియోగం వైపు ప్రోత్సహించడం వంటి అంశాలపై జాగృతి అభ్యుదయ సంఘం అనేక సంవత్సరాలుగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వివిధ రకాల పర్యావరణహిత విగ్రహాలు, మోడల్స్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## 50 వేల విగ్రహాలు.. వందలాది మోడల్స్

వనస్థలిపురం గురుద్వారా రోడ్‌లోని రామాలయంలో సుమారు 50 వేల విగ్రహాలు, వందలాది మోడల్స్ వివిధ రకాల సైజుల్లో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు, ప్రజలు వీటిని సందర్శించి పర్యావరణహిత ఆలోచనలను తెలుసుకోవడంతో పాటు, తమ అవసరాలకు అనుగుణంగా విగ్రహాలు, మోడల్స్‌ను ఎంపిక చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేకంగా పర్యావరణానికి హాని కలిగించని విధానాలను ప్రోత్సహించడం ద్వారా పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక వేడుకలను కూడా పర్యావరణహితంగా నిర్వహించవచ్చనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ ఉద్దేశమని సంఘం ప్రతినిధులు తెలిపారు.

## భక్తుల్లో పర్యావరణ చైతన్యం పెంచాలని పిలుపు

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వచ్చే భక్తులు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జాగృతి అభ్యుదయ సంఘం పిలుపునిచ్చింది. ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి, పర్యావరణహిత జీవనశైలిని పాటించాలని కోరింది. "పర్యావరణ పరిరక్షణను మాటల్లో కాకుండా ఆచరణలో చూపిద్దాం.. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందిద్దాం" అని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

# రూ.21.37 లక్షల హ్యాష్ ఆయిల్ పట్టివేత

- ఎస్ఆర్‌నగర్‌లో ఇద్దరు అరెస్ట్.. ఒడిశా నుంచి రైలులో తరలింపు
- మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు

**అమీర్‌పేట్ / సనత్‌నగర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో హ్యాష్ ఆయిల్ విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.710 కిలోల హ్యాష్ ఆయిల్ (వీడ్ ఆయిల్), రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన హ్యాష్ ఆయిల్ విలువ సుమారు రూ.21.37 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈస్ట్ శ్రీనివాస్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్ లేన్ వద్ద హ్యాష్ ఆయిల్ విక్రయించేందుకు ఇద్దరు వ్యక్తులు వస్తున్నారన్న సమాచారం ఎస్ఐ ఏ. ఉమాకు అందింది. ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాసరెడ్డి అనుమతితో పోలీసులు, క్లూస్ టీం సహకారంతో పంచుల సమక్షంలో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో అక్కడ మాటువేశారు. అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా హ్యాష్ ఆయిల్ బయటపడింది. అరెస్టయిన వారిని లిలిఏపీకి చెందిన పొద్దు మోహన్‌రావు (46), తంగుల బిస్తుదాసు (28)లిలిగా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒడిశాలోని చంపాగూడకు చెందిన రాజు ద్వారా హ్యాష్ ఆయిల్ వ్యాపారంలోకి వచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ నెల 30న సుమారు 1.710 కిలోల హ్యాష్ ఆయిల్‌ను తీసుకుని విశాఖపట్నం నుంచి రైలులో సికింద్రాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి ఆటోలో ఎస్ఆర్‌నగర్ వాటర్ ట్యాంక్ ప్రాంతానికి విక్రయించేందుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఏ-3 రాజు, ఏ-4 వెంకట్ పరారీలో ఉన్నారని,




వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సెక్షన్ 8(ఢ) రెడ్ విత్ 20(ఏ)(జ), 29 కింద కేసు నమోదు చేశారు. నిందితులకు అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ దాడిలో ఎస్ఐ ఏ. ఉమా ఆధ్వర్యంలో పీసీలు ఎం. నాగమణి నాయక్, రాహుల్‌కుమార్, అవినాష్, మోహన్‌రావుతో పాటు క్లూస్ టీం పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



**హయత్‌నగర్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ కళాశాలలో భోజన విరామ సమయంలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. "పెన్షన్ భిక్ష కాదు.. పెన్షన్ హక్కు", "పెట్టుబడుల పెన్షన్.. మాకొద్దు టెన్షన్" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల లైబ్రేరియన్ డా. ఏ. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం లో అనేక లోపాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో సుమారు 2.80 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులు ఉన్నారని, పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు తగిన పెన్షన్ భద్రత లేకుండా పోతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సీపీస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీసీజీటిఏ, టీజీసీటిఏ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శు లతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి



**కేశంపేట, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేముల నర్వ గ్రామపంచాయతీతో పాటు ఆమ్లెట్ గ్రామం చౌదరిగుడాలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను సోమవారం రాత్రి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను నాయకులు, యువత తన దృష్టికి తీసుకొని వస్తే సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని నవీన్ రెడ్డి అన్నారు. ఐమాక్స్ లైట్లను లను ఏర్పాటు చేసిన నవీన్ రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రఘునాథ్ యాదవ్ , గ్రామ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నర్సింలు, సర్పంచులు బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి, మంద మంజుల జంగయ్య, బొజ్జం సంతోష శ్రీశైలం, నాగిళ్ల వెంకట్, లలిత కిరణ్ గౌడ్, తౌర్యా నాయక్, నాయకులు తాంద్ర విష్ణువర్ధన్ రెడ్డి, యారం శేఖర్ రెడ్డి, శేఖర్ పంతులు, ప్రభాకర్ రెడ్డి, తోట ఆంజనేయులు, కృష్ణయ్య, శివకుమార్, సత్యనారాయణ, కోటేశ్వర్, రామ్ రెడ్డి, సహదేవ్, సుదర్శన్ గుప్తా, మల్లేష్, మురళీమోహన్, తుకారం, జగన్ రెడ్డి, అశోక్, యాదగిరి, కృష్ణ, సాయిరాం, శ్రీను పాల్గొన్నారు.

# పట్లూర్‌లో హిందూ స్మశాన వాటిక భూమి కబ్జా

- భూ కబ్జాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని
- మర్పల్లి తహసిల్దార్ కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



**మర్పల్లి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** భూ బకాసురులకు ఏ భూమైతే మాకేంటి కబ్జా చేయడమే వారి పని, కొన్ని శతాబ్దాల క్రితం వివిధ చేతివృత్తుల వారికి కేటాయించిన హిందూ స్మశాన వాటిక సమాధుల భూమిని కబ్జా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో ఈ కబ్జా జరిగింది. వివరాలు లోకి వెళ్తే పట్లూర్ గ్రామ పరిధిలోని 417, 416, 415 గల సర్వే నెంబర్లు గత 100 సంవత్సరాల నుండి గ్రామంలోని 22 కులాలకు చెందిన వారి చనిపోయిన వారి అంత్యక్రియలు అదే స్మశానిక వాటికలో జరుపుతూ వస్తున్నారు. గత పూర్వికులు ఇట్టి భూమిని స్మశానిక వాటిక కోసం ఇచ్చారని, ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తులు సర్వే చేయిస్తే తమకు వచ్చిందని కబ్జా చేశారు. కావున తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు తగు విచారణ జరిపి అక్రమ కబ్జాదారుల నుండి స్మశానిక వాటిక భూమిని కాపాడి వారిపై చట్టపరయమైన చర్యలు తీసుకోవాలని మర్పల్లి తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామస్తులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

# బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించిన కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి నలుపు రంగు పూయడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ఎదుర్కోలేక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ పార్టీ అసహనానికి నిదర్శనమని వారు ఆరోపించారు. ఈ ఘటనకు నిరసనగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హాజరు కాకుండా అడ్డుకునే ఉద్దేశంతో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, "బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే. దాడులు, నిర్బంధాలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రజాస్వామ్య



హక్కును అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య. హౌస్ అరెస్ట్ చేసినంత మాత్రాన మా పోరాటాన్ని ఆపలేరు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్, హైకోర్ట్ కాలనీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు అలిమినేటి నర్సింహా రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, కార్యదర్శి శక్తి సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇట్టబోయిన నర్సింహా, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ శ్మశానవాటికా.. లేక డంపింగ్ యార్డా..?

- ఐదు రోజుల్లో కార్యాచరణ ప్రకటించాలి
- రూ.2 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి
- లేకపోతే బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతాం
- బీసీ శ్మశానవాటికల దుస్థితిపై కందుకూరి రాజ్‌కుమార్ ఆగ్రహం



**తాండూరు, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** తాండూరు నియోజకవర్గ బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ నేతృత్వంలో తాండూరులోని పాత తాండూరు మరియు తాండూరు బీసీ శ్మశానవాటికలను సందర్శించి పరిశీలించారు. ముఖ్యంగా తాండూరు పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న బీసీ శ్మశానవాటిక అత్యంత దారుణమైన పరిస్థితిలో ఉందని కందుకూరి రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ఉన్న షాపులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు పెద్దఎత్తున చెత్తాచెదారాన్ని శ్మశానవాటికలోనే వేయడంతో ఆ ప్రాంతం క్రమంగా డంపింగ్ యార్డుగా మారిపోయిందని అన్నారు. అదేవిధంగా ఆ మార్గంలో వచ్చిపోయే వారు బహిరంగంగా మాలమూత్ర విసర్జన చేయడం వల్ల పరిసర ప్రాంతమంతా తీవ్ర దుర్వాసనతో, అపరిశుభ్రంగా మారిందని తెలిపారు. విపరీతంగా పెరిగిన ముళ్లచెట్లు, కంపచెట్లు, పొదలతో శ్మశానవాటికలోకి వెళ్లేందుకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇది శ్మశానవాటికా? లేక డంపింగ్ యార్డా?" అని కందుకూరి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను సూటిగా ప్రశ్నించారు. తాండూరులోని బీసీ శ్మశానవాటికల అభివృద్ధి కోసం గతంలో అనేకసార్లు పాలకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసి విజ్ఞప్తులు చేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా శ్మశానవాటికలను సందర్శించి అక్కడి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. ఐదు రోజుల్లోగా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, తాండూరులోని బీసీ శ్మశానవాటికల అభివృద్ధికి రూ.2 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని బీసీ సంఘం తరపున సూటిగా డిమాండ్ చేస్తున్నామని కందుకూరి రాజ్‌కుమార్ తెలిపారు. శ్మశానవాటికలను కేవలం తాత్కాలికంగా శుభ్రం చేయడం కాకుండా ప్రహరీ, గేటు, పారిశుధ్యం, విద్యుత్, లైటింగ్, నీటి సౌకర్యం, షెడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులతో పూర్తిస్థాయిలో ఆధునికంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. "ఐదు రోజుల్లోగా కార్యాచరణ ప్రకటించకపోతే బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం అని కందుకూరి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సందర్శించిన వారిలో బీసీ సంఘం జిల్లా నాయకులు గడ్డం వెంకటేశ్,నాయి బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు పరమేశ్, బీసీ సంఘం ప్రతినిధులు మంతటి రాజు, నరహరి గోపాల్, నవీన్, శివ,రమేష్, పరమేశ్, రవి, సీనూ, కిరణ్ ఓ వినయ్ తదితరులు ఉన్నారు.

# సమగ్ర భూసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**యాలాల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** సమగ్ర భూసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనిఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం యాలాల్ మండలం లక్ష్మీనారాయణపూర్ గ్రామంలో సమగ్ర భూసర్వే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్ర భూసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా, భూ రికార్డులు పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను గ్రామస్తులకు వివరించారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వారి అభిప్రాయాలు మరియు సూచనలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.